లీడర్

సంచలన వార్తా పత్రిక

SANCHALANA VAARTHA PATRIKA LEADER

గురువారం • 7 ఫిబ్రవరి 2019 । సంపుటి : 21 సంచిక : 194 । ఎడిటర్ : వి.వి.రమణమూర్తి । 8 పేజీలు । వెల : రూ. 2.00

Published from Visakhapatnam, Rajahmundry and Hyderabad

Read / Share / Follow

www.leaderepaper.com

www.facebook.com/leaderramanamurthy/

www.twitter.com/leaderramanamurthy/



కామ్రేడ్ కిషోరం?

సీపీఎంలోకి వైరిచర్ల
అరకు నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ

(ప్రత్యేక ప్రతినిధి)

కాంగ్రెస్ రాజకీయాలలో పండిపోయిన సీనియర్ మోస్ట్ నాయకుడు వైరిచర్ల కిషోర్‌చంద్రదేవ్ ఎర్ర జెండా పట్టుకోబోతున్నారా... ఎవరూ ఊహించని విధంగా కమ్యూనిస్టు పార్టీలో చేరబోతున్నారా అంటే సమాధానం అవుననే వస్తోంది. దశాబ్దాల తరబడి కాంగ్రెస్‌తో అనుబంధాన్ని పంచుకుని పలుమార్లు ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి పదవులను నిర్వహించిన కిషోర్‌చంద్రదేవ్ ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక చాలా కారణాలే ఉన్నాయని అంటున్నారు. సోషలిస్టు భావాలు కలిగిన దేవ్ కాంగ్రెస్ పార్టీలో నిన్నటివరకూ కొనసాగుతూ వచ్చారు. ఆయన 1977లో తొలిసారిగా లోక్‌సభ ఎంపీగా గెలిచారు. అప్పట్లో పార్వతీపురం లోక్‌సభ సీటు నుంచి నాలుగు సార్లు గెలిచిన ఆయన 2009లో అరకు పార్లమెంట్‌గా రూపాంతరం చెందాక తొలిసారి గెలిచి జెండా ఎగురవేసారు. 1979లో ఇందిరాగాంధీ మంత్రివర్గంలో బొగ్గు గనులు, ఉక్కు మంత్రిత్వ శాఖల సహాయ మంత్రిగా పనిచేశారు. తిరిగి 2011 యూపీఏ ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖల మంత్రిగా కేబినేట్ ర్యాంక్ పదవిని నిర్వహించారు. కాంగ్రెస్‌లో ఎన్నో కమిటీలకు చైర్మన్‌గా, పార్లమెంటరీ కమిటీలకు నాయకత్వం వహించిన కిషోర్‌చంద్రదేవ్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లులకు డ్రాఫ్టింగ్ చేయడంలో సిద్ధహస్తుడు. ఇక 2008లో ఓటుకు నోటుకు కేసు విచారణపై పార్లమెంట్ వేసిన కమిటీకి ఆయన చైర్మన్‌గా ఉండడం ఆయన నిబద్ధతకు నిదర్శనంగా చెబుతారు. నిజాయతీపరునిగా నమ్మిన సిద్దాంతాలకు కట్టుబడిన నాయకునిగా కిషోర్‌చంద్రదేవ్‌కు పేరుంది. ఓ మారు రాజ్యసభ సభ సభ్యునిగా కూడా ఉన్న దేవ్‌ది సుదీర్ఘమైన పార్లమెంటరీ అనుభవం. కాంగ్రెస్ పార్టీకి నమ్మిన బంటుగా ఉన్న ఆయన తేడా వస్తే ఆ పార్టీ విధానాలను విమర్శించే విషయంలోనూ ఎక్కడా వెనక్కు తగ్గలేదు. ఏపీలో అప్పట్లో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, పీసీసీ చీఫ్‌గా బొత్స సత్యనారాయణ ఉన్నపుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనాతీరును కేంద్ర మంత్రి హోదాలో ఘాటుగా విమర్శించి సంచలనం సృష్టించారు. అవినీతి, కుంభకోణాలు విషయంలో నాటి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్నే గట్టిగా నిలదీసిన చరిత్ర ఆయనకు ఉంది. ఇదిలా ఉండగా, ఏపీలో విభజన తరువాత కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి దారుణంగా విఫలమయ్యారన్నది దేవ్ ఆరోపణ. ఆయన్ని మార్చాలని కాంగ్రెస్ పార్టీని కోరడంతో పాటు, పార్టీ విధానాలలో మార్పు రావాలని ఆయన గట్టిగా వాదించేవారు. అయితే, ఈ విషయంలో అధినాయకత్వం చర్యలను విభేదించిన దేవ్ కాంగ్రెస్ పార్టీ నుంచి తప్పుకుంటున్నట్లుగా రెండు రోజుల క్రితం ప్రకటించి సంచలనం సృష్టించారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ కిషోర్‌చంద్రదేవ్‌కు ఫోన్ చేసి పార్టీలో కొనసాగాలని విజ్ఞప్తి చేసినా కూడా దేవ్ లెక్కచేయకపోవడం ఆయన సిద్దాంతబద్ధతకు నిదర్శనం. ఇక, పార్టీకి రాజీనామా చేస్తూ తాను ఏదో ఓ రాజకీయ పార్టీ నుంచి వచ్చే ఎన్నికలలో పోటీకి దిగుతానని

మిగతా 2లో

జయహో ఇస్రో...

జీ శాట్-31 ప్రయోగం సక్సెస్



కౌరు : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తాజాగా మరో ఘనతను సాధించింది. ఏరియానా స్పేస్ రాకెట్ ద్వారా ఫ్రెంచ్ గయానాలోని కౌరు లాంచ్ కాంప్లెక్స్ నుంచి భారత కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్ 31 విజయవంతంగా నింగిలోకి పంపింది. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారు జామున 2.31 గంటలకు జీశాట్ -31 ఉపగ్రహాన్ని నింగిలోకి మోసుకుపోయిన ఏరియానా రాకెట్ 42 నిమిషాల్లోనే కక్ష్యలోకి చేర్చింది. విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిన ఈ ఉపగ్రహం కమ్యూనికేషన్ సేవలను అందించనుంది. జీశాట్ -31తో పాటు సౌదీకి చెందిన 1 హెల్లాస్ శాట్ -4 ఉపగ్రహం కూడా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలు హర్షం వ్యక్తంచేశారు. 15 ఏళ్ల పాటు నిరాటంకంగా సమాచార సేవలందించే సామర్థ్యం కల్గిన ఈ ఉపగ్రహం బరువు 2,535 కిలోలు. అత్యంత సమర్థమంతమైన కేయూ బ్యాండ్ ప్రసార వ్యవస్థ ఉన్న జీశాట్ -31 ఇస్రో సంప్రదాయ ఉపగ్రహాలైన ఇన్శాట్, జీశాట్లకు ఆధునిక రూపమని నిపుణులు చెబుతున్నారు. భారతీయ భూభాగాలు, ద్వీపాలతో పాటు అరేబియా సముద్రం, బంగాళాఖాతం పరిసరాల సమాచారాన్ని ఈ ఉపగ్రహం అందిస్తుంది. ఈ ఉపగ్రహం వీశాట్ నెట్వర్క్లు, టెలివిజన్ అప్లింక్స్, డిజిటల్ శాటిలైట్, డీటీహెచ్ టెలివిజన్, సెల్యూలార్ బ్యాకప్లకు అనుకూలమైన సాంకేతికత సొంతం చేసుకున్నట్లు ఇస్రో పేర్కొంది. ఇప్పటికే భూస్థిర కక్ష్యలో ఉన్న ఇతర సమాచార ఉపగ్రహాలతో చేరి ఇది అదనపు సేవలు అందిస్తుంది.

జోనూ.. గీనూ జాన్తానై..

విశాఖ రైల్వే జోన్‌పై ఎంపీ జేసీ ఎటకారం



(ప్రత్యేక ప్రతినిధి)

విశాఖకు రైల్వే జోన్ అన్నది నిన్నటి సమస్య కాదు, దశాబ్దాల ఉత్తరాంధ్రుల డిమాండు. దాని కోసం ఎన్నో పోరాటాలు చేసి అలసిపోయారు. రాజకీయ పార్టీల మాటలు నమ్మి విసిగిపోయారు. పాలకుల తీయతీయని ప్రకటనలకు మోసపోయారు. చివరికి మళ్లీ ఉద్యమించాలనే నిర్ణయించుకున్నారు. ఎప్పటికైనా విశాఖకు రైల్వే జోన్ సాధించాలన్నది ఉత్తరాంధ్రుల నినాదం. విభజన తరువాత ఏపీకి జోన్ అంటూ లేకుండాపోయింది. దాంతో, జోన్ తప్పకుండా వస్తుందని అంతా ఆశించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ కూడా ఆరు నెలలలో జోన్ ఇస్తామని

మిగతా 2లో

పునాదిరాళ్లన్నీ ఓట్ల కోసమే

అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణు



అమరావతి : కడప స్టీల్ ప్లాంట్‌పై బుధవారం ఏపీ అసెంబ్లీలో టీడీపీ, బీజేపీ మధ్య మాటల యుద్ధం జరిగింది. స్టీల్ ప్లాంట్ విషయంలో టీడీపీ ప్రభుత్వం కేంద్రంపై బురద జల్లుతోందని బీజేపీ శాసనసభ్యుడు విష్ణుకూమార్ రాజు మండిపడ్డారు. స్టీల్ ప్లాంట్ నిర్మాణ సాధ్యాసాధ్యలపై కేంద్ర ప్రభుత్వం గతంలో అనేకసార్లు వివరాలు అడిగితే రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని ఆయన గుర్తుచేశారు. ఎన్నికలు దగ్గరు పడుతుండటంతో ఓట్ల కోసమే సీఎం చంద్రబాబు నాయుడు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారని విమర్శించారు. టీడీపీ నేతల వ్యవహారం చూస్తుంటే విశాఖ రైల్వేజోన్ కూడా చంద్రబాబే ప్రకటించుకునేలా ఉన్నారని విష్ణుకూమార్ రాజు ఎద్దేవా చేశారు.



దీదీ గెలిచిందా ?

7లో

విదేశీయులకు నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ

సంచలన తీర్పుఇచ్చిన విశాఖ న్యాయమూర్తి



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : విశాఖజిల్లా కోర్టుపరిధిలోని నాలుగవ అడిషినల్ చీఫ్ మెట్రోపోలిటన్ న్యాయమూర్తి బుదవారం ఒక కేసుకు సంబందించి విదేశీయులకు నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తూ తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే ఆడి సురేష్‌బాబు వెర్సెస్ సూర్యశక్తి ఇండియా ఫైనాన్స్ ప్రైవెట్ లిమిటెడ్ క్రైంనెంబరు 720/2011 కేసులో సూర్యశక్తి ఇండియా ఫైనాన్స్ ప్రతినిదులకుత న్యాయమూర్తి నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తూ సంచలన తీర్పునిచ్చారు. ఆడి సురేష్‌బాబు కోర్టుని ఆశ్రయిస్తూ సూర్యశక్తి ఇండియా ఫైనాన్స్ ప్రైవేట్‌లిమిటెడ్ ప్రతినిదులైన ఎ2,ఎ4,ఎ5 లు గా వున్నఅమెరికాకు చెందిన పీటర్ కె స్పీబెర్జర్, ఫ్రెంచ్‌జాతీయుడైనమద్దిశెట్టి సత్యరామానందం, ఆంధ్రాయూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ మట్టా వెంకట కృష్ణయ్యలు కోర్టుకు హాజరు కావడంలేదని తెలుపగా ఎన్‌బీడబ్ల్యూ విడుదల చేస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. మూడవ పట్టణపోలీస్‌స్టేషన్ పరిదిలో నమోదైన ఈకేసుకు సంబందించి తదుపరి విచారణను మార్చి 13వతేదీకి వాయిదావేశారు.

దొంగ దొరికాడు

స్వాధీనం చేసుకున్న గోవిందరాజస్వామి కిరీటం



తిరుపతి : గత శనివారం తిరుపతి నగరంలోని గోవిందరాజ స్వామి ఆలయంలో మూడు కిరీటాలు కనిపించకుండా పోయిన విషయాన్ని గుర్తించిన ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ కేసును వీలైనంత త్వరగా ఛేదిస్తామని తెలిపిన పోలీసులు ఆరు బ ృందాలను ఏర్పాటు చేసి, దర్యాప్తు మొదలుపెట్టారు. ఇందుకోసం ఆలయాన్ని కూడా మూసివేసి రహస్య విచారణ జరిపారు. అయితే గుడికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించిన పోలీసులు ఒక వ్యక్తి అనుమానాస్పదంగా పరిగెడుతూ, చేతిలో ఏవో వస్తువులను తీసుకెళ్లినట్లుగా గుర్తించారు. ఆ ఫుటేజ్ ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు అతడిని ముత్తయ్యగా నిర్ధారించి, అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఇతడు గతంలో కూడా కొన్ని దేవాలయాలలో దొంగతనాలు చేసాడు. కిరీటాలను దొంగిలించాక తమిళనాడు పారిపోయినట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది.

టీవీ నటి ఝాన్సీ ఆత్మహత్య



ప్రముఖ టివీ నటి ఝాన్సీ ఆత్మహత్య చేసుకోవడం బాదాకరం. హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో తన ఇంటిలోనే ఆమె ఉరి వేసుకుని బుధవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు వెళ్లి ఆమె బౌతిక కాయాన్ని గాందీ ఆస్పత్రికి తరలించారు. కృష్ణా జిల్లా ముదినేపల్లికి చెందిన ఝాన్సీ ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణంగా చెబుతున్నారు. మా టీవీ ఛానెల్‌లో ప్రసారమయ్యే 'పవిత్రబంధం' అనే సీరియల్‌లో ఝాన్సీ నటిస్తున్నారు. ప్రేమించిన వ్యక్తి మోసం చేయడంతోనే ఝాన్సీ ఆత్మహత్య చేసుకుందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సూర్య అనే వ్యక్తిని ఆరునెలలుగా ఝాన్సీని ప్రేమిస్తున్నాడని, అతనితో పరిచయమయ్యాకే సీరియల్స్ మానేసి ఝాన్సీ నటనకు దూరమైందన్నారు. గత కొద్ది రోజులుగా పెళ్లి చేసుకోవాలని ఝాన్సీ బలవంతపెట్టడంతో సూర్య ఆమెను దూరం పెట్టాడని, వారు అంటున్నారు.

జగమేమాయ!



ఇన్ని కేటాయింపులు,పథకాలు ప్రకటిస్తే ఇది బడ్జెట్ అంటే ఎవరూ నమ్మట్లేదు సార్..ఎన్నికలు గట్టెక్కడానికి చెప్పే అంకెలగారడీ అంటున్నారు..!

స్వీపర్ పోస్ట్‌కు ఇంజనీర్ల పోటీ!

దిగువ స్థాయి పోస్టుకు ఎగబడిన ఎంబీఏ పట్టభద్రులు



(ప్రత్యేక ప్రతినిధి)

నేషనల్ శాంపిల్ సర్వే వెల్లడించిన రిపోర్ట్‌ను బిజినెస్ స్టాండర్డ్ పత్రిక ఇటీవలే ప్రచురించింది. దేశంలో నిరుద్యోగం పెరిగిందని ఆ నివేదిక సారాంశం. నిరుద్యోగ శాతం 6.1గా నమోదై.. గత 45 ఏళ్లలో ఈ రికార్డును చేరడం ఇదే మొదటిసారి పేర్కొంది. 2017-18లో నిరుద్యోగ శాతం ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. దీనికి అద్దంపట్టేలా తమిళనాడులో ఓ ఘటన చోటుచేసుకుంది. తమిళనాడు అసెంబ్లీ సెక్రటేరియట్‌లో పనిచేసేందుకు స్వీపర్లు(10), శానిటరీ వర్కర్ల(4) నియామాకానికి ఉద్యోగ ప్రకటన వెలువడింది. కాగా ఎంటెక్, బీటెక్, ఎంబీఏ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, డిప్లొమా విద్యనభ్యసించిన పట్టభద్రులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. అసలు ఈ ఉద్యోగాలకు అర్హత 18 ఏండ్ల వయస్సు నిండి మంచి శరీర సౌష్టవం కలిగి ఉండటం. మొత్తం 4,607 మంది అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేశారు.

సంచలన వార్తాపత్రిక
లీడర్
క్లాసిఫైడ్స్

విశాఖపట్నం | గురువారం 7-2-2019

(మొదటిపేజీ తరువాయి)

జోనూ.. గీనూ జాన్తానై..

హామీ ఇచ్చింది. మరోమారు ఎన్నికలు వస్తున్నాయి కానీ బీజేపీ ఆ మాట నిలబెట్టుకోలేదు. ఈ నేపథ్యంలో అక్కడా ఇక్కడా అధికారంలో ఉన్న బీజేపీ, తెలుగుదేశం పార్టీలు రైల్వే జోన్ కోసం ఎంతవరకూ చిత్తశుద్ధితో పోరాడాయన్నది చూస్తే సందేహపడాల్సిందే. నాలుగేళ్ల పాటు కేంద్రంతో సఖ్యత నెరిపి మంత్రులుగా కూడా చేసిన వారు రైల్వే జోన్ గురించి పట్టుపట్టలేకపోయారు. విశాఖకు రైల్వే జోన్ ఇస్తామంటే విజయవాడ, గుంటూరు అంటూ వంకర్లు పెడుతూ ఉన్న అవకాశాలను కూడా చెడగొట్టారు. ఆ తరువాత కేంద్రం సైతం మనసు మార్చుకుని జోన్ లేకుండా చేసేసింది. బీజేపీ నుంచి బయటకు వచ్చాక కానీ విభజన హామీలు తెలుగు దేశం ఎంపీలకు గుర్తు రాలేదు. పోనీ గత ఏడాది కాలం గానైనా దీక్షాబద్ధులై పనిచేస్తున్నారా అంటే అదీ లేదు. ఆరు నెలల క్రితం విశాఖలో జోన్ కోసం టీడీపీ ఎంపీలు దీక్షలు చేస్తే అక్కడ టీడీపీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అందరికీ గుర్తే. జోనూ లేదూ గీనూ లేదు, ఎందుకొచ్చిన దీక్షలంటూ నాడు ఎకసెక్కం ఆడింది ఇదే టీడీపీ ఎంపీగారు. ఇపుడు తాపీగా ఢిల్లీలోనూ అదే జోన్‌పై మరోమారు తనదైన వెటకారాన్ని కొనసాగించారు. ఎందుకొచ్చిన జోన్ అంటూ ఏకంగా టీడీపీ శిబిరం నుంచే వ్యతిరేక వాణిని వినిపించారు.

జోన్ వస్తే ఏపీకి ఏం జరుగుతుంది. పది కోట్లతో ఓ భవనం, పదిమంది గుమాస్తాలు తప్ప జోన్ వల్ల ఒరిగేది ఏముందని ఈ సీనియర్ ఎంపీగారు తేలిక చేసి మాట్లాడారు. జోన్ విషయం గురించి పదే పదే మాట్లాడడం దండుగ అంటూ కుండబద్దలు కొట్టారు. మరి, ఈ తరహా ఎంపీలను పక్కన పెట్టుకుని టీడీపీ సర్కార్ రైల్వే జోన్ సాధిస్తామంటే నమ్మేదెవరో చెప్పాలి. విశాఖకు రైల్వే జోన్ వస్తే ఏమీ కాదని సీనియర్ మోస్ట్ నాయకుడు అనడాన్ని వాచాలత్వం కింద చూడాలో, మరే విధంగా చూడాలో అర్థంకాని పరిస్థితి. రైల్వే జోన్ వస్తే ఉత్తరాంధ్ర సహా, ఏపీ మొత్తం మీద ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా పెట్టుబడులు అయిదు వేల కోట్ల రూపాయల వరకూ వస్తాయి. రైల్వే జాబ్స్ కూడా వస్తాయి. ఆ పరీక్షలు రాసేందుకు ఒడిషా వెళ్లి అక్కడ వారితో తన్నులు తినే బాధ తెలుగు పిల్లలకు తప్పుతుంది. ఓ విధంగా జోన్ లేని ఏపీకి ఇదొక గర్వకారణంగా ఉంటుంది.మన అవసరాలకు తగినట్లుగా రైళ్లను తిప్పుకోగలుతాం. మరి, ఇవన్నీ సీనియర్ ఎంపీగారికి తోచలేదేమో. జోనా గీనా అంటూ ఎకసెక్కం ఆడారు. నిజానికి టీడీపీ ఎంపీలకు ఇది మొదటిసారి కాదు, అంతకు ముందు కూడా జోన్ విషయంలో టీడీపీ ఎంపీలు మురళీమోహన్ తదితరులు ఈ రకంగానే డిల్లీలోని ఆంధ్రాభవన్‌లో మాట్లాడుతూ సరదా వ్యాఖ్యలే చేశారు. జోన్ రాదని, అయినా బరురు తగ్గుతామంటే వారం రోజుల దీక్షకు రెడీ అంటూ మురళీమోహన్ అన్న మాటలు ఇపుడు మరోమారు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇంతకీ టీడీపీ ఎంపీలకు విశాఖకు రైల్వే జోన్ తీసుకురావాలన్న విషయంలో సీరియస్‌నెస్‌ఉందా, వారికి క్లారిటీ ఉందా అన్నది తేలాలి. ఆ తరువాత కేంద్ర ప్రభుత్వం జోన్ ఇవ్వడమో మానడమో చూడాలి. మనవారికే చిత్తశుద్ధి లోపించి జోన్ వల్ల ఏం జరుగుతుందని సెటైర్లు వేస్తూంటే ఢిల్లీ ప్రభువులకు ఇవ్వాలని ఎందుకు ఉంటుంది. ఏదేమైనా ప్రత్యేక హోదా వల్ల ఏమవుతుంది అన్న వారు ఇపుడు యూ టర్న్ తీసుకుని డిమాండు చేస్తున్నట్లే. జోన్ కోసం కూడా వెటకారాలు మాని నిబద్దతతో పోరాటం చేయాలి. ఉత్తరాంధ్ర ప్రజల సెంటిమెంట్ రైల్వే జోన్ అన్న సంగతిని ఎంపీ జేసీ వంటి వారు గుర్తుంచుకుని వ్యాఖ్యలు చేస్తే మరీ మంచిది.

ప్రేమించానంటూ విద్యార్థినిపై ఉన్మాది దాడి

హైదరాబాద్: నగరంలోని బర్కత్‌పురలో ఘోరం జరిగింది. తనను ప్రేమించాలంటూ విద్యార్థినిపై ఓ ఉన్మాది విచాక్షణారహితంగా దాడి చేశాడు. కొబ్బరి బోండాల కోసం వాడే కత్తితో అమానుషంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. కాచిగూడ పోలీసుస్టేషన్ పరిధిలోని బర్కత్‌పురలో బుధవారం ఉదయం ఈ ఘటన జరిగింది. దాడి చేసిన నిందితుడిని 19 ఏళ్ల భరత్‌గా గుర్తించారు. పొరుగున ఉంటూ ఇంటర్ సెకండియర్ చదువుతున్న అమ్మాయి (17) వెంట పడుతూ..తనను ప్రేమించాలని భరత్ వేధించేవాడు. ఈ వ్యవహారం తల్లిదండ్రుల ద ృష్టికి వెళ్లడంతో గతవారం వారిద్దరినీ కౌన్సెలింగ్‌కు తీసుకెళ్లారు. అయినా, భరత్ తన ధోరణిని మార్చుకోలేదు. రెండురోజుల కిందట అమ్మాయి తల్లికి ఫోన్ చేసి బెదిరించాడు. అతడు కిరాతకంగా దాడి చేయడంతో మెడపై, పొట్టపై, చేతివేళ్లపై బాధితురాలికి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం బాధితురాలిని మలక్‌పేట్ యశోద ఆస్పత్రికి తరలించారు.

ఉత్తరంలో బీసీ సెల్ సమావేశం



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: విశాఖ ఉత్తర నియోజకవర్గంలో బీసీ సెల్ సమావేశం బీసీ సెల్ అధ్యక్షుడు బోడ్డేటి గంగా మహేశ్ ఆధ్వరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధి విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాయదు శ్రీనివాస్, యన్. రవి కుమార్, వి.రాంబాబు, పి.మధులత నాయదు, ఉత్తర నియోజకవర్గ వార్డు అధ్యక్షులు, కమిటి సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల్ని మళ్లిస్తే ఉద్యమం

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: ఎన్నో త్యాగాలు చేసి 120 దళిత సంఘులు ఒక్క త్రాటిపైకొచ్చి పోరాటాలు చేసి సాధించిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను ప్రభుత్వాం నిర్వీరియం చేస్తుంది. దళితులకు, ఆదివాసిలకు కర్చుకెట్టాల్సిన సబ్ నిధులు ప్రభుత్వాం ప్రచారం కోసం ఓట్లు కోసం పసుపు-కుంకుమ పథకానికి మళ్లించడాన్ని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు టి.చిరంజీవి, ఆర్.పి.రాజు తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సమయంలో అమలు చేస్తున్న ఈ పథకంలో దళితులకు 1668.60 కోట్లులను వారి అభివృదికై ఖర్చు చేయాలి. ఆందులో 469.06 కోట్లుటను పసుపు-కుంకుయ పథకానికి మళ్లించడం చట్ట రిత్య నేరం. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులకు ఆర్థిక శాఖ ప్రత్యేక పద్దు నిర్వహిస్తుండగా అందులో నిధులను వేరే పథకానికి మళ్లించడం దుర్మార్గం.గతంలో ఉన్న ప్రభుత్వాలు ఈ సబ్ ప్లాన్ నిధులను దుర్వినియోగం చేసి హుస్సేన్ సాగర్ అధునికరనకు ప్లేవోవర్ బ్రిడ్జిలకు, దళితేతర పనులకు ఖర్చు చేసారు. అన్యాయం జరిగిందని దళిత సంఘులు, ప్రజా సంఘులు పోరాటాలు చేసి సబ్ ప్లాన్ చట్టం సాదించుకుంటే ఈ రోజు చంద్రబాబు నాయుడు ఆ చట్టాని తుంగలోకి తొక్కి అక్రమాలకు పాల్పడుతున్నాడు. ఉన్న నిధులు సక్రమంగా దళిత, గిరిజనల అభివృద్ధి కోసం ఖర్చు పెట్టాలనే అప్పటి రాజశేఖర్ ప్రభుత్వం పోరాటాలకు దిగొచ్చి చట్టం చేసింది. ఈరోజు చంద్రబాబునాయుడు ప్రభుత్వం దళితుల, గిరిజనుల నోటి దగ్గర అన్నాన్ని లాక్కొని ఎన్నికల్లో లాభం కోసం నిధులు మళ్ళించడం చూస్తుంటే దళితుల మీద ఈ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి వుందో అర్ధమౌతుందన్నారు. నిధులు మళ్ళింపు మానుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. లేని యెడల వచ్చే ఎన్నికల్లో గిరిజనులు. దళితులు ఈ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడిస్తారని హెచ్చరించారు.

విపక్షాల ఆందోళన.. పార్లమెంట్ వాయిదా

న్యూఢిల్లీ: విపక్షాల ఆందోళనతో పార్లమెంట్ కార్యకలాపాలకు తీవ్ర అంతరా యం ఏర్పడింది. వాయిదా తీర్మానాలను చర్చించాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేయడంతో లోక్‌సభ రేపటికి వాయిదా పడింది. రాజ్యసభలో కూడా విపక్షాల నిరసనలు కొనసాగడంతో మధ్యాహానికి వాయిదా వేశారు. కాగా బెంగాల్ సీబీఐ వివాదం కారణంగా గత రెండు రోజులుగా సభ్యుల ఆందోళనలతో పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పడిన విషయం తెలిసిందే.

37వ వార్డులో పసుపు-కుంకుమ చెక్కుల పంపిణీ



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: 37 వార్డ్ పరిధి లోఇందిరానగర్ -1 కమ్యూనిటీ హాల్‌లో పసుపుకుంకుమ డ్వాక్రామహిళలకు అందచేస్తున్న చెక్కులు కార్యక్రమానికి ముఖ్య అతిధి గా 37 వార్డ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాష్ట్ర గొర్రెల మేకల ఫెడరేషన్ డైరెక్టర్ గంకల అప్పారావు విచ్చేసారు. ఆయన మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అక్క చెల్లెలు సంతోషంగా ఉండాలి ,వారు స్వయం సంపాదికులుగా ఉండాలనే ఉద్దేశంతో చిన్నతరహా వ్యాపారాలు చేసుకోవటానికి పెట్టుబడిగా ఉపయోగించాలని ఈ 10 ,000 /- పదివేల రూపాయలు అందేజేస్తున్నారని తెలియజేసారు . కాబట్టి ప్రతి ఒక్కరు స్వయం సంపాదికులుగా ఎదిగి తమ కుటుంభం ఆర్థిక ఇబ్బందులనుండి బయట పడతారని తెలియజేసారు. అక్క చెల్లెలు సంతోషం గా నిండుమనస్సుతో ఆయన్ని ఆశీర్వదించి రాబోయే ఎన్నికలలో భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు.

8న క్రీడా సాంస్కృతికోత్సవాలు

రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ సరోజ



విశాఖపట్నం, న్యూస్ లీడర్: రాష్ట్ర రిజిస్ట్రేషన్ స్టాంపులు శాఖ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడా సాంస్కృతిక పోటీలు ఈనెల 8 నుంచి 10 వరకు విశాఖ అక్కయ్య పాలెం పోర్టు స్టేడియం వేదికగా నిర్వహిస్తున్నట్లు విశాఖ రిజిస్ట్రేషన్ స్టాంపులు డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ టి.సరోజా తెలియజేశారు. బుధవారం ఉదయం వీజేఎప్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నవ్యాంధ్ర రాష్ట్రంలో 13 జిల్లాల నుండి రిజిస్ట్రేషన్ స్టాంపులు శాఖ అన్ని కేటగిరీల ఉద్యోగులు ఈక్రీడా సాంస్కృతిక ఉత్సవాల పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఉద్యోగుల శారీరిక మానసిక ఉల్లాసానికి నిర్వహిస్తున్న పోటీలలో బ్యాట్మెంటన్ కబడ్డీ వాలీబాల్ చెస్ క్యారమ్స్ మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉద్యోగుల పిల్లలకు కూడా జూనియర్ సబ్ జూనియర్ విభాగంలో పరుగు పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర రిజిస్ట్రేషన్ స్టాంపులు శాఖ కమిషనర్ ఇన్స్పెక్టర్ జనరల్ పి వెంకటరామిరెడ్డి పోర్టు ట్రస్ట్ చైర్మన్ ఎంటి కృష్ణబాబు రిజిస్ట్రేషన్ స్టాంపులు శాఖ అడిషనల్ ఇన్స్పెక్టర్ జనరల్ ఉదయ భాస్కర్ రావు జిల్లా రిజిస్టర్ కే ఆనందరావు తదితర అధికారులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

పంచగ్రామాల భూసమస్య పరిష్కరించాలి

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : విశాఖజిల్లా సింహాచలం దేవస్థానానికి ఆనుకుని ఉన్న పంచగ్రామాలుగా పిలువబడే ప్రాంతంలోని ప్రజలు వింతసమస్యలు ఎదుర్కొంటున్నారు, ఈ సమస్యను 100రోజుల్లో పరిష్కరిస్తామని 2014 ఎన్నికల సమయంలో టీడీపీ హామీ ఇచ్చి, మొట్టమొదటి కేబినెట్ సమావేశంలో తీర్మానం చేసారు. అయినా నేటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. తమ స్వంత ఇళ్ళలోనే పరాయివ్యక్తులుగా జీవనం సాగించాల్సిన దుస్థితి నెలకొంది. 2008సర్వే ప్రకారం 12 174మంది ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. రైత్వారీ పట్టాలద్వారా ఈ సమస్య ఉత్పన్న మయ్యింది. 2014 లో హైకోర్టు ఆదేశానుసారం జిల్లా జాయింట్ కలెక్టర్‌తోకూడిన ఉన్నతాధికారుల కమిటీ ఈ పట్టాలు సక్రమం కాదని నివేదికలో తెలియజేసారు. 2017లో హైకోర్టు అందరికి సమన్యాయం జరిగేలా తమ వద్దనున్న ఆధారాలను డిప్యూటీ తహశీల్దార్‌కు అందచేస్తూ తథాస్థితి కల్పించమని ఉత్తర్వులు విడుదలచేసింది. జిల్లాకలెక్టర్ సూచన ప్రకారం ఇనాంగ్రామాలుగా కాక, ఎస్టేటుగ్రామాలుగా పరిగణించాలని, 1966-67లో ఇచ్చిన పట్టాలు రద్దుచేయాలని, హైకోర్టు ఆదేశాల ప్రకారం యథాస్థితి కొనసాగించాలని, నిర్మాణాలకు అనుమతించాలని, 275సర్వే నెంబర్‌లో పట్టాలు అందచేయాలని ప్రభుత్వాధికారులు సూచించిన చర్యలు చేపట్టడమే ఈ సమస్యకు పరిష్కారమని సమైక్య ప్రజా-రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వైకెనాయుడు, కార్యదర్శి టివికృష్ణంరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి రమణి, కోశాధికారి కె సన్యాసిరావు అభిప్రాయపడ్డారు.

కామ్రేడ్ కిషోరం ?

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. అయితే, ఆ పార్టీ ఏది అన్న దానిపై రకరకాలుగా ఊహాగానాలు వినిపించాయి. తెలుగుదేశం పార్టీలోకి దేవ్ చేరిపోతారని, రేపో మాపో కండువా కప్పుకుంటారని ఓ వైపు ప్రచారం అవుతూంటే మరో వైపు అనూహ్యామైన వార్త ఒకటి వెలుగులోకి వచ్చింది. ఆయన సీపీఎం పార్టీలో చేరుతారన్నది ఆ వార్త సారాంశం. ఇక్కడ కూడా దేవ్ తాను నమ్మిన సిద్దాంతం ప్రకారమే నడచుకుంటున్నారని అంటున్నారు. ప్రాంతీయ పార్టీలలో చేరడానికి ఆయన ఇష్టపడడంలేదు. జాతీయ పార్టీల ద్వారానే దేశానికి సేవ చేయగలమని బలంగా నమ్మే దేవ్ ఆ విధంగానే అడుగులు వేస్తున్నారని అంటున్నారు. బీజేపీని దేశంలో తీవ్రంగా వ్యతిరేకించే కూటమిలోనే తాను ఉంటానని కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సందర్భంగా ప్రకటించిన దేవ్ దేశంలో కాంగ్రెస్, బీజేపీల తరువాత ఎంచుకోవాల్సి వస్తే మరో జాతీయ పార్టీగా సీపీఎంకే ప్రాధాన్యత ఇచ్చారని అంటున్నారు. పైగా, సోషలిస్టు, వామపక్ష భావజాలం నిండుగా కలిగిన దేవ్‌కు వామపక్షాల్లోనూ మంచి మిత్రులు ఉన్నారు. సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ కారత్ ఆయనకు మంచి మిత్రుడు. పైగా, బీజేపీని సిద్ధాంతబద్ధంగా తీవ్రంగా వ్యతిరేకించే పార్టీగా దేశంలో సీపీఎంనే చెప్పుకుంటారు. మరో వైపు టీడీపీ సైతం బీజేపీతో నిన్నటివరకూ చెలిమి చేసిన పార్టీయే. అవకాశం వస్తే మళ్లీ కలిసేందుకు కూడా ఆ పార్టీ తయారుగా ఉంటుంది. ఈ రకమైన ఆలోచనలతోనే దేవ్ సీపీఎం జెండాను కప్పుకోబోతున్నారని అంటున్నారు. ఇక గిరిజనుల సమస్యలపైన వామపక్ష పార్టీలతో కలసి పోటీ చేస్తేనే మరింత బలంగా చాటగలమని, వాటిని పరిష్కరించగలమని దేవ్ భావిస్తున్నారు. మరో వైపు ఏపీలో రాజకీయ సమీకరణల దృష్ట్యా వామపక్షాలు జనసేన కలసి కూటమి కడుతున్నాయి. ఆ విధంగా చూసుకుంటే జనసేన, సీపీఐ మద్దతుతో సుదీర్ఘ అనుభవం కలిగిన దేవ్ సునాయాసంగా అరకు ఎంపీ సీటును గెలుచుకోగలరని అంచనా వేస్తున్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తోనూ దేవ్‌కు మాటామంతీ సంబంధాలు ఉన్నాయి. బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకించడంతో పాటు, గిరిజనుల అభ్యున్నతి వంటి వాటి విషయంలో ఒకే రకంగా స్పందించే వామపక్షాల జనసేన కూటమి తరఫున నిలబడితేనే తన ఆశయాలు నెరవేర్చగలనని దేవ్ గట్టిగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఎర్రజెండా చేతపట్టుకుంటారని అంటున్నారు. ఈ నెల 10న ఢిల్లీలో జరిగే ఓ కార్యక్రమంలో దేవ్ లాంఛనంగా సీపీఎంలో చేరుతారని వినిపిస్తోంది. దేవ్ వంటి సీనియర్ నాయకుడు వామపక్ష పార్టీలో చేరడం, అదీ ఏపీలో ఆ పార్టీ తరఫున పోటీకి దిగడం అంటే ఓ విధంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో సంచలనమే కాదు, ఏపీలో రాజకీయ పరిణామాలను, సమీకరణలను కూడా కీలకమైన మలుపు తిప్పే అవకాశాలు ఉంటాయనడంలో సందేహంలేదు.

సింగర్ బేబీతో ముఖాముఖి

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఇటీవల కాలంలో ఎంతో పాపులర్ గాయనిగా పేరు తెచ్చుకుంటున్న విలేజ్ సింగర్ బాబీతో ముఖాముఖి కార్యక్రమాన్ని 10తేదీన నిర్వహిస్తున్నట్టు వైజాగ్‌ఫిలిం సొసైటీ గౌరవ కార్యదర్శినరవ ప్రకాశరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎయూ హెచ్ఆర్డీ సెంటర్ సెమినార్ హాల్లో ఏర్పాటుచేసినట్టు వెల్ల డించారు. ఈకార్య క్రమానికి ఏయూ వీసీ జి. నాగేశ్వరరావు ముఖ్య అతిధిగా పాల్గొని గాయని బేబీని సత్కరిస్తా రన్నారు. ఏక సంధాగ్రాహిలా ఒక్కసారి వింటే పాటను అదే విధంగా పాడుటలొ ఆమెకు ఆమె సాటి అన్నారు. ఈ కార్యక్రమంలో నగర వాసులు పాల్గొని గాయని బేబీని ఆశీర్వదించాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 90324 77463 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

కార్మికశాఖ మంత్రితో చర్చలు విఫలం

జూట్‌మిల్లు యాజమాన్యాన్ని ప్రాసిక్యూట్ చేయాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు నరసింగరావు



విశాఖపట్నం, న్యూస్ లీడర్ : చిట్టివలస జూట్ మిల్లుపై కార్మికశాఖ మంత్రి వద్ద ఈ నెల చర్చలు విఫలం 5వ తేదీ అమరావతిలో కార్మికశాఖా మంత్రి పితాని సత్య నారాయణ సమక్షంలో 5కార్మిక సంఘాలు, యజమాని కె.కె.బజో రియాల మద్య జరిగిన చర్చలు విఫల మయినట్లు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు తెలిపారు. సీఐటీయూ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్చల్లో యాజమాన్యం దేనికి అంగీకరించకపోవడంతో తాము చేపట్టిన చర్చలు విఫలమైనట్లు తెలిపారు. చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యం చట్ట విరుద్దంగా లాకౌట్ విదించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం లాకౌట్ చట్టవ్యతిరేకమని జి.వో.ఆర్.టి. నెం.1265 తేది:20-8-2009న ప్రకటించింది. జూట్‌మిల్లు యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం విధించిన లాకౌట్ నిషేదంపై రిట్‌ఫిటిషన్ నెం.18316/2009ను ఆంధ్రప్రదేశ్ హై కోర్టు డిస్మిస్ చేసిందన్నారు. చట్టవ్యతిరేకంగా విదించిన లాకౌట్‌కు కార్మికులకు జీతాలు ఎందుకు చెల్లించరని సిఐటియు నాయకులు నిలదీశారు. దానికి సమాదానం చెప్పలేమని యాజమాన్యం తెలిపిందన్నారు. పేమెంట్ ఆఫ్ వేజెస్ చట్ట ప్రకారం ఇచ్చిన తీర్పులు మూసివేసినప్పటి నుంచి సుమారు 2 సంవత్సరాల వరకు ఇవ్వవలసిన బకాయిలు రూ.149.9 కోట్లు వడ్డీతో సహా చెల్లించవలసి వుందని అయితే తరువాత కాలం నుంచి నేటి వరకు మిగిలిన ఏడున్నర సంవత్సరాలకు కూడా చట్ట ప్రకారం చెల్లించవలసిన బాధ్యత యాజమాన్యంపై వుంది. దీనితో పాటు కార్మికులకు చెల్లించవలసిన ప్రావిడెంట్ ఫండ్ మరియు గ్రాట్యూటీ, ఇన్సురెన్స్ మరియు కో-ఆపరేటివ్ సొసైటీ బకాయిలతో సహా యాజమాన్యం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. విశాఖ జిల్లాలోని తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ గత 4 సంవత్సరాల నుంచి మూతపడి వుందని ఇందులో 321 మంది మాత్రమే పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ ఫ్యాక్టరీ తెరిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం జీ.వో.నెం.106 ను 12-9-2018 ద్వారా రూ.30.60 కోట్లు విడుదల చేసినప్పటికీ నాలుగు సంవత్సరాల కార్మికుల జీతాలు బకాయిలు రూ.12కోట్లుకు పైగా చెల్లించారు. చిట్టివలస జూట్‌మిల్లు తెరిపించితే 5వేల మందికిపైగా భీమిలి ప్రాంతంలోని పేదలకు ఉపాధి దొరుకుతుంది. ఇటువంటి అవకాశం రాష్ట్రంలో మరెక్కడ లేదన్నారు. చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యం కంపెనీ తెరవడానికి నిరాకరిస్తే రాష్ట్ర ప్రభుత్వం చిట్టివలస జూట్‌మిల్లును స్వాధీనం చేసుకొని కేవలం రూ.50కోట్లు పెట్టుబడి పెడితే ఆరు మాసాల్లో జూట్ మిల్లు యధాతదంగా నడుస్తుందన్నారు. దీని కోసం కనీసమైన చర్చ కూడా రాష్ట్ర ప్రభుత్వం జరపక పోవడం చాలా బాధకరంగా వుంది. చిట్టివలస జూట్ మిల్లు యాజమాన్యాల మాటలకు ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం తెరవడం గురించి అసలు చర్చించక పోవడం సరైనదికాదని తెలిపారు. విలేకరుల సమా వేశంలో వివి శ్రీనివాసరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ అభివృద్దే లక్ష్యం

విశాఖనవనిర్మాణసమితి అధ్యక్షుడు తోటరాజీవ్

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : రాబోయే తరాలకు సుందరమైన కాలుష్య రహిత నగరంగా విశాఖ ను అందించడమే తమ లక్ష్యమని విశాఖ నవ నిర్మాణసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తోట రాజీవ్ పేర్కొన్నారు. బుదవారం పౌరగ్రంధాలయంలో మీడియాసమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖనగరాన్ని విద్యానైపుణ్యకేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఐటీ హబ్‌గా ఏర్పడటానికి కావల్సిన మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతరించిపోతున్న నీటినిల్వలను కాపాడటం, రిజర్వాయర్ల పరిరక్షణ వంటి వాటిపై శ్రద్ద తీసుకోవాలన్నారు. విమ్స్, కేజీహెచ్ లలో అత్యాదునిక పరికరాలు ఏర్పాటుచేసి పేదలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. విశాఖ పౌరులంతా కలిసికట్టుగా పోరాడి రైల్వేజోన్, ప్రత్యేకహోధా, ఉత్తరాంధ్రకు ప్రత్యేకనిదులు కేటాయింపు



తదితర అంశాలను సాదించుకుందామన్నారు. ఈకార్యక్రమంలో టివి రమణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

మారికవలసలో రోడ్డు ప్రమాదం

ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు





మధురవాడ, న్యూస్‌లీడర్ : మారికవలసలో జరిగిన రోడ్డు ప్రమదాంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొన డంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి వాహనం అదుపు తప్పి లారీ కింద పడి మృతిచెందాడు. మారిక వలస రాజీవ్ గృహ కల్ప సముదాయం సమీపంలో బుధ వారం మధ్యాహ్నం ప్రమాదం చోటు చేసుకుంది. పోలీ సులు, స్థానికులు అందించిన సమాచారం మేరకు పిఎం పాలెం సిఐ పి సూర్య నారాయణ, ట్రాఫిక్ సిఐ చంద్ర శేఖర్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆనంద పురం మండలం బొడ్డపాలెం ప్రాంతానికిచెందిన చుక్కా రమణ (22) నగరంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నగరం నుంచి మారికవలస జాతీయ రహదారిపై వస్తుండగా రోడ్డు దాటుతున్న సమయంలో లొండా రామునాయుడు అనే వ్యక్తిని ఢీకొనడంతో మృతుడు రమణ వాహనం అదుపు తప్పి లారీ కిందకు దూసుకుపోయింది. ఈ సంఘటనలో మృతుడు చుక్కా రమణ అక్కడికక్కడే మృతిచెందగా రోడ్డు దాటుతున్న వ్యక్తి లండా రాము తీవ్ర గాయాలపాలై చికిత్స కోసం నగరంలోని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తంకెజిహెచ్‌కు తరలించామని పి ఎం పాలెం సిఐ పి సూర్యనారాయణ తెలిపారు. సంఘటనాస్థలంలో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ సిఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్సు ఆర్ ఆర్ నరసింగరావు సిబ్బంది సహకారంతో ట్రాఫిక్‌ను నియంత్రించారు.

బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగుల) బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ చేయడానికి ప్రకటన విడుదలచేసారు. దీనికి సంబంధించిన అన్ని వివరాలు హెచ్‌టిటిపి://విశాఖపట్నం. ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మరిన్ని వివరాలకు పెదవాల్తేరులోని రాణిచంద్రమణీ దేవి ఆసుపత్రి ప్రాంగణంలో విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.దరఖాస్తు చేసుకోవడానికి తుదిగడువు ఫిబ్రవరి 20, 2019.

ఘనంగా కనకదుర్మమ్మ వార్షికోత్సవాలు



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధి 25వవార్డు లక్ష్మీటాకీస్ వద్దనున్న కనక దుర్గమ్మ అమ్మవారి తృతీయ వార్షికోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈఉత్సవాల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈఉత్సవాల్లో ఆయనతోపాటు పార్టీనాయకులు ఎ మసిన్, సిహెచ్. అప్పలరాజు, పి కృష్ణ, ఎస్‌కె సలీం, వెంకట్, జి నాగ భూషణ్, ఎ విజయ, శత్రువు, నర్సింగ రావు, కార్యకర్తలు పాల్గొని అమ్మవారి తీర్ధప్రసాదాలు అందుకున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేల పోటీకి

ధరఖాస్తుల అహ్వానం

పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు



విశాఖపట్నం, న్యూస్ లీడర్ : రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ పోటీచేయాలనుకునే ఆశావాహుల నుంచి ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ దరఖాస్తులను అహ్వానిస్తున్నట్లు పీసీసీ ప్రధాన కార్యదవర్శి ద్రోణంరాజు శ్రీని వాసరావు తెలపారు. బుధవారం ఉదయం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ భావజాలం కల్గి ఉన్న వారు ఈ దరఖాస్తులను అహ్వానిస్తున్నామని ఈ దరఖాస్తులను పీసీసీ కార్యాలయాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ఈ దరఖాస్తు చేసుకునే వారు గతంలో పార్టీకి ఎటువంటి సేవలందించారు, గతంలో పార్టీ నుంచి ఏమైనా పదవులు అలకరించారా తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని టికెట్‌లు కేటాయిండం జరుగు తుందన్నారు. ఎమ్మెల్యేకు దకఖాస్తు చేసుకన్న అభ్యర్థినుంచి రూ.2000 ఎంపీకి దకఖాస్తు చేసుకునే వారి రూ.5,000 చెల్లించాల్సి ఉందనితెలిపారు. రాష్ట్రానికి విభజన హామీలతో పాటు ప్రత్యేక హోదా రాష్ట్రానికి రావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. తాము కేంద్రంలో అధి కారంలోకి వచ్చిన వెంటనే మెదటి సంతకాన్ని పెడతామని తమ అధినేత రాహుల్ గాంధీ చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భగా గుర్తు చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలటే కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్‌కే సాధ్యమన్నారు. అయితే బీజేపీ రాష్ట్రానికి హోదా ఇవ్వమని ఇప్పటికే చెప్పిందన్నారు. రాష్ట్రానికి హోదా కావాలంటే కాంగ్రెస్‌కు రాష్ట్రంలోని తెలుగుదేశం, వైకాపా మద్దతివ్వాలన్నారు. మోడీ పాలనలో గాంధీ, నెహ్రూ కుంటుంబాలకు ఇబ్బందులకు గురి చేస్తుందని ఈయన పాలనలో దేశంలో ప్రజా స్వామ్యం పూర్తిగా ఖూనీ అయిందని ఆరో పించారు. దేశ, రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచు కుని బీజేపీ, దానికి సహకరిస్తున్న పార్టీలను రాష్ట్ర ప్రజలు రాజకీయంగా భూస్థాపితం చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బెహరా బాస్కరరావు, పేడాడ రమణికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల లబ్ధికే పసుపు కుంకుమ

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఎన్నికల లబ్ధికే పసుపు-కుంకుమ పంపిణీకి టిడిపి శ్రీకారం చుట్టిందని విశాఖ తూర్పు నియోజకవర్గ పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి డొక్కర వెంకట శివప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. గత ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలన్నింటినీ మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని, ఐదేళ్ల పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు పసుపు కుంకుమ కింద రూ.10 వేలను ప్రస్తుతం విదిలిస్తున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో టిడిపి ఇచ్చిన హామీలను ప్రజలు నిలదీయకుండా మభ్యపెట్టేందుకే జిమ్మిక్కులు చేస్తున్నారన్నారు. టిడిపికే చెందిన స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు విశాఖ తూర్పు నియోజకవర్గ సమస్యలేవీ పట్టడం లేదన్నారు. టిడిపి ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశాలకు వచ్చిన మహిళలకే పసుపు-కుంకుమ చెక్కులు పంపిణీ చేస్తామని వ్యాఖ్యానించడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో హుదూద్ బాధితులకు నేటికీ ఇళ్లు కల్పించలేదనీ, తాగునీటి సమస్యలను పట్టించుకోవడం లేదనీ, మత్స్యకారుల సమస్యలను గాలికొదిలేశారని దుయ్యబట్టారు. మహిళలను అధికార పార్టీ వేధిస్తే సహించబోమని, నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి నిర్విరామంగా పోరాడుతామని స్పష్టం చేశారు.

చిన్నారి గుండెకు రంధ్రం...

ఆదుకోవాలని దాతలకు వేడుకోలు



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : అమ్మ ఒడిలో వెచ్చగా పడుకోవాల్సిన ఆ బాలుడు పాపం ఆసుపత్రిలో మృత్యుపోరాటం చేస్తున్నాడు. ఎవరో శ్రీమంతులకు రావలసిన ఖరీదైన జబ్బు కూటికి పేదవాడైన ఈ చిన్నారికి సంక్రమించింది. ప్రాణం ఆ దేవుడు పోస్తే.. ఇప్పుడు ఆ గుండె శస్త్ర చికిత్స చేయించి తిరిగి ప్రాణాలు కాపాడమని దయగల దాతలను తన దీన చూపులతో అర్థిస్తున్నాడు ఆ బాలుడు. దీనికి సంబంధించి బుధవారం ఉదయం డాబాగార్డెన్స్ విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే.. విశాఖ నగరం చినవాల్తేరు ప్రాంతానికి చెందిన నీలాపు ఉమా మహేశ్వరరావు, శశిరేఖ దంపతులకు ఇద్దరు సంతానం. రెండవ సంతానం బాబు. విధి వక్రీకరించి దైవం చిన్నచూపు చూడటంతో పుట్టినప్పుడే గుండెలో రంధ్రాలతో ఈ బాలుడు జన్మించాడు. తండ్రి ఉమా మహేశ్వరరావు ప్రవేటు పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తల్లి శశిరేఖకు చిన్నతనంలోనే పోలియో సోకి కుడికాలు చచ్చుబడింది. కుటుంబం గడవడమే కష్టంగా ఉన్న వీరికి గుండెలో రంధ్రాలతో పుట్టిన బాబుకి ఖరీదైన చికిత్స చేయించడం తలకు మించిన భారమే. బాబు పుట్టిన 10 రోజులపాటు కెజిహెచ్‌లో కుర్రాడికి అత్యవసర వైద్యం అందించారు. అనంతరం కెజిహెచ్ వైద్యులు సూచన మేరకు విజయవాడలోని రమేష్ ఆసుపత్రిలో బాలుని అతికష్టం మీద చేర్పించారు. అయితే వైద్య ఖర్చులకు సుమారు 8 లక్షలు ఖర్చు అవుతుందని, తక్షణమే చెల్లించాలని అక్కడి వైద్యులు చెప్పడంతో అంత డబ్బులు ఇచ్చుకొనే ఆర్థిక స్థోమత లేకపోవడంతో తిరిగి ఆ దంపతులు విశాఖ చేరుకున్నారు. కెజిహెచ్‌లో మరలా బాలుడిని చేర్పించారు. అయితే రోగం ముదిరిపోయి బాలుడి గుండెల్లో మూడు రంధ్రాలు ఏర్పడటం, దీనివల్ల కుర్రాడు రోజు రోజుకు నల్ల రంగుగా మారి పోతున్నాడు. ఇక్కడి షీలా నగర్‌లోని కృషి-ఐకాన్ ఆసుపత్రి వైద్యులకు చూపించగా రోగ తీవ్రత రోజు రోజుకి పెరిగిపోవడం గమనించిన వైద్యులు సికింద్రాబాద్‌లోని కిమ్స్-ఐకాన్ ఆసుపత్రికి తీసుకువెళ్ళి వెంటనే ఆపరేషన్ చేయించాలని, లేదంటే బాలుని ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. బాలుని గుండె ఆపరేషన్‌కు సుమారు 5 లక్షలు అవుతుంది, రోజువారీ కూలితో పొట్టపోసుకునే ఉమా మహేశ్వరరావుకు ఇన్ని లక్షలు ఖర్చు చేసి బాలునికి ఆపరేషన్ చేయించే ఆర్థిక స్థోమత ఏమాత్రం లేదు. ఈ నేపద్యంలో దాతలెవరైనా ముందుకు వచ్చి బాలుడికి ఆర్థిక సహాయం అందజేస్తే ఆ పసివానికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని ఉమా మహేశ్వరరావు దంపతులు కన్నీటితో దయగల దాతల సాయం కోసం అర్థిస్తున్నారు. ఈ పేద దంపతులకు సాయం చేసి, బాలుని బ్రతికించడానికి సాయ పడదలచిన వారు తమ ఆర్థిక సాయాన్ని నీలాపు శశిరేఖ, సిండికేట్ బ్యాంక్, చినవాల్తరు బ్రాంచి, అకౌంట్ నెం.35822250019560, IFSC: SYNB0003582 అనే ఖాతాకి జమ చేయగలరు. మరిన్ని వివరాలకు 9581229045 నెంబర్‌కు ఫోన్ చేయవలసినదిగా విజ్ఞప్తి చేశారు.

ఏయూను సందర్శించిన లింకన్ యూనివర్సిటీ కాలేజ్ ప్రతినిధులు

వీసీ ఆచార్య జి. నాగేశ్వరరావు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని మలేషియాలోని లింకన్ యూనివర్సిటీ కాలేజ్ ప్రతినిధులు మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ, లింకన్ వర్సిటీల మధ్య పరస్పర అవ



గాహన ఒప్పందం చేసుకోవడానికి అనువైన అంశాలపై చర్చించారు. డ్యూయెల్ డిగ్రీ కోర్సుల నిర్వహణ, పిహెచ్‌డి ప్రవేశాలు కల్పించడం, సంయుక్త పరిశోధనలు నిర్వహించడం, అంతర్జాతీయ సదస్సులు, వర్క్ షాప్‌లు నిర్వహణ, ఫ్యాకల్టీ, స్టూడెంట్స్ ఎక్స్‌ఛేంజ్ ప్రోగ్రామ్స్ నిర్వహణ తదితర కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు, రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాద రావు, రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్, డీన్ ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, లింక్ యూనివర్సిటీ ప్రతినిధి యశస్వి దేవినేని, ఏయూ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య పేరి శ్రీనివాసరావు, ఆచార్య ఎం.ప్రమీల దేవి, శివప్రసాద్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు, ఆచార్య కె.వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై

అవగాహన సదస్సు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : స్థానిక బర్మాకాలనీ కే కోలనీ ప్రాథమిక పాఠశాలల్లో ట్రాఫిక్ అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. కంచరపాలెం ట్రాఫిక్ సిఐ వైకుంఠరావు ఆదేశాల మేరకు ఎస్సై సిహెచ్ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు ట్రాఫిక్ పై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. రోడ్లపై రోడ్డు దాటుతున్నప్పుడు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జీబ్రా లైన్ దాటినప్పుడు రాకపోకల వాహనాలపై దృష్టి సారించి రోడ్డుపై నడవా లన్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్ళేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని అదేవిధంగా కార్లలో ప్రయాణించే వారు తప్పకుండా సీట్ బెల్ట్ ధరించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ ఏ డి జంక్షన్ లో ..

30 వ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా ఎన్ఏడీ జంక్షన్లో పాదచారులకు వాహనచోదకులకు ట్రాఫిక్ పై అవగాహన సదస్సు కంచరపాలెం ట్రాఫిక్ మరియు రవాణాశాఖ సంయుక్త ఆధ్వర్యములో నిర్వహించారు. ఈ మేరకు పాదచారులకు ద్విచక్రవాహనదారులకు ట్రాఫ్ నిబంధనలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రములో రవాణాశాఖ మోటార్ వేకెల్ ఇన్స్పెక్టర్ లు జెవిఎస్ ప్రసాద్, బి రాజారావు ,కె




సుమన్ కుమార్, జి. సృజన, కంచరపాలెం ట్రాఫిక్ ఎస్ ఐ లు సిహెచ్ రాజేందర్ ప్రసాద్, సిహెచ్ రమేష్, జి నాగేశ్వరరావు మరియు సిబ్బంది పాల్గున్నారు.

జనసైనికులపై

దాడిచేస్తే సహించేది లేదు

విశాఖపట్నం, న్యూస్ లీడర్ : క్రమశిక్షణకు, రాజకీయ విలువలకు కట్టుబడి ఉన్న జనసేన నాయకులకు గాని, కార్యకర్తలపై దాడుల చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్, పాక సత్యన్నారాయణలు హెచ్చరించారు.



ఇటీవల గుంటూరులో జనసేన పార్టీ కార్యాలయంపై కొంత మంది టీడీపీ కార్యకర్తలు జనసేన కార్యకర్తలపై దాడికి నిరసనగా జనసేన రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుత నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం జీవీఎంసీ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమపై దాడులకు పూనుకున్నప్పటికీ తమ నాయకుడు అదేశాల ప్రకారం శాంతియుతంగా ఉండాల్సి వచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తన పార్టీకి ఆదరణ పెరుగుతుందని దీనిని చూసి ఓర్వలేక తమ పార్టీపై దాడులకు పూనుకుని నీచ రాజకీయాలకు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికైనా ఇటువంటి నీచరాజకీయాలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వారు హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో జె.కతారి, బి.రఘు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కన్సెల్టెన్సీ ఉపయోగపడుతుంది

ఈపీడీసీఎల్ చైర్మన్ హెచ్ వి దొర

ఎలక్ట్రికల్ సేఫ్టీ ఆడిట్, ఎనర్జీ ఆడిట్, అవగాహన కార్యక్రమాలు

విశాఖపట్నం, న్యూస్ లీడర్ : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కన్సల్టెన్సీ ఎంతో ప్రపయోజనకరంగా ఉంటుందని ఎంతగానో ఉపయోగపడుతుంది ఈపీడీసీఎల్ చైర్మన్ హెచ్‌వి దొర అభిప్రాయపడ్డారు. బుధవారం ఉదయం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా గల విద్యుత్ శాఖ ఆవరణలో విద్యుత్ కన్స్యూమర్ కన్సల్టెన్సీ సర్వీస్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ విశ్రాంత ఇంజనీర్లు వినియోగదారుల ప్రయోజనాలకు చేస్తున్న కృషిని అభినందించారు. విద్యుత్తు అంశంపై ఏవైనా సందేహాలుంటే ఈ కేంద్రం ద్వారా పరిష్కారం పొందాలని వినియోగదారులందరికీ ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. చార్టర్డ్ ఇంజనీర్ ఆర్. వి. రమణారావు మాట్లాడుతూ ఈపీడీసీఎల్ పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారుల, పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు విద్యుత్ విషయాలలో సందేహాలను నివృత్తి చేసి తగిన సూచనలు చేయడమే తమ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కన్సల్టెన్సీకి సింహాద్రి రాజు సీఈవోగా ఉంటారన్నారు. ప్రతి జిల్లాకు విశ్రాంత చీఫ్ ఇంజనీరు, సూపరింటెండెంట్ ఇంజనీరు ఆయా జిల్లాల్లో వినియోగదారులకు సలహాలను అందజేస్తారన్నారు. తమ సభ్యులందరికీ 30 నుంచి 35 సంవత్సరాల అపారమైన సాంకేతిక అనుభవం ఉన్నదన్నారు. ఎలక్ట్రికల్ సేఫ్టీ ఆడిట్, ఎనర్జీ ఆడిట్, అవగాహన కార్య క్రమాలు, స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం తదితర సర్వీసులను అందిస్తామన్నారు. సామాన్య విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ వాడకం, విద్యుత్ బిల్లుల తగ్గింపు, నాణ్యతా ప్రమాణాలు పాటించడం పై ఉచిత సలహాలు ఇస్తామన్నారు. విద్యుత్ వైర్లు ఎర్తింగ్ లో మార్పులు, చేర్పులు, లోడ్ టెస్ట్ చేయడం, సీసీ కెమెరాలు ఏర్పాటు, సోలార్ ప్లానర్స్, ఫైర్ సేఫ్టీ వంటి వాటిపై సూచనలు అందిస్తామన్నారు .విద్యుత్ బిల్లు మొత్తం 25 శాతంకు పైగా పెరిగినట్లయితే అందులో ఉన్న ఇబ్బందులను గుర్తించి వినియోగదారులకు వాస్తవ విషయాలు తెలియ చేస్తా మన్నారు. నామినల్ ఫీజులపై కస్టమర్లకు సర్వీసులు అందజేసి సంతృప్తి పరచడమే సంస్థ ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో కన్సల్టెన్సీ డైరెక్టర్లు ఎస్. రామారావు, కె. పైడిరెడ్డి, కృష్ణమూర్తి, గోపాలకృష్ణ, ప్రసాద్, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : నగరం నుంచి వివిధ ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి వ్యాపారులను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద నుంచి సుమారు 300 కేజీల గంజాయి స్వాదీనం చేసుకున్నారు. విశాఖజిల్లా నక్కపల్లి మండలం అడ్డరోడ్డు ప్రాంతానికి చెందిన ధనరాజు భూపాలపట్నంలో జన్మించాడని, సులభంగా డబ్బు సంపాదించడానికి మార్గాలు వెతుకుతూ ఈ గంజాయి అక్రమ వ్యాపారాన్ని ఎంచుకున్నాడన్నారు. ఈ వ్యాపారంలో భాగస్వామిగా మూర్తిని కూడా ప్రభావితం చేసాడన్నారు. ఈ గంజాయి రవాణాలో ప్రతి రెండు కిలోల గంజాయి ప్యాక్‌కు రెండువేలు వసూలు చేసేవారన్నారు. ఆటలోవ ప్రాంతం నుంచి గంజాయిని సేకరించి ఢిల్లీలోని గౌతంభాయ్‌కి నిరంతరం సరఫరా చేసేవారన్నారు. ఇటీవల జరుగుతున్న దాడుల నేపథ్యంలో రవాణా చేయడం కష్టమవడంతో కొత్త మార్గాన్ని ఎంచుకున్నారని తెలిపారు. దీనిలో భాగంగా కొరియర్ సేవలు నిర్వహిస్తున్న వెంకటరమణను పరిచయం చేసుకున్నారు. ఈ



కొరియర్ ద్వారా రవాణా చేయడానికి కిలోకు 300రూపాయలు చెల్లిస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా సోమవారం ఎపి 31ఎక్స్ 4547 నెంబరు గల కారులో గంజాయి తరలించడానికి ప్రయత్నించారు. ఈముగ్గురు నిందితులు కమీషన్ల గురించి మాట్లాడుకుంటున్న సమయంలో రైల్వే న్యూకాలనీ శ్రీకన్య ధీయెటర్ వెనుక టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద నుంచి కారును, సెల్‌ఫోన్లు, 2లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. నిందితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పంచాంగం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశర ఋతువు మాఘ మాసం శుక్ల పక్షం

విదియ ఉ. 7-52 వరకు
శతభిషం మ. 12-11 వరకు
వర్జ్యం సా. 7-19 నుండి 9-07వరకు
దు.ము: ప.10-12 నుండి 11-04 వరకు
పు.దు.ము.మ 2-45 నుండి 3-40 వరకు
రా.కా.మ.1-32 నుండి 3-05 వరకు

రాజకీయ సినిమా

నిజానికి గత కొన్నేండ్లుగా దేశంలో రాజకీయపార్టీల ఎన్నికల ప్రచార సరళి మారిపోయింది. కేవలం సభలు, ప్రకటనల లాంటి సనాతన విధానాలకు భిన్నంగా పెరిగిన సాంకేతిక అభివృద్ధిని ఉపయోగించడం మొదలైంది. ఐదేండ్ల కిందట ఎన్నికలప్పుడు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విటర్, వాట్సప్‌లను విస్తృతంగా వినియోగించి యువతీయువకులను ప్రభావితం చేసిన రాజకీయపార్టీలు ఈసారి మరింత విస్తృతమైన ప్రసార వ్యవస్థ అయిన సినిమాను తమ ప్రచారానికి వినియోగిస్తున్న తీరు స్పష్టంగా కనిపిస్తున్నది.విలువలను వివేకాన్ని, వినోదాన్ని అందించే కళాత్మక దృశ్య మాధ్యమమైన సినిమా వర్తమాన భారతంలో శుష్క రాజ కీయ ప్రచార మాధ్యమంగా తెరపైకి వస్తున్నది. దేశానికి అత్యంత ముఖ్యమైన ఎన్నికల ఏడాదిలో ఈ ప్రయత్నాలు విరివిగా జరుగుతున్నాయి. బాలీవుడ్‌గా పిలువబడే హిందీ సినిమా రం గంలోనే కాకుండా వివిద భారతీయ భాషా సినిమాల్లో కూడా ఈ ప్రచార ధోరణి కనిపిస్తున్నది. ఎన్నికల కాలంలో సినిమా రాజకీయపార్టీల ప్రచార వేదికగా పరిణామం చెందుతున్నది. కళగా సినిమాల్లో రాజకీయ దృక్పథా లు ధోరణులూ కనిపించవచ్చు, అది ఆక్షేపణీయం కాదు. స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో రాజ్‌కపూర్, మనోజ్‌కుమార్ లాంటి సుప్రసిద్ధ నటులు, దర్శకులు నవ్య స్వతంత్ర భారత స్థితిని వివరిస్తూ దేశం గురించి ఆశా వహమైన కళాత్మక సినిమాలుగా అవి రూపొందాయి. ప్రజలూ వాటిని విశేషంగా ఆదరించారు. కానీ ఆ ధోరణిలో వచ్చిన సినిమాలు అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రచార సినిమాలుగా రాలేదు. అది గమనించాల్సిన అంశం.కానీ, ఈ రోజుల్లో వస్తున్న సినిమాలు పార్టీల ప్రచార కార్యక్రమాలకు వాహకాలుగా మారడం అభిలషనీయ పరిణామం కాదు. గత కొన్ని నెల లుగా విడుదలవుతున్న భారతీయ సినిమాల్లో దేశంలోని ప్రధాన రాజకీ య పార్టీ పెంచి పోషిస్తున్న భావజాలవ్యాప్తికి ఊతమిచ్చేలా ప్రచార బాధ్య తలను మోస్తున్నాయి. అంతేకాకుండా తద్వారా రాబోయే ఎన్నికల్లో ఓట్ల లబ్ధి పొందే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.నిజానికి గత కొన్నేండ్లుగా దేశంలో రాజకీయపార్టీల ఎన్నికల ప్రచార సరళి మారిపోయింది. కేవలం సభలు, ప్రకటనలలాంటి సనాతన విధానాలకు భిన్నంగా పెరిగిన సాంకేతిక అభివృద్ధిని ఉపయోగించడం మొదలైంది. ఐదేండ్ల కిందట ఎన్నికలప్పుడు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విటర్, వాట్సప్‌లను విస్తృతంగా వినియోగించి యువతీయువకులను ప్రభావితం చేసిన రాజకీయపార్టీలు ఈసారి మరింత విస్తృతమైన ప్రసార వ్యవస్థ అయిన సినిమాను తమ ప్రచారానికి వినియోగిస్తున్న తీరు స్పష్టం గా కనిపిస్తున్నది. సామాజిక మాధ్యమాలు కేవలం పట్టణ, చదువుకున్న వారిపైనే ప్రభావం కలిగించ గలిగింది. సినిమా అయితే గ్రామీణ నిరక్షరా స్యులను కూడా ప్రభావితం చేయగలదు. కాబట్టి పలు రాజకీయపార్టీలు ఈసారి సినిమాను వినియోగించుకుంటున్నాయి. కేవలం తమ ప్రచారాని కే పరిమితం చేయకుండా ఎదుటి పార్టీపై బురదచల్లడానికి సినిమాను ఉపయోగిస్తున్నాయి.

కులాల కురుక్షేత్రంలో నలుగుతున్న ప్రజాస్వామ్యం

ఆంధ్రప్రదేశ్‌లో గత మూడు నాలుగు దశాబ్దాలుగా కులం కంపు కొడుతున్నాయి రాజకీయాలు. ఎవరు ఏ కులం అన్నది చూసి టిక్కెట్ ఇవ్వడం, అలాగే, ఏ కులానికి ఎన్ని మంత్రి పదవులు ఇచ్చామో గొప్పగా పాలకులు ప్రకటించడం వంటివి చూస్తుంటే మనం అసలు అభివృద్ధి చెందామా అనిపించకమానదు. కులాన్ని క్రెడిటేరియాగా చూసే సమాజం అంటే అది ఇంకా ఆటవిక సమాజంగానే భావించాలి. నేను ఫలానా కులంలో పుట్టాను కాబట్టి గొప్పవాణ్ని అనుకునే స్వభావం ఇంకా ఉందంటే ఆ సమాజం ఎదగలేదనుకోవాలి. కులాల చిచ్చును రాజేస్తూ రాజకీయ నాయకులు ఏ ఏటికి ఆ ఏడు ఎన్నికలలో ఓట్ల పంటను పండించుకుంటున్నారు. వారిచ్చిన మత్తుకు బానిసలై యువత చెడిపోతోంది. మా కులం వాడు అంటూ గంగవెర్రులెత్తిపోతోంది. ఈ జాతరలో వేల కోట్ల రూపాయల ప్రజా ధనం కాజేస్తున్నా పట్టించుకున్న వారే లేరు. ఇదిలా ఉండగా, ఏపీలో ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. ఇప్పటికే మూడు ప్రధాన పార్టీలను తమ సొంతంచేసుకున్న కులాలు పడగవిప్పి సిద్ధంగా ఉన్నాయి. ఎన్నికలు చావో రేవో అన్నట్లుగా సాగనున్న నేపథ్యంలో కులాల మంటలను చల్లార్చే విధంగా చేయాల్సిన మన రాజకీయ నాయకులు వాటినే ఆయుధాలుగా చేసుకోవడం అంటే నిజంగా దారుణమే. ఇది సామాజిక సంఘర్షణలకు దారి తీస్తే బాధ్యులెవరు అన్నది కూడా చూడాలి. ప్రభుత్వాలు మారుతున్నా వాటి వెనక కుల రక్కసి మారుతుంది తప్ప పూర్తిగా అంతం కావడం లేదు. ఎంతకాలం ఈ పరిస్థితి..? ఎన్నాళ్లు ఈ దుస్థితి..? ఏపిలో తారా స్థాయిలో కుల రాజకీయాలు..!

ఏపిలో రాజకీయాలు సాంకేతికతతో ముందుకు వెళ్తున్నాయో.. కుల రాజకీయాలతో తిరుగమిస్తున్నాయో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి. చంద్రబాబు సారథ్యంలో అత్యుత్తమ సాంకేతికతతో ఏపి పరుగులు పెడుతుంటే అదే సమయంలో కుల రాజకీయాలు సైతం ఏపిలో వికటాట్టహాసం చేస్తున్నాయి. ఈ సంప్రదాయం ఏపి అభివృదికి శరాఘాతంలా పరిణమించినా నియంత్రించే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా వాటి వెనక కుల రక్కసి మారుతుంది తప్ప పూర్తిగా అంతం కావడం లేదు. ఎంతకాలం ఈ పరిస్థితి..? ఎన్నాళ్లు ఈ దుస్థితి..? ఏపిలో తారా స్థాయిలో కుల రాజకీయాలు..! ప్రశ్నిస్తున్న ప్రతిపక్షం..!! ఏపీలో కుల పంచాయతీలు, వర్గాలుగా విడిపోవటాలు కొత్తేం కాదు. 1970 దశకంలో మొదలైన వర్గపోరు 1980లో కోరలు చాచింది. ఇప్పుడు అది ఏకంగా ప్రభుత్వాలను నిలబెట్టేంత వరకూ చేరిందనే చెప్పాలి. కులాల కుంపట్లు వెనుక ఆధిపత్యం సాదించాలనే నాయకులు, ఆ తరువాత రాజకీయంగా లబ్ధిపొందాలని భావించిన పెద్దల బుర్రల నుంచి ఇది విషసం స్కృతిగా మారింది. ముఖ్యంగా గుం టూరు, కృష్ణా జిల్లాలో మొగ్గతొడిగిన బీజాలు, క్రమంగా ఏపీ వ్యాప్తంగా వట వృక్షం మాదిరి ప్రభావం చూపుతున్నాయి. వైసీపీ అదినేత జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ సాక్షిగా కులాల కుంపట్లను కదిలించిన నేపథ్యంలో ఏపిలో నెలకొన్న కుల రాజకీయాలపై ఓ కన్నేయాలనిపించింది. ఇప్పటి వరకూ కేవలం గోప్యంగానో, మీడియా వరకూ పరిమితమైన అంశాన్ని ప్రతిపక్ష నేత చర్చనీయాంశంగా మార్చారనే చెప్పాలి. ఏపీలో ఇటీవల 37 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతులు కల్పించారు. వీరిలో 35 మంది కమ్మ సామాజికవర్గానికి చెందిన వారు ఉన్నారనేది జగన్ ప్రధాన ఆరోపణ. 2004-2014 వరకూ పదోన్నతులు పొందిన అధికారుల జాబితాలో రెడ్డి వర్గమే అధికంగా లబ్దిపొందిందనేది టీడీపీ వైపు నుంచి వచ్చే కౌంటర్ సమాధానం. చెల్లుకు చెల్లు అనేంతగా ఇరు పార్టీలు ప్రత్యారోపణలు చేసుకోవడం విశేషం. వాస్తవానికి కులాలను ప్రాతిపదికగా తీసుకుని పదోన్నతులు, పోస్టింగ్‌లు ఇవ్వటం ఇదేం కొత్తకాదు. కానీ గత పదేళ్లుగా ఇది తారాస్థాయికి చేరటమే కులాల మధ్య మరింత అగ్గి రాజేసింది. ఇప్పుడి ఎన్నికల సమయం, పైగా ఏపీలో మూడు పార్టీలను మూడు కులాలను సొంతం చేసుకుంటున్నాయి. సోషల్ మీడియా ప్రభావంతో ఒకర్నొకరు రెచ్చగొట్టుకుంటూ పోలీసు కేసుల వరకూ చేరుకుంటున్నాయి కుల రాజకీయాలు. కేవలం తమ అభిమానాన్ని బావోద్వేగంతో ముడిపెట్టి జుగుప్సాకరమైన కామెంట్స్ చేయటమే దీనికి కారణం. ఈ అరెస్టులతో వీటికి ఫుల్‌స్టాప్ పడుతుందా అంటే లేదనే సమాదానం వినిపిస్తుంది. ఇటువంటి సమయంలో జగన్ వేసిన కుల పదోన్నతుల ప్రశ్నపై చంద్రబాబు ఆచితూచి స్పందించారు. కాదని.. చెప్పలేదు. ఔనని అనలేదు. నర్మగర్భంగా తాను అన్ని కులాలకు ప్రాదాన్యతనిస్తానంటూ దాటవేసారు. ఇది ఇంతటితో సమసిపోతుందా అంటే చెప్పటం కష్టమే. ఎన్నికల సమీపిస్తున్న వేళ కులాల మధ్య ఎమోషన్స్‌ను రెచ్చగొట్టి, శాంతిభద్రతల సమస్య తలెత్తేందుకు కారణం కావచ్చనే ఆందోళన కూడా వ్యక్తమవుతుంది. మరి ఏపిలో నెలకొన్న కులాల కురుక్షేత్రం ఎప్పటివరకు సమసిపోతుందో చూడాలి. ఇక ఇక్కడ చూసుకుంటే ఎవరూ ఎక్కునా తినలేదు. తక్కువా తినలేదు. భారతీయ సమాజంలో కులం అన్నది ఎవరు ఎలా అనుకున్నా కచ్చితంగా ఉంది. దానిని ఎవరూ తోసిరాజేయలేరు. అదే సమయంలో కులాల మధ్య చిచ్చు పెట్టి చోద్యం చిత్తగించే రాజకీయ నాయకులు కూడా ఉన్నారు. మన దేశంలో ఎన్ని కులాలు ఉన్నాయి, వారి ఓట్లు ఎన్ని ఉన్నాయి, ఇలాంటి లెక్కలు వేసుకోవడంలో మన రాజకీయ నాయకులను మించిన వారు ఎవరూ లేరు. ఉత్తరప్రదేశ్ తీసుకుంటే అక్కడంతా కులాల ఓట్లు ఆయా పార్టీలకు పక్కాగా పడిపోతాయంటే ఎంతటి కులస్వామ్యం రాజ్యమేలుతుందో అర్థం చేసుకోవాలి. అంటే పేరుకు ప్రజాస్వామ్యం కానీ, జనాలంతా కులం కోసమే పుడుతున్నారు. గిడుతున్నారనుకోవాలి. మన కులం వాడైతే చాలు, తప్పుచేసినా ఒప్పే. మనోడే పాలించాలి, మనోడే రాణించాలి. ఈ నీతి ప్రజలలో వచ్చాక ఇక ఈ దేశాన్ని పాలించేది కులం కాక మరేం ఉంటుంది. ఉత్తరాదిన కులం, మతం సెంటిమెంట్ బాగా ఎక్కువ అంటారు. మరి, అది దక్షిణాదిన కూడా పాకేసింది. తమిళనాడు, కర్నాటకలలో కూడా కుల జాడ్యం ఎక్కువే. ఇక, ఆంధ్రప్రదేశ్‌లో గత మూడు నాలుగు దశాబ్దాలుగా కులం కంపు కొడుతున్నాయి రాజకీయాలు. ఎవరు ఏ కులం అన్నది చూసి టిక్కెట్ ఇవ్వడం, అలాగే, ఏ కులానికి ఎన్ని మంత్రి పదవులు ఇచ్చామో గొప్పగా పాలకులు ప్రకటించడం వంటివి చూస్తుంటే మనం అసలు అభివృద్ధి చెందామా అనిపించకమానదు. కులాన్ని క్రెడిటేరియాగా చూసే సమాజం అంటే అది ఇంకా ఆటవిక సమాజంగానే భావించాలి. నేను ఫలానా కులంలో పుట్టాను కాబట్టి గొప్పవాణ్ని అనుకునే స్వభావం ఇంకా ఉందంటే ఆ సమాజం ఎదగలేదనుకోవాలి. కులాల చిచ్చును రాజేస్తూ రాజకీయ నాయకులు ఏ ఏటికి ఆ ఏడు ఎన్నికలలో ఓట్ల పంటను పండించుకుంటున్నారు. వారిచ్చిన మత్తుకు బానిసలై యువత చెడిపోతోంది. మా కులం వాడు అంటూ గంగవెర్రులెత్తిపోతోంది. ఈ జాతరలో వేల కోట్ల రూపాయల ప్రజా ధనం కాజేస్తున్నా పట్టించుకున్న వారే లేరు. ఇదిలా ఉండగా, ఏపీలో ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. ఇప్పటికే మూడు ప్రధాన పార్టీలను తమ సొంతంచేసుకున్న కులాలు పడగవిప్పి సిద్ధంగా ఉన్నాయి. ఎన్నికలు చావో రేవో అన్నట్లుగా సాగనున్న నేపథ్యంలో కులాల మంటలను చల్లార్చే విధంగా చేయాల్సిన మన రాజకీయ నాయకులు వాటినే ఆయుధాలుగా చేసుకోవడం అంటే నిజంగా దారుణమే. ఇది సామాజిక సంఘర్షణలకు దారి తీస్తే బాధ్యులెవరు అన్నది కూడా చూడాలి. ఏది ఏమైనా మనం ఇంకా పరిపక్వతతో కూడిన ఆలోచనలు చేయడంలేదనడానికి తాజాగా ఎన్నో ఉదాహరణలు కళ్ల ముందు కనిపిస్తున్నాయి.





జగన్ బలం.. మడమతిప్పకపోవడమే!



నలభై ఎళ్ల అముభవమున్న చంద్రబాబుని అల్లడిస్తున్నది నలభై ఐదేళ్ల వయసున్నజగన్ . జగన్‌కి ఏకలవ్యశిష్యుడిలా బాబు తయారుకావడం ప్రజలే కాదు టీడీపీ అభిమానులే ఏవగించుకుంటున్నారు. జగన్మోహనరెడ్డి మీద, ఆయన పార్టీ పెట్టిన తొలినాటినుంచి అనేకానేక అవినీతి ఆరోపణలున్నాయి. వాటిని ఖాతరు చేయకుండా ముందుకు సాగడం ఆయనకున్న ఒక ప్లస్ పాయింట్. అలాగే.. తొలినాటినుంచి ఇవాళ్టి దాకా మడమ తిప్పకుండా ఒకే వైఖరిని అనుసరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధించే విషయాన్నే తీసుకుంటే.. చంద్రబాబునాయుడు ఎన్నిదశల్లో ఎన్నెన్ని డ్రామాలు ఆడారో, ఆడుతున్నారో అందరికీ తెలుసు. జగన్ ఒక్కసారి కూడా మాట మార్చలేదు. ప్రత్యేకహోదా కోసం తొలినుంచి వైఎస్సార్ కాంగ్రెస్ మాత్రమే చిత్తశుద్ధితో పోరాడింది. ఆ చిత్తశుద్ధిని ఇంకా కాపాడుకుంటోంది.

కేంద్రంలో రాజకీయ సమీకరణల ప్రస్తావన వచ్చినప్పుడు.. హోదా ఇచ్చేవాళ్లకే మద్దతు అని గతంలోనే చెప్పిన మాటకే ఇప్పటికీ కట్టుబడి ఉన్నారు. హోదా సంతకం పెట్టిన పార్టీకే మద్దతు ఇస్తాం అని తాజాగాను చెబుతున్నారు. అలాంటి జగన్ మీంద.. 'తల్లి-పిల్ల కాంగ్రెస్'లంటూ.. కాంగ్రెస్‌తో అంటకట్టడానికి, మోడీ జేబులో మనిషి అంటూ భాజపాతో అంట కట్టడానికి చంద్రబాబు ఎన్ని మాయోపాయాలు పన్నారో అందరికీ తెలుసు. చివరికి భాజపా చంకలోంచి, ఇప్పుడు కాంగ్రెస్ చంకలోకి మారి.. రాహుల్ పల్లకీ మోయడానికి అత్యుత్సాహం చూపిస్తున్నది చంద్రబాబే కావడం విశేషం.

'సర్వేషు కాలేషు'

సర్వే అంటే జనాభిప్రాయ సేకరణ. అంటే, అలాంటి ప్రయత్నం ద్వారా వ్యక్తం అయ్యేది, తెలిసివచ్చేది జనాభిప్రాయం మాత్రమే. అయితే, జనాభిప్రాయం అనేది, ఎప్పటికీ ఎలాంటి మార్పులేకుండా శిలాసదృశంగా ఉండేది ఎంతమాత్రమూ కాదు! రాజకీయ సర్వేలలో వెల్లడయ్యే జనాభిప్రాయాలు కాలానికి, పరిస్థితులకు, ప్రలోభాలకు లోబడి ఉంటాయి. నిర్ణయాత్మక సమయానికి అవి మారవనే ధ్రువీకరణ లేదు. 'సర్వేషు కాలేషు' అని భగవద్గీతలో చెప్పినట్లు సకల కాలాల్లోనూ ఒకే అభిప్రాయం కలిగి ఉండడం సామాన్యులకు ఎలా కుదురుతుంది.ఈ ఉపోద్ఘాతం అంతా ఎందుకంటే.. ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. ఉభయ చట్టసభలకూ ఎన్నికలు ముంగిట్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఆ సందడి ఎక్కువగా ఉంది. దానికి అనుగుణంగా ఫలితాలు ఇలా ఉండగలవని చెప్పే సర్వేలు కూడా వెల్లువెత్తుతున్నాయి. ఈ సర్వేలు చాలావరకు వైఎస్సార్ కాంగ్రెస్- జగన్మోహన్ రెడ్డికి అనుకూలంగానే ఉన్నాయి. సర్వేల ఫలితాలను చూసి.. ఆ పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోవచ్చునా? ఈ సర్వేలు... ఇవాళ్టి ప్రజల అభిప్రాయాలనే ప్రతిబింబిస్తుండవచ్చు గాక... కానీ, ఎన్నికలు జరిగే సమయానికి వారిని ఇతరత్రా ప్రలోభాలు, పోల్ మేనేజిమెంట్ నైపుణ్యాలు ప్రభావితం చేయకుండా ఉంటాయా? అనేది కీలకాంశం.తెలుగుదేశం పార్టీ ఎంత ఖర్చుకైనా వెనకాడకుండా.. అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి సమృద్ధిగా ఆర్థిక వనరులను సమకూర్చుకునే ఉంది. చంద్రబాబునాయుడు తన అమ్ములపొదిలోంచి సకల మాయోపాయాలను, ప్రజలను మభ్యపుచ్చగల సంక్షేమపథకాలను బయటకు తీస్తున్నారు. వీటన్నింటినీ మించి- తుదిక్షణంలో కీలకమైన 'పోల్ మేనేజిమెంట్'లో పచ్చదళాలు ఆరితేరి ఉన్నాయి. ఇలాంటి నేపథ్యంలో... విజయం దక్కించుకోవాలంటే.. వైఎస్సార్ కాంగ్రెస్ అప్రమత్తం కావాల్సి ఉంది. ఆయాకోణాల్లో తామెంతవరకు దీటుగా ఉన్నామో వారు ఒకసారి ఆత్మసమీక్ష చేసుకోవాల్సి ఉంది.ఎన్నికల సమయంలో ఉధృతంగా ఉండే సీజనల్ వ్యాపారం సర్వేలు. వెల్లడయ్యేవి వాస్తవాలు అవునో కాదో.. సర్వేలు శాస్త్రబద్ధంగా జరుగుతున్నాయో లేదో పుటం వేసి.. నిగ్గు తేల్చగలవారు తక్కువ. నాయకుల్లో మరీ తక్కువ. సర్వేల పేరుతో తమ పంచన చేరే వారిలో ఎవరో ఒకరిని ఎంచుకుని.. వారితో నాయకులు సర్వే చేయించుకుంటూ ఉంటారే తప్ప.. వారి నిర్దిష్టతను గుర్తించగలిగి మాత్రంకాదు. ఒకే ప్రదేశంలో వేర్వేరు నాయకులు, వేర్వేరు సంస్థలతో సర్వేలు చేయిస్తున్నప్పుడు.. ఫలితాలు కూడా వేర్వేరుగా వస్తుంటాయి. ఇది చాలా ఆశ్చర్యం కలిగిస్తుంటుంది.నిజమైన ప్రజాభిప్రాయమే అయితే గనుక... ఫలితాలు ఒకేతీరుగా రావాలి. అయితే.. పరస్పర విరుద్ధంగానూ ఫలితాలు వస్తుండడం మనం చూస్తుంటాం. ఏతావతా.. నాయకుల ముఖప్రీతి కోసం లేదా... సర్వే పేరుతో జనాభిప్రాయాన్ని, ఆలోచనల్ని పక్కదారి పట్టించడం కోసం తయారవుతున్నవే. అయితే నాయకుల కోసం చేసే సర్వేలు కాకుండా.. జనాభిప్రాయాన్ని తెలుసుకోవడం కోసం కొన్ని మీడియా సంస్థలు చేయించే సర్వేల తీరు మరో విధంగా ఉంటుంది. ఫలితాల్లో తేడాకొడితే.. అది తమ సంస్థ విశ్వసనీయత, మనుగడ మీద ప్రభావం చూపిస్తుంది గనుక.. వారు కాస్త జాగ్రత్తగా చేస్తుంటారు. వర్తమానంలోకి వస్తే.. ఎన్నికల నేపథ్యంలో వివిధ స్వతంత్ర సంస్థలు ఇప్పటినుంచే ముమ్మరంగా సర్వేలు నిర్వహిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంత వరకు సర్వేల ఫలితాలు ఎక్కువగా వైఎస్సార్ కాంగ్రెస్‌కు అనుకూలంగా కనిపిస్తున్నాయి. ఈ సంకేతాలను అందుకుని.. జగన్మోహన్ రెడ్డి తన ఎన్నికల రణవ్యూహాన్ని ఎలా సిద్ధం చేసుకుంటాడనేదే ఇప్పుడు కీలకంగా మారుతోంది.

కులం ముద్రతో చేటు!

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మీద రెడ్ల పార్టీ అనే కులం ముద్ర ఉంది. నాయకుడిని బట్టి ఏర్పడిన ముద్ర అది. తెలుగుదేశం పార్టీకి కూడా కమ్మ ముద్ర ఉంది. కానీ ఇలాంటి 'ముద్ర'లకు అతీతమైన పాలన అందించిన శైలి.. వైఎస్ రాజశేఖర రెడ్డిది. రాజశేఖరరెడ్డి సన్నిహితులు అనదగిన.. ఆయన పాలనలో హవా చెలాయించిన వారిలో గరిష్టం నాన్-రెడ్డి నాయకులే. కేవీపీ, రోశయ్య, బొత్స, ధర్మాన, పిల్లి, ఉండవల్లి, గీతారెడ్డి, శత్రుచర్ల ఇలా చాలా కులాలకు చెందినవారు సమానంగా చక్రం తిప్పారు. అది రాజశేఖర రెడ్డికి అన్ని కులాల, వర్గాల ప్రజల్లో అంతే పాజిటివ్ ఇమేజిని సృష్టించింది.కానీ ఇవాళ వైఎస్సార్ కాంగ్రెస్‌లో జగన్ తర్వాత.. ముఖ్య నాయకులు ఎవరు? అంటే.. ఏ కార్యకర్త అయినా సరే.. తడుముకోకుండా జవాబు చెప్పలేని పరిస్థితి. వారందరూ జగన్‌కు అత్యంత ఆప్తులు, నమ్మదగిన వారు కావొచ్చు గాక.. కానీ, వారి మీద మాత్రమే ఆధారపడి... పగ్గాలు వారి చేతిలో మాత్రమే పెట్టి ఊరుకోవడానికి జగన్మోహన రెడ్డి చేస్తున్నది వ్యాపారం కాదు, రాజకీయం. అన్నివర్గాల ప్రజలను కలుపుకుపోవాల్సిన మనోవైజ్ఞానిక వ్యవసాయం అది. కులాల సమతూకం కూడా ప్రధానమే అని, కులాలకు పెద్దపీట వేయడం అంటే.. కులాల వారీగా హామీలు కురిపించడం మాత్రమేకాదు... తన పార్టీ వ్యవస్థలో అన్ని కులాల వారిని అందలంపై ఉంచడం కూడా ముఖ్యమేనని జగన్ తెలుసుకోవాలి.

మామూలు పోరాటం కాదు...

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించినంత వరకు ఇది జీవన్మరణ పోరాటం. తెలుగుదేశం ఓడిపోయినా పెద్దగా కోల్పోయేదేమీ లేదు. అయిదేళ్లలో అలవిమాలినంత అధికారం వారికి దక్కింది. వైకాపా విడుదల చేసిన గణాంకాల ప్రకారం లక్షలకోట్లు స్వాహాచేశారు. ఓటమి వలన- ఓ అయిదేళ్లు అధికారానికి దూరమైనా పెద్దగా గాభరాపడరు. కానీ వైఎస్సార్ కాంగ్రెస్ పరిస్థితి అది కాదు. ఈసారి కూడా ఓడితే.. కేడర్‌ను కాపాడుకోవడం వారికి కష్టమవుతుంది. ప్రజాస్వామ్య విలువల్ని మంటగలిపేసి.. ఎమ్మెల్యేలనే ఫిరాయింపజేసి తన పార్టీలో కలుపుకోవడం అలవాటు చేసుకున్న చంద్రబాబు... మళ్లీ గెలిస్తే.. వైకాపా కేడర్ మొత్తాన్ని కకావికలం చేయడంపై దృష్టిపెడతానేది తథ్యం.అలాంటి ప్రమాద సంకేతాలను దృష్టిలో ఉంచుకుని.. సకల శక్తులను కూడగట్టుకుని జగన్మోహన్ రెడ్డి సమరానికి ఆయత్తం కావాలి.

-కొడుకుల శ్రీనివాస్

దిన ఫలాలు

గురువారం -7-2-2019

మేషం: ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడతారు. ఋణ బాధలు తొలగిపోతాయి. కాంట్రాక్టులు దక్కుతాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది.వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

వృషభం: వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలగిపోతాయి. దూరప్రాంతాల నుంచి కీలక సమాచారం అందుతుంది. ప్రయాణాలలో నూతన మిత్రులతో పరిచయాలు.

మిథునం: మిత్రులతో ఏర్పడిన విభేదాలను పరిష్కరించుకుంటారు. కుటుంబసభ్యుల నుంచి సహాయసహకారాలు అందుకుంటారు. వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

కర్కాటకం: సంఘంలో గౌరవం పొందుతారు. విందువినోదాలలో, శుభకార్యాలలో పాల్గొంటారు. మిత్రుల నుంచి కీలక సమాచారం అందుకుంటారు.వాహనయోగం ఉంది.

సింహం: కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. దీర్ఘకాలిక సమస్యలు కొంతవరకు తీరుతాయి. సోదరుల నుంచి ధనలాభం పొందుతారు.

కన్య: ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దూంప్రాంతాల నుంచి శుభవార్తలు అందుకుంటారు. సంఘంలో ఆదరణ పొందుతారు. ఆకస్మిక ధనలాభం పొందుతారు.

తుల: ఆర్థికపరిస్థితి మెరుగుపడుతుంది. జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది. వివాహయత్నాలు ఫలిస్తాయి.

వృశ్చికం: ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలు తొలగిపోతాయి. సోదరుల నుంచి కీలక సమాచారం అందుతుంది. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

ధనుస్సు: భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు తీరి ఊరట చెందుతారు.

మకరం: ఋణబాధలు తొలగిపోతాయి. అనుకోని విధంగా లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటారు. ఉద్యోగులకు బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు


కుంభం: ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. పనులు విజయవంతంగా పూర్తిచేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

మీనం: గృహనిర్మాణ ఆలోచనలు కలిసివస్తాయి. ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. ఆర్థికపరిస్థితి అను కూలంగా ఉంటుంది. పెట్టుబడులకు తగిన లాభాలు.

మహాభారతం

చేతిలోని బాణాన్ని గురి చూసి శకుని మీదికి విసి రాడు. దాన్ని మధ్యలోనే ముక్కముక్కలు చేశాడు శకుని. భీముని చూసి కవ్వింపుగా నవ్వాడు. మరో బాణాన్ని ప్రయోగించాడు భీముడు. అది శకుని ధనుస్సును రెండు ముక్కలు చేసింది. మరో విల్లు అందుకున్నాడు శకుని. పదహారు బాణాలు ఒక్కసారిగా భీమునిపై ప్రయోగించా దతను. వాటి దెబ్బకు భీముడు తట్టుకోలేకపోయాడు. చూస్తూండగానే అతని చేతిలోని విల్లు, కేతనం విరిగి నేలకొరిగాయి. దెబ్బతిన్న రథాశ్వాలు పరిగెత్తలేకపోతున్నాయి. సారథి విశోకుడు కూడా గాయాలపాలై బాధనణ చుకుంటూ కనిపించాడు. అల్లంత దూరంలో ఉన్న దుర్యో ధనుడు అదంతా గమనించి గొంతెత్తి శకునిని అనేక విధాల అభినందించాడు. వినవచ్చిన ఆ అభినందనలకు భీముడు ప్రళయకాల రుద్రుడయ్యాడు. పెను విల్లొకటి అందుకున్నాడు. అనేక బాణాలు ఒక్కుమ్మడిగా ప్రయోగిం చాడు. ఆ బాణాలకు మూర్చావేశంతో రథంపై నుండి జారిపడ్డాడు శకుని. తెప్పరిల్లలేక పోతున్నాడు. అది గమ నించాడు దుర్యోధనుడు. వెళ్ళి శకునిని తన రథం మీదికి ఎక్కించుకున్నాడు. అక్కణ్ణుంచి తరలిపోయాడు. దూరం గా వెళ్ళిపోయాడు.

భీమసేనుడు, శిఖండి,ధృష్టద్యుమ్నుడు, ద్రౌపదీ తనూజులు, సాత్యకి మహోగ్రులై కర్ణుని ఎదుర్కొన్నారు. వారిని దీటుగా ఎదుర్కొని వారందరి రథాశ్వాలను, కేతనా లను నేల కూల్చాడు కర్ణుడు. నకుల సహదేవులు డీకొన్నా రతన్ని. ఒకే వరుసలో బాణాలు ప్రయోగించి కర్ణుణ్ణి బాగా నొప్పించారు. దాంతో మండిపడ్డాడు కర్ణుడు. ఎడతెగని బాణాలు ప్రయోగించి వారిని వేధించి విజయ శంఖం పూరించాడు. అది విన్నాడు అర్జునుడు. ఇలా అన్నాడు కృష్ణుడితో."బావా! అదిగో కర్ణుని కేతనం కనిపి స్తోంది. భీమసేనుడు, నకుల సహదేవులంతా అతనితో పోరాడుతున్నారు.



యుద్ధానికి సిద్ధమయిన కర్ణార్జునులు

భీకర సంగ్రామం జరుగుతోందక్కడ. అతని తోడ్పాటుతో కృపాశ్వత్థామలు, కృతవర్మ, దుర్యో ధనులు ముందుకురికి పాంచాల యోధుల ప్రాణాలు తీసున్నారు. ఇక మనం క్షణకాలం కూడా ఆలస్యం చేయ కూడదు. కర్ణుని ఎదుర్కొని అతని అంతు చూడాల్సిందే! రథాన్ని అటుగా పోనీయ్"అర్జునుని మాట పూర్తికా నేలేదు, కృష్ణుడు రథాన్ని కర్ణుని వైపు పోనిచ్చాడు. ఆ రథచక్ర ఘోషకి యుద్ధరంగం అంతా గజగజా వణికిపోయింది. పరుగు పరుగున వస్తోన్న అర్జునుని రథాన్ని చూసి, శల్యుడు ఇలా అన్నాడు కర్ణునితో. "చూ శావా అర్జునుడు వస్తోన్న తీరు! కోపంతోనూ, గర్వం తోనూ చెలరేగిపోయి నీతో అమీతుమీ తేల్చుకునేందుకు వస్తున్నట్టున్నాడు. నువ్వు కూడా ఎదురు చూస్తున్నది ఇందుకోసమే కదా! అవకాశాన్ని వినియోగించుకో! అర్జునుని నిర్జించి విజయం చేజిక్కించుకో"శల్యుని ప్రోత్సాహంతో ఉప్పొంగి పోయాడు కర్ణుడు. ఇలా అన్నాడు.

"మద్రేశ్వరా! నువ్వు ఆశించినట్టుగానే జరుగుతుం దంతా! అర్జునుని నిమేషకాలంలో నేలపై కూల్చివేస్తా ను. రథాన్ని అటుగా పోనీయ్"శరవేగంతో కర్ణుని తీసు కుని వెళ్ళి అర్జునునికి సమీపంలో నిలిపాడు శల్యుడు. దూరంగా ఉండి అది గమనించాడు దుర్యోధనుడు. కృప కృతవర్మాశ్వత్థామలను కర్ణుని ఆదుకోవాల్సిందిగా హెచ్చ రించాడు. వారంతా కర్ణుని రథాన్ని అతిక్రమించి ము న్ముందుకు ఉరికారు. అర్జునుని వారే ముందు ఎదుర్కొ న్నారు. ఎదుర్కొన్న పాపానికి వారి ధనుస్సులు విరిగిపో యాయి. రథాశ్వాలు కూలిపోయాయి. సారథుల తలలు తెగిపడ్డాయి. దాంతో విజయోల్లాసం తో దేవద త్తాన్ని పూరించాడు అర్జునుడు.

సుందరమైన చంద్రన్న నగర్‌గా ఎన్టీఆర్ లేఅవుట్: ఎమ్మెల్యే

అనకాపల్లి రూరల్, న్యూస్‌లీడర్:
మహా సుందరమైన చంద్రన్న నగర్‌గా ఈ ప్రాంతం అవతరిస్తుందని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ ప్రత్యేక గృహాలు రెండవ విడత శంకరం గ్రామంలో లబ్ధిదారులకు డ్రా తీసే కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీలా మాట్లాడుతూ 4.5ఎకరాలలో ప్రకృతి సిద్ధమైన పార్కును ఏర్పాటు చేయడం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీలా

జరుగుతుందని, పట్టణానికి చెందిన మరో రెండువేల కుటుంబాలకు గృహ నిర్మాణాలు చేపడతామని, ప్రతి ఒక్కరికి ఇక్కడ గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌గా కనిపించే విధంగా స్కూలు, కళ్యాణమండపం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 9వ తేదీన 740 కుటుంబీకులకు గృహ ప్రవేశాలు నిర్వహిస్తామన్నారు. కరెంట్, త్రాగునీరు ఇవ్వడం జరుగుతుందని, సంపతిపురం మినరల్ వాటర్‌ప్లాంట్ నుంచి త్రాగునీరు తీసుకొచ్చామన్నారు. ఆర్ఈసీఎస్ నుంచి 740మందికి కరెంట్ మీటర్లను ఏర్పాటుచేశామన్నారు. మౌలిక వసతులు పూర్తయ్యాయని అన్నారు. 244 మందికి ఈ రోజు లక్కీ డ్రా తీయడం జరుగుతుందన్నారు. ప్రతి పేదవాడి ఇంటి కల నెరవేర్చేందుకు చంద్రబా బునాయుడు కృషి చేస్తున్నారని అన్నారు. ఒక్క అనకాపల్లి పట్టణంలోనే 36వేల మందికి పింఛన్లను అందిస్తు న్నామన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుద్ద నాగజ గదీశ్వరరావు, మళ్ల సురేంద్ర, కొణతాల వెంకటరావు, కొణతాల నూకు నాయుడు, బొలిశెట్టి శ్రీను, బోడి వెంకటరావు, బొడ్డేడ మురళీ తదితర నాయకులు పాల్గొన్నారు.


అధికారులతో కలిసి మెగా లేఅవుట్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పీలా

సత్యనారాయణపురం మెగా లేఅవుట్‌లో మౌలిక వసతులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. బుధవారం టిట్కో అధికారులతో కలిసి మెగా లేఅవుట్‌లో నిర్మాణం జరుగుతున్న గృహాలను పరిశీలించారు. వీటిని కూడా త్వరలో లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని అన్నారు. నియోజకవర్గంలో ఇళ్లులేని ప్రతి ఒక్కరికి ఇళ్లను అందించడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులలో ఉన్నప్పటికీ అనకాపల్లి నియోజకవర్గానికి పెద్ద మొత్తంలో ఇళ్లను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేటాయించారని అన్నారు. కోట్లాది రూపాయల నిధులతో అనకాపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం జరిగిందని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు



అన్ని వర్గాల ప్రజలకు యనమల బడ్జెట్ ఊరట

పేద, మధ్యతరగతి ప్రజలతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులలో ఉన్నప్పటికీ వ్యవసాయానికి 12వేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించడం అభినందించదగ్గ విషయం. చంద్రబాబు హయాంలో ఏర్పాటు చేసిన అన్ని కులాలకు చెందిన కార్పొరేషన్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వాలు ప్రవేశపెట్టని విధంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలకు ఊరటను కలిగించారు.

డాక్టర్ కేకేవీవీ నారాయణరావు,
పట్టణ టీడీపీ అధ్యక్షులు.

లోటు బడ్జెట్‌ను ఎలా పూడుస్తారు



రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మంగళవారం శాసన సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఈ రాష్ట్ర ప్రజలను మసిపూసి మారేడుకాయ చేసే విధంగా ఉంది. లోటు బడ్జెట్‌ను ఏవిధంగా భర్తీ చేస్తారు. అన్ని కులాలకు చెందిన కార్పొరేషన్లకు అరకొర నిధులను కేటాయించారు. ఈ పూర్తిగా ఎన్నికల బడ్జెట్ తప్ప ప్రజలకు ఉపయోగపడేదికాదు.

మందపాటి జానకీరామరాజు,
పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు.

ఇది ఎన్నికల బడ్జెట్



రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మంగళవారం శాసన సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల అవసరాల కోసం ప్రవేశపెట్టిందే. గత నాలుగున్నరేళ్లలో లేని సంక్షేమం, అభివృద్ధి ఇప్పుడు గుర్తుకు వచ్చిందా. ఈ ప్రభుత్వానికి అధికారం నాలుగు నెలలే ఉండగా ఈ ఏడాది బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అధికారంలేదు. ఈ నాలుగున్నరేళ్లలో అప్పులు ఊబిలో కూరుకుపోయిన కౌలు రైతులను ఆదుకోవడంలో విఫలమయ్యారు.

ఎ.బాలకృష్ణ,
సీపీఎంపార్టీ పట్టణ కార్యదర్శి.

అంకెల గారడీ



రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మంగళవారం శాసన సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిధులు లేకుండా ఏవిధంగా అమలు చేస్తారు. ఇది పూర్తిగా అంకెల గారడీ బడ్జెట్. గత బడ్జెట్ చూపించిన వాటినే సక్రమంగా అమలు చేయలేకపోయారు. నిరుద్యోగభృతిని రెట్టింపు చేసి అందుకు తగినట్లు బడ్జెట్‌లో కేటాయింపులు రెట్టింపు చేయకుండా నామమాత్రంగా పెంచడమే దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికే అంకెల గారడీకి పాల్పడినట్లు తేటతెల్లమవుతుంది.

వై.ఎన్.భద్రం,
సీపీఐ పార్టీ పట్టణ కార్యదర్శి.

విభజన హామీల సాధనకు బైకు ర్యాలీ



అనకాపల్లి, న్యూస్‌లీడర్: ప్రత్యేక హోదా – విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ పిలుపుమేరకు బుధవారం సమితి సహాయ కార్యదర్శి కనిశెట్టి సురేష్‌బాబు ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి ఆర్డీవో కార్యాలయం వరకు కొనసాగింది. ప్రత్యేక హోదా బ్యానర్‌తో ఎన్‌డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విద్యార్థులు విభజన హామీల సాధన సమితి నాయకులు, అభిమానులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మళ్ల చక్రవర్తి, కొవ్వాడ వాసు, శరగడం భాస్కర్‌లతో సురేష్‌బాబు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మంత్రి అయ్యన్న దంపతులు

నర్సీపట్నం, న్యూస్‌లీడర్:
నర్సీపట్నంలో బుధవారం శ్రీనూకాలమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి రోడ్లు భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు, పద్మావతి దంపతులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లా డుతూ రూ.50 లక్షలతో పున్ణ నిర్మించనున్నామన్నారు. ఆలయానికి ప్రజా భాగస్వామ్యంగా రూ.10 లక్షలు మంత్రి కుటుంబ సభ్యులు సమకూర్చగా రాష్ట్ర ప్రభుత్వం రూ.40 లక్షలు విడుదల చేసిందన్నారు. దీంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న యువసేన అధ్యక్షులు విజయ్, సువర్ణ దంపతులు పాల్గొన్నారు.


మోదీకి వ్యతిరేకంగా సముద్రంలో మోకాళ్లపై కూర్చుని నిరసనలు



అచ్యుతాపురం, న్యూస్‌లీడర్:
పూడిమడక గ్రామంలో తాజా మాజీ సర్పంచ్ మేరుగు కొండమ్మ బాపునాయుడు ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ వైఖరికి నిరసనగా ఆంధ్ర ప్రదేశ్ కు ప్రత్యేక హోదా విశాఖపట్నం రైల్వే జోన్ పోలవరం ప్రాజెక్టుకు నిధులు కడప స్టీల్ ప్లాంట్ దుగ్గరాజుపట్నం పోర్ట్ రాజధాని అమరావతికి నిధులు విభజన చట్టంలోని 18 అంశాలను పరిష్కరించాలని కోరుతూ పూడిమడక మత్స్యకారులంతా సముద్ర తీరాన మోకాళ్లు లోతులో నించొని నరేంద్ర మోడీకి కళ్ళు కనిపించడం లేదని దానికి బదులుగా గ్రామస్తులంతా కళ్ళకి గంతలు కట్టుకొని ప్లకార్డులు పట్టుకొని శాంతి యుతంగా నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ డౌన్ డౌన్ కేంద్ర మొండి వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై సీఎం నారా చంద్రబాబునాయుడు చేస్తున్న ధర్మ పోరాటానికి మద్దతుగా ప్రజానీకం అండగా ఉండాలని ఈ పోరాటం తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు. ఎంపీటీసీ సభ్యులు సభ్యులు తెడ్డు సూర్యారావు గ్రామ పార్టీ అధ్యక్షులు మేరుగు వెంకట్రావు ఉమ్మడి అప్పారావు వాసుపల్లి అప్పారావు ధోని కాసుబాబు మేరుగు మహేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

అచ్యుతాపురం, న్యూస్‌లీడర్:
అచ్యుతాపురం ఆటోడ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్సై తారకేశ్వరరావు పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కంటి చూపు సమస్యలను డ్రైవర్లు నిర్లక్ష్యం చేయవద్దని ఎస్సై తారకేశ్వర రావు డ్రైవర్లను కోరారు జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆటోడ్రైవర్లకు 200 మందికి ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా పరీక్ష చేయించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రైవింగ్‌ను వృత్తిగా తీసుకునే వారు నిత్యము అప్రమ త్తంగా ఉండాలిన్నారు



కంటి చూపు సమస్యలు ఉంటే రాత్రి సమయంలో వాహనాలు నడపవద్దని కంటికి సంబంధించిన పరీక్షలు చేయించుకుని ఇటువంటి సమస్యలు ఉన్న డ్రైవర్లు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

మహిళా బాక్సింగ్ పోటీల్లో నర్సీపట్నంకు పేరు తేవడం అభినందనీయం


నర్సీపట్నం రూరల్, న్యూస్‌లీడర్
నర్సీపట్నం నింజాస్ అకాడమీకి చెందిన మహిళా బాక్సర్లు జాతీయ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్, సిల్వర్ పతకాలు సాధించడం అభినందనీయమని అయ్యన్న యువసేన అధ్యక్షులు చింతకాయల విజయ్ అన్నారు. ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు తమిళనాడులోని కాంచీపురంలో జరిగిన గ్రామీణ జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో నింజాస్ అకాడమీ మహిళా బాక్సర్లను విజయ్ స్వయంగా ప్రోత్సహించి పంపించారు. కె.కృష్ణవేణి 60 కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ బాలిక జూనియర్స్ విభాగంలో ఈ బంగారు పతకాన్ని సాధించారు. నర్సీపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఈ బాలిక ఈ టోర్నమెంట్‌కు హాజరయ్యారు. అదే విధంగా 50 కేజీల విభాగంలో నర్సీపట్నం మండలం వేములపూడి మోడల్ స్కూల్‌కు చెందిన పిఎస్.వినీలా, నర్సీపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన జూనియర్స్ విభాగంలోని 54 కేజీల విభాగంలో బిఎంఎన్ఎస్.గంగోత్రి, 57 కేజీల విభాగంలో జిల్లా


బాక్సర్లను అభినందించిన విజయ్

పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన వై.తేజస్విని, అదే పాఠశాలకు చెందిన జూనియర్ విభాగంలో వి.సుబ్రమణేశ్వరి సిల్వర్‌మెడల్‌ను సాధించారు. ఈ సందర్భంగా విజయ్ వీరిని అభినందించారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ నర్సీపట్నం నుండి గెలవడం గర్వంగా ఉందన్నారు. నర్సీపట్నం క్రీడా కళాకారులతో ఒక వేదికగా తయారవుతుందని చెప్పారు. క్రీడలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నింజాస్ అకాడమీ వ్యవస్థాపకులు మాస్టర్ కె.అబ్బు తదితరులు ఉన్నారు.

డైట్‌లో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు

అనకాపల్లి, న్యూస్‌లీడర్: పట్టణంలోని డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్.యస్.యస్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా అవగాహనా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆర్.టి.ఓ ఇన్‌ఛార్జ్ ఆర్.సి.హెచ్ శ్రీనివాసరావు గారు విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ వాహనం నడిపేవారు తప్పనిసరిగా లైసెన్సు, సిగ్నల్స్ గురించి తెలుసుకోవాలని, మద్యం సేవించి వాహనాన్ని నడుపరాదని , ప్రతియేటా 8,000 మంది రోడ్డు ప్రమాదాల వలన చనిపోతున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అలాగే యాక్సిడెంట్లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు విధిగా సీట్‌బెల్ట్ ధరించాలని


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులకు తెలియజేశారు. ఈ నెల 4 నుండి 10 వ తేదీ వరకు ఈ భద్రతా వారోత్సవాలు జరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.యస్.యస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎ. కిరణ్‌కుమార్, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ యన్. రామ్‌కుమార్ గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కశాశాల ఎ.ఓ శ్రీ పి. శ్రీనివాస్, 70 మంది ఎన్.యస్.యస్. వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమానికే పెద్దకొడుకు చంద్రబాబు

అన్నివర్గాల వారిని ఆకట్టుకున్న బడ్జెట్ -విశాఖ జిల్లా రూరల్ టీడీపీ ప్రధానకార్యదర్శి బుద్ధ నాగ జగదీష్

అనకాపల్లి, న్యూస్‌లీడర్:
కుటుంబ సంక్షేమం కోసం పెద్దకొడుకు ఎలాగైతే ఆర్థిక కష్టాలు ఉన్నా సర్దుబాటు చేస్తాడో అలాగే మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్ని ఆర్థిక సమస్యలున్న పేదవారితో పాటు అన్ని వర్గాల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని 2019 ఓట్‌ఆన్‌ఓకౌంట్ బడ్జెట్ రూపొందించారని విశాఖ జిల్లా రూరల్ టీడీపీ ప్రధానకార్యదర్శి బుద్ధ నాగ జగదీష్ అన్నారు. బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల బతుకుల్లో వెలుగులు నింపే బడ్జెట్ అని శాసనసభలో ప్రభుత్వ ఆయన కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రూ.2,26,177 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారని, ఇది ఒక చరిత్ర అని నాగ జగదీష్ ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక కష్టాలతో కొట్టుమిట్టాడుతున్నా పథకాలను మాత్రం అమలు చేస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరేలా బడ్జెట్ ఉందని చెప్పారు. సమాజంలో ఎవరినీ నిరాదరణకు గురి కానివ్వబోమని ఆయన చెప్పారు. గతేడాది బడ్జెట్ కంటే 18 శాతం అధికంగా కేటాయింపులు చేశారన్నారు. అన్ని వర్గాలు, మతాలు, కులాల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ, అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లగా భావించి బడ్జెట్ రూపకల్పన చేశారన్నారు. మొత్తం బడ్జెట్‌లో ఒక్క సంక్షేమానికే రూ.65,486 కోట్లు కేటాయించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ బడ్జెట్‌లో మెచ్చుకోదగిన మరో ముఖ్యాంశం అన్నదాత సుఖీభవ పేరుతో రూ.5 వేలు కోట్లు రైతుల అభివృద్ధికి కేటాయించామని తెలిపారు. రైతుల పట్ల తమ ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని అన్నదాత సుఖీభవ పథకం తెలియజేస్తోందన్నారు. రైతు రుణమాఫీ కోసం ఇప్పటికే తమ ప్రభుత్వం రూ.24 వేల కోట్లకు పైగా వెచ్చించిందన్నారు. ఎన్టీఆర్ భరోసా



పేరుతో ఇస్తున్న పెన్షన్లను రూ.2 వేల వరకూ పెంచుతూ నిర్ణయం తీసుకోవడం తమది పేదల ప్రభుత్వం మరోసారి రుజువైందని నాగ జగదీష్ అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పింఛన్ కేవలం రూ.200లు ఇస్తే, తాము రూ.2 వేలకు పెంచామన్నారు. నాలుగున్నరేళ్లలో పెన్షన్ల కోసం టీడీపీ ప్రభుత్వం 24,618 కోట్లు ఖర్చు చేస్తే, దాంట్లో కేంద్ర ప్రభుత్వ వాటా కేవలం రూ.1,100 కోట్లేనని తెలిపారు. ఇది కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. పసుపు-కుంకుమ కింద 94 లక్షల డ్వాక్రా మహిళలకు రూ.10 వేల చొప్పున ఉచితంగా అందజేస్తున్నా మన్నారు. వైఎస్ హయాంలో రూ.200 కోట్లు, కిరణ్‌కుమార్ రెడ్డి పాలనలో రూ.2 వేలు కోట్లన డ్వాక్రా మహిళలకిస్తే, తమ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో రూ.22 వేల కోట్లను అందజేసిందన్ని నాగ జగదీష్ వెల్లడించారు. బీసీలకు ఫెడరేషన్ల ఏర్పాటు కావడంతో బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో కొత్త శకం మొదలైందన్నారు. 11 ఫెడరేషన్లకు రూ.3 వేల కోట్లను బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఎం.ఎస్.ఎం.ఇ, విద్యాశాఖ, 24 గంటలూ విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం వేలాది కోట్లు వెచ్చిస్తోందన్నారు. గత నాలుగున్నరేళ్లలో ఒక్క వ్యవసాయానికే రూ.81,554 కోట్లు ఖర్చు చేశామన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రభుత్వ పథకాల అమల్లో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపే బడ్జెట్ ప్రవేశపెట్టిన సీఎం చంద్రబాబు నాయుడుకు, ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడుకు నాగ జగదీష్ కృతజ్ఞతలు తెలిపారు.
కొత్తగా ఏర్పాటైన బీసీ కార్పొరేషన్ల పరిధిలోకి రాని, కార్పొరేషన్లు లేని బీసీలకు ప్రభుత్వ ఆర్థిక పథకాల అమలులో అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయంతీసుకున్నారని, పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం చేస్తున్న బీసీ కార్పొరేషన్ ద్వారా అమలు జరుగుతున్న ఆర్థిక చేయూత కార్యక్రమాలలో బీసీ కార్పొరేషన్ల పరిధిలోకి ఇంకా తీసుకురాని బీసీ సామాజిక వర్గాలయిన సూర్యబలిజ, కూరాకుల, అచ్చుకట్లవాండ్ల, జక్కల సామాజిక వర్గాలకు ఎక్కువ ప్రాముఖ్యతనివ్వాలని సీఎం చంద్రబాబు కోరారని ఆయా సామాజిక వర్గాల నుంచి వచ్చిన అభ్యర్థనలు, ప్రతిపాదనల మేరకు ముఖ్యమంత్రి తక్షణం స్పందించాఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని నాగజగదీష్ భరోసా ఇచ్చారు.

గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ



అనకాపల్లి, న్యూస్‌లీడర్: అనకాపల్లి టౌన్ 23వార్డు అంగన్‌వాడి సెంటర్‌లో బాల సంజీవిని కార్యక్రమం ద్వారా రక్తహీనత తక్కువగా వున్న గర్భిణిలకు, బాలింతలకు వార్డు అధ్యక్షులు బొడ్డేడ మురళీ చేతుల మీదుగా ఖర్జూరం, రాగిపిండి, బెల్లం, వేరుశెనగ చెక్కిలు ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ పద్మ, ఆయా అప్పలమణీ, గర్భిణీలు పాల్గొన్నారు.

8న ఎల్‌ఎల్‌ఆర్ డ్రైవింగ్ మేళా

మాడుగుల, న్యూస్‌లీడర్: మాడుగులలో ఈ నెల 8వ తేదీ శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు ఎల్ఎల్ఆర్ డ్రైవింగ్ టెస్టు మేళా ఆర్‌సీఎం పాఠశాల ఎదురుగా గల శ్రీబాలాజీ ఇంటర్నెట్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని కొప్పాక రామ్‌కీ తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో తీసుకొని రావాలని నిర్వాహకులు కోరారు.

ఘనంగా శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



మాడుగుల, న్యూస్‌లీడర్: మాడుగులలో బుధవారం ఆర్యవైశ్యుల శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా తెల్లవారు జాము నుంచి వాసవీ క్లబ్ జోన్ ఛైర్మన్ శ్రీనాధు శ్రీనివాసరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు జాగాని చంద్రరావు, ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు, మాడుగుల పురవీధులలో నగర సంకీర్తన నిర్వహించి అనంతరం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ సెక్రటరీ పుట్టా మురళీకృష్ణ, కోశాధికారి జాగాని నానాజీ, వైస్ ప్రెసిడెంట్ శ్రీనాధు నారాయణరావు, జాయింట్ సెక్రటరీ మామిడి శ్రీనివాసరావుతో పాటు వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో.. పట్టణంలో శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 5గంటలకు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. 6గంటలకు అమ్మవారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు జరిపారు. ప్రార్థనగాన సంఘంవారి నిత్య ప్రార్థన, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నారాయణ సేవ, రాత్రికి 7.30గంటలకు 102 వెండి ప్రమిదలతో జ్యోతుల ఆరాధన, గవరపాలెం చినరామస్వామి కోవెల బృందంవారిచే తోడపెద్దు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు తాటికొండ వెంకటరమణమూర్తి (బాబ్జీ), కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి కుంచం నూకయ్యశెట్టి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ తమ్మన రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 9వ తేదీన శనివారం కశింకోట శ్రీగౌరీపరమేశ్వరుల ఉత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ పోస్టర్ విడుదల చేస్తున్న కమిటి సభ్యులు. ఈ కార్యక్రమంలో పెంటకోట రాము, వేగి దొరబాబు, వేగి వెంకటరావు, రామరాజు, దాడి నాగరాజు, ఆడారి నర్సింగరావు, దాడి కృష్ణ, తాకాశి కృష్ణ, కాండ్రేగుల నాగేశ్వరరావు, వేగి రామకోటి, వేగి రామరాజు, తాతీలు తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌లీడర్, కశింకోట

కళ్యాణపులోవను రక్షించుకోవాలి

రావికమతం, న్యూస్‌లీడర్
వివిధ శాఖల అధికారుల ప్రలోభాలకు లొంగి కళ్యాణపులోవ జలాశయ పరివాహక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం వల్లే రిజర్వేయర్‌లో చుక్కనీరు లేదని సిపిఐ ఎంఎల్ కన్వీనర్ పిఎస్.అజయ్‌కుమార్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కళ్యాణపులోవ రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో గ్రానైట్ తవ్వకాలు జరుపుతున్న కంపెనీల వ్యర్థాలను రిజర్వాయర్ ప్రవాహగెడ్డలో వేస్తుండటంతో మూసుకుపోతున్నాయని చెప్పారు. గెడ్డలన్నీ ఇంకిపోయి రిజర్వాయర్‌లో చుక్కనీరు చేరలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరిగేషన్, అటవీశాఖ, రెవెన్యూ అధికారులు తప్పుడు నివేదికలు ఇచ్చి గ్రానైట్ తవ్వకాలకు అవకాశం కల్పించారన్నారు. దీనిపై రైతులంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

సౌరవిద్యుత్ పంపు షెడ్లకు నిధులు

సీలేరు, న్యూస్‌లీడర్
వేసవిని దృష్టిలో ఉంచుకొని జికెవీధి మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ సహాయ కార్యనిర్వాహక ఇంజనీరు భగవంతరావు చెప్పారు. రూ.2.94కోట్ల వ్యయంతో 42 సౌర విద్యుత్ పంపు షెకడ్లను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో పనులను ప్రారంభిస్తామన్నారు. దారకొండ, దుప్పిలవాడ, గుమ్మిరేవుల, గాలికొండ, అమ్మవారి దారకొండ పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి అధికంగా ఉన్న గ్రామాల్లో ముందుగా ఏర్పాటు చేస్తామన్నారు. దారకొండ పంచాయతీలో డి.కొత్తూరు, గుమ్మిరేవుల పంచాయతీ మాదిమళ్లు, కణుసుమెట్ట, చెరుకుమళ్లు, దుప్పిలవాడ పంచాయతీ పరమసింగవరం, గాలికొండ పంచాయతీ ఆకులూరు, సువాపల్లి, బత్తునూరు, పాత్రునిగుంట గ్రామాల్లో వాటర్ గ్రిడ్‌కు ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు చెప్పారు.

ఆర్ఏఆర్ఎస్‌లో ఉత్తరాంధ్ర కిసాన్ మేళా

చింతపల్లి, న్యూస్‌లీడర్
ఈ నెల 7వ తేదీన చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉత్తరాంధ్ర గిరిజన మండల రైతుల కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్టు చింతపల్లి సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ డివి.రమణారెడ్డి తెలిపారు. ప్రతీ ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా పరిశోధన స్థానంలో కిసాన్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. పార్వతీపురం, సీతంపేట, పాడేరు ఐటిడిఏ గిరిజన రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, శాస్త్రవేత్తలను కిసాన్ మేళాను ఆహ్వానించారన్నారు. నూతన వ్యవసాయ పద్ధతులు రైతులకు పరిచయం చేయడం, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీ యంత్రాలపై అవగాహన కల్పిస్తారని ఆయన తెలిపారు. పంటల సాగులో ఎదురయ్యే తెగుళ్లు, ఇతర సమస్యలపై రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. ఈ కిసాన్ మేళాను రైతులు, వ్యవసాయ అనుబంధ రంగ సంస్థల అధికారులు, శాస్త్రవేత్తలు, ఎన్జీవోలు విజయవంతం చేయాలని కోరారు.

7, 8 తేదీల్లో అడవిరాజులబాబు పండుగ

గొలుగొండ, న్యూస్‌లీడర్
ఆరిలోవ అటవీ ప్రాంతంలో ఎర్రవరం వద్ద గల రాజులబాబు ఆలయంలో ఈ నెల 7, 8 తేదీల్లో పండుగ జరగనుంది. ఇందుకు సంబంధించి చీడిగుమ్మల, ఎర్రవరం గ్రామాల్లో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. చుట్టుపక్కల మండలాల్లో కూడా ఎంతో పేరు ఉన్న ఈ పండుగకు వేల సంఖ్యలో భక్తులు హాజరవుతుంటారు. వచ్చే గురువారం ఎర్రవరం గ్రామంలో భారీ ఎత్తున తీర్థం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే శుక్రవారం ఉదయం చీడిగుమ్మల గ్రామం నుండి భక్తులు భారీ ఊరేగింపుతో ఎర్రవరం వద్ద గల రాజులబాబు గుడికి చేరుకొని మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం అదే రోజు రాత్రి చీడిగుమ్మల గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు ఉత్సవ కమిటీ సభ్యులు చేపడుతున్నారు.

గ్రామకంఠం ఆక్రమణపై ఫిర్యాదు

కోటవురట్ల, న్యూస్‌లీడర్
గ్రామకంఠం స్థలాన్ని కొంత మంది ఆక్రమించారని జల్లూరు ఎస్సీ కాలనీ వాసులు ఎంపిడిఒ కళ్యాణికి ఫిర్యాదు చేశారు. ఎస్సీ కాలనీలో గ్రామకంఠం స్థలంలో బావి ఉందని, ఈ బావిని పూడ్చివేసి స్థలాన్ని ఆక్రమించి కట్టడాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని, అడ్డుకుంటే కేసులు పెడతామని భయపెడుతున్నారని ఆరోపించారు. ఆ స్థలాన్నే శ్మశాన వాటిక కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నామని పేర్కొన్నారు.

సంచలన వార్తాపత్రిక
లీడర్
ఉత్తరాంధ్ర జోన్
6
విశాఖపట్నం
గురువారం 7-2-2019

నూతన ఎస్పీగా దామోదర్

విజయనగరం, న్యూస్‌లీడర్: విజయనగరం ఎస్పీగా ఏఆర్ దామోదర్‌ను నియమిస్తూ రాష్ట్ర శాఖ మంగళవారం రాత్రి ఉత్తర్వులను విడుదల చేసింది. నాన్ క్యాడర్‌కు చెందిన ఈయన విశాఖపట్నం నేర విభాగం ఉప కమిషనర్‌గా పనిచేస్తున్నారు. బదిలీల్లో భాగంగా విజయనగరం రానున్నారు. ఇక్కడ ఎస్పీగా పనిచేసిన జి.పాలరాజు విశాఖ రేంజ్ డీఐజీగా పదోన్నతిపై వెళ్లగా, ఆయన స్థానంలో దామోదర్ వస్తున్నారు.

అంకెల గారడీ.. ఎన్నికల బడ్జెట్

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ నరసింగరావు- జిల్లా కార్యదర్శి కె లోకనాధం


సిహెచ్ నరసింగరావు


కె లోకనాధం

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: శాసనసభలో 2019-20 సంత్సరానికి రూ.2, 26,177 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థికశాఖా మంత్రి యనమల రామకృష్ణుడు అసెంబ్లీలో ప్రవేశపె ట్టారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ నరసింగరావు అన్నారు. ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రచార ఆర్భాటాలు తప్ప అభివృద్ధిపట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని మరోసారి రుజువైందన్నారు. ఈ బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీగాను, ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అనేక తాయిలాలు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఓట్ల కోసం అంకెల గారడీలకే పరిమితమైందన్నారు. వాస్తవ విరుద్ధంగా కేటాయింపు చేసి ప్రజలను మోసగించే విధంగా ఈ బడ్జెట్‌ను రూపొందించారన్నారు. ఈ బడ్జెట్‌లో అన్నదాత సుఖీభవతో సహా 6 కొత్త సంక్షేమ పథకాలు ప్రకటించారన్నారు. పాత సంక్షేమ పథకాలకు నిధులు పెంచుతున్నట్లు చూపించారన్నారు. కానీ ప్రభుత్వం గతేడాది బడ్జెట్‌లో సంక్షేమ కార్యక్రమాలకు చూపించిన నిధులను ఖర్చు చేయకుండా కోత విధంచడం చూస్తే ఇది ప్రజలను మోసగించే బడ్జెట్ అని తేలుతుందన్నారు. 2018-19 బడ్జెట్‌లో బిసి వెల్ఫేర్ కోసం రూ.6,213.17 కోట్లు కేటాయించగా సవరించిన బడ్జెట్‌లో రూ.5,356.70 కోట్లకు కుదించారన్నారు. నిరుద్యో గభృతిని నెలకు రూ. 1000 నుండి రూ.2000లకు పెంచినా బడ్జెట్‌లో మాత్రం గతేడాది రూ.1000కోట్లు కేటాయిస్తే దాన్ని ఈ ఏడాది రూ.1200 కోట్లు మాత్రమే పెంచారు. పెంచిన 20శాతం కేటాయింపులతో 100% భృతి ఎలా పెంచుతారో వారికే అర్ధంకా వాలన్నారు. పసుపు - కుంకమ క్రింద 93లక్షల మంది మహిళలకు రూ.10వేలు చొప్పున ఇవ్వడానికి సుమారు రూ.9,300 కోట్లు అవసరం కాగా కేవలం రూ.4,000 కోట్లు మాత్రమే కేటాయించడమంటే మహిళలకిచ్చిన చెక్కులు సగం చెల్లవని అర్ధమౌతుందన్నారు.

ప్రజలను మభ్యపెట్టే బడ్జెట్.. రాష్ట్రంలో సగానికి పైగా జిల్లాలు తీవ్రమైన కరువును ఎదుర్కొం టుంటే ఆ సమస్యను పరిష్కరించడానికి ఈ బడ్జెట్‌లో ఎటువంటి పరిష్కారం చూపించలేదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కె లోకనాధం అన్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతాంగాన్ని ఆదుకోవాలంటే వారి పంటలకు గిట్టుబాటు ధరలు, రుణభారం నుండి విముక్తికి బడ్జెట్‌లో ప్రతిపాదనలు లేవని ఆయన తెలిపారు. అలాగే చాలీచాలని వేతనాలతో కూనరిల్లిపోతున్న అసంఘటితరంగ కార్మికుల కోసం బడ్జెట్ ఎటువంటి కేటాయింపులు లేవన్నారు.. మొత్తం ప్రభుత్వ బడ్జెట్ లోతుగా పరిశీలించినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసగించి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తోందన్నారు. ఎన్నికల కోసం రూపొందించి ఈ అంకెల గారడీ బడ్జెట్‌ను ప్రజలు విశ్వసించారని ఆయన తెలిపారు.

చెరకు, ధాన్యం బిల్లులు వెంటనే చెల్లించండి

రెవిన్యూ సిబ్బందికి వినతిపత్రాలు అందజేత



పార్వతీపురం, న్యూస్‌లీడర్: పార్వతీపురం నియోజకవర్గంలో ఉన్న సీతానగరం, బలిజిపేట, పార్వతీపురంనకు చెరుకు, ధాన్యం రైతులకు నెలలు గడుస్తున్నా నేటి వరకు బిల్లులు అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని, డబ్బులు లేక సంక్రాతి పండగ కూడా జరుపుకోలేదని, అలాగే లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీకి సరఫరా చేసిన చేరుకకు ఇంతవరకు కూడా బకాయిలు చెల్లించలేదని, నేటికీ సుమారు రూ.12కోట్ల రూపాయలు రైతులకు బకాయిలు ఉన్నప్పటికీ చెల్లింపులు జరగలేదని, కావున పై రెండు విషయాలు పరిశీలించి చెల్లింపులను వేగవంతం చేయాలని కోరుతూ పార్వతీపురం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అజు రఫీజాన్‌కు, సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారి అప్పలరాజుకు వినతిపత్రాలును పార్వతీపురం వైకాపా పార్టీ సీనియర్ నాయకులు జమ్మాన ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో రైతులు అందజేశారు. ఈ లేఖపై తహసీల్దార్, సబ్ కలెక్టర్ పరిపాలన అధికారి అప్పలరాజు స్పందిస్తూ మూడునాలుగు రోజులలో రైతులందరికీ చెల్లింపులు జరుపుతామని తెలియజేసారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో ఏంపిటిసీలు గండి శంకరావు, చింతల జగన్నాధం, సర్పంచ్‌లు తీళ్ల శివున్నాయుడు, రొంపిల్లి తిరుపతి రావు, బంకపల్లి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చౌడువాడలో 'జయహో మహిళ'




కె.కోటపాడు, న్యూస్‌లీడర్: మన రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలబడి ఆదుకుంటూ అండగా నిలుస్తున్న మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదికాలాలపాటు పచ్చగా ఉండాలని మీరంతా దీవించాలని మాడు గులమాజీ ఎమ్మెల్యే, టీడీపిఇన్‌చార్జ్ గవిరెడ్డి రామానాయుడు అన్నారు. మండలంలో మేజరు పంచాయితీ చౌడువాడ గ్రామంలో టీడీపినాయకుడు, మాజీ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు ఆధ్వర్యంలో 'జయహొ మహిళ' కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వేలాదిగా హాజరైన మహిళలనుద్దేశించి ముఖ్య అతిధిగా పాల్గొన్న రామానాయుడు మాట్లాడుతూ తెలుగింట ఆడపడుచులు ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలన్నదే చంద్రబాబు ధ్యేయమన్నారు. మహిళలందరూ ఆర్థికంగా ఎదిగి కుటుంబానికి అండగా నిలవాలనే పసుపు కుంకుమ పేరిట చంద్రబాబు పదివేల రూపాయలను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపి సబ్బవరపు పుష్పావతి, వైస్ ఎంపీపి బండారు మంగపతి, మండల టీడీపి కార్యదర్శి బండారు దేముడుబాబు, గ్రామటీడీపి అధ్యక్షుడు చల్లపల్లి శ్రీను, విశాఖడెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, ఎంపీటీసి సభ్యుడు ఏటుకూరి రాజేష్, రాజీ అప్పారావు, శ్రీను, బండారు రామస్వామి పాత్రుడు పాల్గొన్నారు.

న్యూ టారిఫ్ రద్దుచేయాలి

ఏపీ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : న్యూటారిఫ్ ఆర్డర్ పేరుతో కేబుల్ వినియోగపు ఛార్జీలను భారీగా పెంచడానికి రంగంసిద్ధమయ్యిందని ఏపీ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎవి రమణరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూటారిఫ్ విధానం ట్రాయ్ పేర్కొన్నా ఇప్పటికే కేబుల్ టీవీ ఛార్జీలు భరించడం కష్టసాధ్యమన్నారు. ప్రతిఒక్కరికి కేబుల్‌ప్రసారాల ద్వారా సమాచారం విజ్ఞానం, వినోదం అందుతోందన్నారు. నెలకు 150 నుంచి 250 వరకు ఛార్జీలు వసూలుచేసి వందలాది ఛానళ్లను కేబుల్ ఆపరేటర్లు అందిస్తున్నారన్నారు. రానున్న మార్పులవలన ఫ్రీ-టు-ఎయిర్ ఛానళ్లు, పే ఛానళ్లు అన్న పేరుతో వందలాది రూపాయలు వడ్డించబోతున్నారన్నారు. ఫ్రీ-టు-ఎయిర్ ఛానళ్లు 250 నుంచి 300 వరకు ఉండగా వాటిని 100కు కుదించారన్నారు. పే ఛానళ్లకు 50పైసలు, గరిష్టంగా 19 రూపాయలు వసూలుచేయాలని సుప్రీం తీర్పు ఇచ్చినప్పటికీ గరిష్టంగా 19రూపాయలను వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై 18% జీఎస్టీ కలుపుతున్నారని చెప్పారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని కేబుల్ వినియోగ ఛార్జీలపెంపుదలను నిలుపుచేయాలని విజ్ఞప్తి చేసారు. ఈ నేపధ్యంలో కేబుల్ ఆపరేటర్స్ చేస్తున్నన్న ఆందోళనకు మద్దతు ప్రకటిస్తున్నామన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఎన్ఏడి, న్యూస్‌లీడర్: దివంగత నేత స్వర్గీయ ఎంవీవీఎస్ మూర్తి స్ఫూర్తితో ఆయన మనమడు భరత్ అధ్యక్షతన నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం స్పందన లభించింది. స్థానిక జీవీఎంసీ 36 వార్డ్ దుర్గానగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వచ్చిన రోగులకు, క్షతగాత్రులకు ఆరోగ్య వంతమైన సమాజమే లక్ష్యంగా, గీతం హాస్పిటల్ వారి సహకారంతో అన్ని రకాల ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. ముఖ్యంగా దంత పరీక్షలు,సాధారణ వైద్య పరీక్షలు, రక్త పోటు, మధుమేహ వ్యాధి పరీక్షలు, గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరీక్షలు, మహిళా శిశు ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు ఇతర ఆరోగ్య సేవలు ఉచితంగా అందించి మందులు పంపిణి చేసారు. ఈ కార్యక్రములో నగర ఆర్గ నైజింగ్ కార్యదర్శి పివి రామ రెడ్డి వార్డ్ టీడీపీ అధ్యక్షుడు సర్వసిద్ది ఉమా మహేశ్వరావు మరియు స్థానికులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై లక్ష్మణ్

కోటబొమ్మాళి, న్యూస్‌లీడర్: విద్యార్థులు వచ్చి రాని డ్రైవింగ్ చేసి మీ ప్రాణాలు తీసుకోవద్దు, అవతలవారివి ప్రాణాలు పోయేలా చేయవద్దని స్థానిక ఎస్సై ఎన్. లక్ష్మణ్ అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల భాగంగా స్థానిక విక్టరీ జూనియర్ కళాశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వచ్చి రాని డ్రైవింగ్ చేసి ప్రమాదానికి గురై కాళ్ళు, చేతులు విరిగి జీవతాన్ని నాశనం చేసుకోవద్దుని, 18 సంవత్సరాలు నిండని, డ్రైవింగ్ లైసెన్సు లేని మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని, రోడ్డుపై వాహనం నడిపై ప్రతి వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్సుతో పాటు హెల్మెట్, వాహనంకు సంబందించిన పేపర్లును తప్పని సరిగా ఉంచుకోవాలని, రహదారి భద్రత చర్యలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడుపరాదని, శిరస్త్రాణం ధరించాలని, రహదారి నిబంధనలు పాటించాలని, అతి వేగంగా ప్రయాణం చేయరాదని విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో విక్టరీ విద్యసంస్థల కరస్పాండెంట్ హనుమంత శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఇంటింటింటికీ జనసేన కరపత్రాల పంపిణీ



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: జనసేన జనబాటతో భాగంగా విశాఖ ఉత్తర నియోజకవర్గ నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్ అధ్వర్యంలో 11వ వార్డు గాంధీనగర్‌లో ఇంటింటింటికి ఎన్నికల గుర్తు గాజుగ్లాసుని పరిచయం చేస్తూ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణి చెసారు. ఉషాకిరణ్ మాట్లాడుతూ ప్రజలందరు స్వచ్ఛందంగా పవన్కల్యాణ్‌ని బలపరుస్తున్నారని తప్పకుండా ఈసారి జనసేనకే మా ఓటు వేస్తామని హామీ ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపికళ్యాణ్, కజా సత్యనారాయణ, భాస్కర్, వానపల్లి రంగారావు, మురళీకృష్ణ, మాణిక్యం, సంధ్య, ప్రమీల, వంశీ సుధ, కళ.పెద్ద సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.



పుస్తకాల పంపిణీ

శృంగవరపుకోట, న్యూస్‌లీడర్: తన తండ్రికొరాయి స్వామినాయుడు ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని ఆయన కుమారులు వంశీకృష్ణ, వితల్ కుమార్ లు సీతంపేట మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠశాల సంచులు, పెన్నులు, పెన్సిల్లు, నోట్ పుస్తకాలను పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు శివరామారావు, సహోపాధ్యాయులు ఉమా మహేశ్వరరావు తెలిపారు.

కుష్టుపై అవగాహనతో మెలగాలి

లక్కవరపుకోట, న్యూస్‌లీడర్: కుష్టు వ్యాధిపై ఆశా కార్యకర్తలు అవగాహనతో మెలగడం వల్ల వ్యాధి నిర్మూలనకు మెరుగైన ఫలితాలను సాధించవచ్చని ఉప పారామెడికల్ అధికారి మహబూబ్ ఆలీ పేర్కొన్నారు. లక్కవరపుకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో వైద్యాధికారిణి సామ్రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో కుష్టు పక్షోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. స్వర్శలేని మచ్చలు, రాగి మచ్చలు, శరీరంపై కణుపులు పై దృష్టి సారించాలని సూచించారు.

బీసీసెల్ ప్రధాన కార్యదర్శిగా వాసుపల్లి కుమార్



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: వైసీపీ విశాఖ పార్లమెంట్ జిల్లా కమిటీ బీసీసెల్ ప్రధాన కార్యదర్శిగా వాసుపల్లి కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె రాజు వాసుపల్లి కుమార్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. తనను బీసీసెల్ ప్రధాన కార్యదర్శి పదవికి ఎంపిక చేసినందుకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు, విశాఖ నగర అధ్యక్షుడు మల్ల విజయప్రసాద్ కు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె రాజుకు కుమార్ ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకుని పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని కుమార్ తెలిపారు. బీసీసెల్ ప్రధాన కార్యదర్శిగా కుమార్ నియమితులు అయినందుకు పలువురు నేతలు కలసి అభినందనలు తెలిపారు. కెపి రత్నాకర్, జీ గోవింద్, లావేటి శ్రీరామ్, ఆర్ దాసు, కె. రమణబాబు, కార్యకర్తలు కుమార్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

డ్వాక్రా మహిళలకు పసుపు కుంకుమ చెక్కుల పంపిణీ



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: 37 వార్డ్ పరిధిలో గల ఇందిరానగర్-3 తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 37 వార్డ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర గొర్రెల మేకల ఫెడరేషన్ డైరెక్టర్ గంకల అప్పారావు ఆధ్వర్యంలో మన రాష్ట్ర ముఖ్యమంత్రి పసుపుకుంకుమగా చెక్కులు డ్వాక్రామహిళలకు అందచేస్తునందుకు మహిళలు సంతోషంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేసారు. అలాగే వార్డ్‌లో తమకు అన్నివిధాలా ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియచేస్తునందుకు వార్డు అధ్యక్షులు, రాష్ట్ర గొర్రెల మేకల ఫెడరేషన్ డైరెక్టర్ గంకల అప్పారావుకి ధన్యవాదాలు తెలియజేసారు. ఇంకా రాబోయే ఎన్నికలలో ఆయనకి తోడుగా నిలుస్తామని ఎన్నికలలో ఘనవిజయం తమదేనని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అక్క చెల్లెలు సంతోషంగా ఉండాలన్నారు. వారు స్వయం సంపాదికులుగా ఉండాలనే ఉద్దేశంతో చిన్నతరహా వ్యాపారాలు చేసుకోవటానికి పెట్టుబడిగా ఉపయోగించా లని పదివేల రూపాయలు అందేజేస్తున్నారని తెలియ జేసారు. కాబట్టి ప్రతి ఒక్కరు స్వయం సంపాదికులుగా ఎదిగి తమ కుటుంబం ఆర్థిక ఇబ్బందులనుండి బయటపడతారని తెలియజేసారు. అక్క చెల్లెలు సంతోషంగా నిండుమనస్సుతో ఆయన్ని ఆశీర్వదించి రాబోయే ఎన్నికలలో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

శంబరకు పోటెత్తిన జనం

సాలూరు, న్యూస్‌లీడర్: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు శంబర పోలమాంబ మూడోవారం జాతర ఘనంగా సాగింది. మొదటివారం జాతరను తలపించేలా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దూరప్రాంతాల నుంచి ప్రత్యేకంగా వాహనాలలో వచ్చినవారి సంఖ్య అధికంగా కనిపించింది. దాదాపు లక్షన్నర మందికిపైగా తరలివచ్చారు. వనంగుడి, చదురుగుడి వద్ద క్యూలైన్లు తొలిజాతరకు ఏర్పాటుచేసిన వాటినే కొనసాగింది. ఉదయం 8 గంటల నుంచి రద్దీ విపరీతంగా పెరగింది. 9గంటలకు క్యూలైన్లన్నీ నిండిపోయాయి. 11గంటల తర్వాత భక్తుల సంఖ్య పెరగడంతో రహదారిపై ఎండలోసైతం బారులు తీరి నిలిచే పరిస్థితి కనిపించింది. మధ్యాహ్నం 3.30 గంటలవరకు రద్దీ కొనసాగింది. గోముఖీనది తీరంలోనే కాకుండా చదురుగుడి వెనుకభాగం, క్యూలైన్ల వద్ద, శంబర వీధిరహదారులపై వనంగుడి వద్ద పూజలుచేసి, మొక్కులు చెల్లించుకోవడం కనిపించింది. దర్శనానికి వచ్చే భక్తులకు నీటిపొట్లాలు, చిన్నపిల్లలకు పాలు, ఉచిత ప్రసాదాలను దేవాదాయశాఖ పంపిణి చేసింది. 70 మంది దేవాదాయశాఖ సిబ్బంది సేవల్లో పాల్గొన్నారు. ఆర్టీసీ 75 బస్సులను నడిపింది.

ఉచిత నేత్ర వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

కె.కోటపాడు, న్యూస్‌లీడర్: మండలంలో ఎ.భీమవరం గ్రామం మండల ప్రాథమిక పాఠశాలలో సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసు పత్రి వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆప్తాలమిస్ట్‌లు అప్పలరాజు, దేవిలు120 మంది నేత్ర రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశా రు. వీరిలో 20 మందికి కళ్ళ అపరేషన్ల అవసరాన్ని గుర్తించారు. మరో20మందికి ఉచితంగా కళ్ళద్దాలు పంపిణీ చేశారు. క్యాంప్ కోర్డినేటర్ రజిత ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు సూరెడ్డి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ తర్రా నారాయణరావు తదితర్లు సేవలందించారు.

బకాయిల చెల్లింపులో తాత్సారం

బొబ్బిలి, న్యూస్‌లీడర్: ధాన్యం రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసినా రైతులకు మాత్రం పైసా చెల్లించడం లేదని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ అన్నారు. స్థానిక ఏఐటియూసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులనుంచి ధాన్యాన్ని పెద్దఎత్తున కొనుగోలు చేసామని చెబుతున్నా చెల్లించాల్సిన బకాయిలపై తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు, ర్యాలీలు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. వీటిని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతలకు రూ.1900 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ కింద జమ చేయాల్సి ఉన్నప్పటికీ దీనిపై తాత్సారం జరుగుతుందని ఆరోపించారు.

జ్వర పీడిత గ్రామాలను పరామర్శించిన ఎమ్మెల్యే రాజన్నదొర

మెంటాడ, న్యూస్‌లీడర్: మండలంలో గడచిన రెండు,మూడు నెలల నుంచి జ్వరాలతో భాదపడుతున్న కైలాం గ్రామాన్ని సాలూరు శాసనసభ్యులు పీడిక రాజన్నదొర పరిశీలించారు. ప్రస్తుతం జ్వరంతో భాదపడుతున్న ఆ గ్రామ మాజీ సర్పంచి రాగూరునాయుడని, పలువురుజ్వరపీడితులను ఆయన పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్య లోపం కారణంగా జ్వరాలు వస్తున్నట్లు ఆరోగ్య సిబ్బంది అంటున్నారని పలువురు గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నెలల తరబడి గ్రామస్థులు జ్వరాలతో భాదపడుతుంటే పట్టించుకోవలసిన అధికారులు మొక్కుబడిగా వచ్చి వెళ్తున్నారే తప్ప జ్వరాలు తగ్గించేందుకు శాశ్వత చర్యలు చేపట్టడం లేదని ఎమ్మెల్యేకు తెలిపారు.

ఫెడరెల్ ఫ్రంట్ అన్న కేసీఆర్, జగన్ మమతకు ఎందుకు కనీస మద్దతు ఇవ్వలేదు

కలిశెట్టి అప్పలనాయుడు



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: బీజేపీ డైరెక్షన్‌లోనే అటు టీఆర్ఎస్ ఇటు వైకాపా నడుస్తున్నాయన్నది కోల్‌కతా ముఖ్యమంత్రి సీబీఐ వ్యవహారంతోనే స్పష్టమైందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి కమిటీ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు విశ్లేషించారు. వ్యక్తిగత కక్ష సాధింపు చర్యల్ని తలపించేలా కోల్‌కతాలో సీబీఐ హడావిడి దేశ వ్యాప్తంగా సంచలనమైన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ కు నిజంగా ఫెడరల్ ఫ్రంట్ పై చిత్తశద్ధి అనేది ఉంటే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతకు ఎందుకు కనీస మద్ధతు ప్రకటించలేదని ప్రశ్నించారు. కనీసం ఓ పత్రికా ప్రకటనలోనైనా ఖండన ఇవ్వకపోవడం బీజేపీతో లాలూచీ రాజకీయాలు బహిర్గతమయ్యాయని అన్నారు. ఇంతకుముందు కోల్ కోతా వెళ్లి చేసిందంతా ఉత్త హడావిడే అనే విషయం ప్రజలకు అర్థం అయ్యిందని అన్నారు. మరోవైపు ఏపీ ప్రతిపక్ష నేత జగన్ వ్యవహారం కూడా బీజేపీ అడుగులకు మడుగులు వత్తుతున్నట్లుగానే స్పష్టమైందని ఎద్దేవ చేశారు. మొన్నటి వరకూ మమతా బెనర్జీని కీర్తించిన జగన్ గొంతు ఎందుకు మూగబోయిందని నిలదీశారు. ప్రతి క్షణం ప్రజాస్వామ్యం పరిరక్షణ అంటూ జపం చేసే జగన్ కు ఈ ఘటనలో ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మమత విషయంలో కేంద్రం చర్యను తప్పు బట్టడం హర్షించదగ్గ విషయం అని చెప్పారు. ప్రజాస్వామ్య విలువల్ని కాపాడడంలో అందరూ కలసి వస్తేనే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఎవరు ఎన్ని కబుర్లు చెప్పినా, విమర్శలు గుప్పించిన చంద్రబాబు స్థాయి రాజకీయాలేంటో యావత్ దేశానికి అర్థం అయ్యిందని చెప్పారు. నేరుగా కోల్ కతా వెళ్లి మమతా బెనర్జీకీ నైతిక స్థైర్యాన్ని ఇచ్చేలా చంద్రబాబు వ్యవహరించారని తెలిపారు. దేశంలోనే సిన్సియర్ సీనియర్ పొలిటీషియన్‌గా చంద్రబాబు అందరికీ మార్గదర్శకంగా నిలిచారని కలిశెట్టి విశ్లేషించారు.

విజయనగర గడ్డకు రుణపడి ఉంటా

సంగీత కళాశాల శతజయంతి ఉత్సవాల్లో గాన కోకిల పి.సుశీల



విజయనగరం, న్యూస్‌లీడర్: నేనూ ఈ ఊరి బిడ్డనే. ఇక్కడ ప్రజల ఆశీర్వాదంతోనే ఎదిగా. ఈ గడ్డకు ఎప్పుడూ రుణపడి ఉంటాన'ని గానకోకిల పి.సుశీల అన్నారు. మహారాజ సంగీత, నృత్య కళాశాల ముగింపు వేడుకలకు ఆమె కుటుంబ సభ్యులతో కలసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నేను చదివిన పాఠశాలకు నూరేళ్ల పండగని చెప్పారు. మీ ఆశీస్సులు అందరికీ కావాలన్నారు. ఆ ఉత్సవాన్ని కన్నులారా చూడాలని వచ్చాను. ఇంతటి వైభోగం చూసి చాలా సంతోషంగా ఉంద'ని అన్నారు. ఘంటసాల విగ్రహాన్ని తాను ఆవిష్కరించడం కాస్త బాధగా అనిపించిందని చెప్పారు. ఆయనతో కలసి ఎన్నో పాటలు పాడానని గుర్తు చేసుకున్నారు. అందరి హృదయాల్లో ఘంటసాల ఉంటారని చెప్పారు. అటువంటి మహా గాయకుడి విగ్రహాన్ని మన విజయనగరంలో, సంగీత కళాశాలలో పెట్టడం మధురమైన ఘట్టమని కొనియాడారు. తాను పాటలు పాడినప్పుడు రూ.500, రూ.వెయ్యి మాత్రమే ఇచ్చేవారని తెలిపారు. కళాశాల వందేళ్ల వేడుక కనీవినీ ఎరుగని రీతిలో చేశారని, తనకే నమ్మశక్యంగా లేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కలెక్టర్ ఎం.హరిజవహర్‌లాల్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. మరిన్ని కళాశాలల వేడుకలకు ఇది ఆదర్శమని చెప్పారు. ఈ వేడుకలకు తన కుటుంబంతో కలసి వచ్చానని చెబుతూ.. పేరుపేరునా వేదిక మీదకు పిలిచి అందరికీ పరిచయం చేశారు. అందరి కోరిక మేరకు సుశీల పలు చిత్రాల్లోని పాటలను పాడి వినిపించారు. భక్త ప్రహ్లాద చిత్రంలోని నమో నారాయణాయ.. నారాయణ మంత్రం.. శ్రీమన్నారాయణ మంత్రం అని ఆమె ఆలపించిన పాటకు.. ఆహూతులు కరతాళ ధ్వనులతో జత కలిపారు. అలిగిన వేళనే చూడాలి.. నా పాట, నీ నోట పాడాలి చిలకా.. అంటూ పాడుతూనే, వయస్సు అయిపోతుంది కదా! గొంతు సహకరించడం లేదని చమత్కరించారు. ఘంటసాల కుమారుడు రత్నకుమార్ మాట్లాడుతూ ఈ కళాశాలను మరో వందేళ్లు ఉండేలా రూపొందించారని, తన తండ్రి ఉంటే ఎంతో ఆనందించేవారని చెప్పారు. ఆయన విగ్రహం ఇక్కడ ఆవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఘంటసాల ఆత్మ ఈ కళాశాల చుట్టూనే తిరుగుతుందన్నారు.


పురస్కారాలు ప్రదానం: అనంతరం సుశీలకు శత వసంతాల పురస్కారాన్ని అందజేసి, రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఘంటసాల రత్నకుమార్‌కు పురస్కారంతోపాటు.. రూ.3 లక్షల చెక్కును అందజేశారు. ద్వారం మంగతాయారుకు శత వసంతాల పురస్కారాన్ని, రూ.3 లక్షల చెక్కును అందించి సత్కరించారు.

ద్వారం, ఘంటసాల విగ్రహాల ఆవిష్కరణ: కళాశాల ప్రాంగణంలోని ద్వారం వెంకటస్వామినాయుడు విగ్రహాన్ని జిల్లా పరిషత్తు అధ్యక్షురాలు శోభా స్వాతిరాణి, కలెక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ ఆవిష్కరించారు. ఘంటసాల విగ్రహాన్ని పి.సుశీలతోపాటు, ఘంటసాల రత్నకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్వాంసులతో నిర్వహించిన విజయనగరం మృదంగ వైభవం(లయ్య విన్యాసం) ఆహూతుల ప్రశంసలు అందుకుంది. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, జేసీ-2 జె.సీతారామారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర వహించిన అందరినీ ఘనంగా సత్కరించారు.

సంచలన వార్తా పత్రిక
లీడర్
విశాఖపట్నం | గురువారం 7-2-2019

ఆ ఇద్దరూ మోదీ కనుసన్నల్లోనే.. చంద్రబాబు

అమరావతి: అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా బడ్జెట్ను ప్రవేశపెట్టామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర బడ్జెట్ పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని చెప్పారు. తెదేపా నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్ని ఆర్థిక కష్టాలున్నా.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామంటే మన సమర్థతే కార ణమన్నారు. సమాజంలో ఎవరినీ నిరాదరణకు గురికానివ్వ మని చెప్పారు. తెరాస అధినేత కేసీఆర్, వైకాపా అధ్యక్షుడు జగన్ తప్ప బెంగాల్ చర్యను అంతా ఖండించారని.. దీంతో ఆ ఇద్దరూ ప్రధాని మోదీ కనుసన్నల్లో ఉన్నారన్నది సుస్పష్టమైందన్నారు. కుల, మత విద్వేషాలతో అమాయకులకు వల పన్నుతున్నారని చంద్రబాబు ఆరోపించారు. పేదరిక నిర్మూలనే తమ కులమని.. పేదరికంలో ఉన్నవారిని గుర్తించి తోడ్పాటు అందించే



ఏకైక పార్టీ తెదేపా అని సీఎం అన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అందర్నీ పైకి తీసుకొస్తామని చెప్పారు. వ్యవసాయం పండగ పేరిట రైతులకు చెక్కులిచ్చే కార్యక్రమాన్ని త్వరలో చేపడ తామని చంద్రబాబు వివరించారు.

ఇదేం జర్నలిజం



ఛీ ఛీ..ఏమిటీ జీవితం.. మోడీ చేస్తే రంకు..బాబు చేస్తే సంసారం..జర్నలిస్ట్ అని చెప్పుకోనడానికే సిగ్గేస్తోంది. నిజమే... ఎంత వైరాగ్యం ఆవరిస్తే అంత మాట న్నట్టు..? చాలా సీనియర్ జర్నలిస్టు తను... ఛీ నేను తెలుగు మీడియాలో ఉన్నాను అని చెప్పుకోవటానికి చాలా అసహ్యంగా అవమానంగా ఉంది అన్నాడు. ఎందుకూ అంటారా..? మొన్న మొన్ననే కదా... మోడీ ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ను ఉద్దేశించి తెలుగు చానెళ్లు, పత్రికలు, సైట్లు, టీవీ డిబేట్లలో వీర వక్తలు ఎట్సెట్రా దుర్మార్గం, దుస్సంప్రదాయం, రాజ్యాంగవిరుద్ధం అని ఆడిపోసుకున్నారు కదా... ఆయ్ త్వరలో ఎన్ని కల నోటిఫికేషన్ పెట్టుకుని, కేవలం ముఖ్యమైన ఖర్చులకు ఆమోదం పొందాల్సింది పోయి. కొత్త పథకాలు ప్రకటిస్తావా..? నువ్వేం ప్రధానివి..? నీదేం తల కాయ్..? మొత్తం సిస్టమ్ను ఆచారాల్ని, ఆనవాయితీల్ని, మర్యాదల్ని భ్రష్టుపట్టిస్తున్నావు. ధూ... అని కదా వీళ్లంతా తిట్టిపోసింది... మరి ఇప్పుడేం జరిగింది..? సేమ్, ఏపీ అనబడే ఓ ప్రత్యేక దేశానికి ప్రధానిగా భావించే చంద్రబాబు కూడా ఓ బడ్జెట్ పెట్టాడు... అదీ ఓటాన్ అకౌంట్ బడ్జెటే... తనకూ త్వరలో ఎన్ని కలే. మరి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అన్న ప్పుడు, సోకాల్డ్ తెలుగు మీడియా లెక్కల్లో చెప్పాలంటే కేవలం ముఖ్యమైన ఖర్చులకు ఆమోదం మాత్రమే తీసుకోవాలి కదా, లేకపోతే అత్యంత దుర్మార్గమే అని తిట్టిపోశారు కదా.. మరి తను కూడా అయిదారు పథకాల్ని ప్రకటించిపారేశాడు. ఇంకేముంది..? మోడీని ఆడిపోసుకున్న ఆ టీవీలు, ఆ పత్రికలు, ఆ సైట్లు, ఆ టీవీ డిబేట్ల వీరవక్తలు అంతా ఇప్పుడు ఆహా చంద్రబాబు, ఓహో చంద్రబాబు అంటూ.. వరాలజల్లు. సంక్షేమ ఒరవడి. ప్రగతి ఉరవడి అనీ ఉదయం నుంచి కీర్తనలు అందుకున్నారు. వాటిల్లో ముఖ్యమైనది అన్నదాతా సుఖీభవ... మరి మోడీ ప్రకటించిందీ అదే కదా... (నిజానికి కేసీయార్ ఓటాన్ అకౌంట్లో గనుక ఇలాంటి స్కీమ్స్ ప్రకటించి ఉంటే నైతికంగా తప్పేమీ లేదు. ఎందుకంటే ప్రజలు తనకు ఆల్ రెడీ మరో అయిదేళ్ల అధికారానికి సరిపడా తీర్పు ఇచ్చేశారు. ఓటాన్ అకౌంట్ అయినంతమాత్రాన కీలకనిర్ణయాలు ప్రకటించకూడదని రాజ్యాంగంలో ఎవరు చెప్పారో, ఎక్కడ చెప్పారో తెలుగు మీడియా డిబేట్ల వీరవక్తలే కాస్త క్లారిటీ ఇవ్వాలి జనానికి!) మోడీ ప్రకటించిన కొత్త పథకాలేమో వోట్ల యావలో ప్రకటించినవీ, ఎన్నికల బడ్జెట్లు, వోట్ల వలలు ఎట్సెట్రా అన్నారు... అచ్చంగా చంద్రబాబు కూడా అదే చేస్తే, వరాలవర్షం, సంక్షేమసునామీ, రైతన్నకు ఇక బంగారు రోజులు అయిపోయాయా..? కానీ మీడియా పార్టీల నేతల్ని మించి రంగులు పూసుకుని, పోతురాజుల్లా ఎగురుతున్న తీరే ఇక్కడ అభ్యంతరకరం..

ఓ రాజకీయ విశ్లేషకుడి భాషలో చెప్పాలంటే, మన తెగులు మీడి యాకు "ఈ మిగులు రెవిన్యూ లోటు బడ్జెట్" నభూతోనభవిష్యత్...సర్కార్ వేసే నూకలు కోసం పత్రికా విలువల వలువలను నిసిగ్గుగా విప్పేసి ఫోర్త్ ఎస్టేట్ని ఓ రియల్ ఎస్టేట్లా మార్చేసిన పచ్చ పత్రికలు ఛానెళ్లు ఓ సారి ఇదేం జర్నలిజం అని తమనితాము ప్రశ్నించుకోవాలి.. కాదంటారా?

దీదీ గెలిచిందా? ఓడిందా?



(ప్రత్యేక ప్రతినిధి)

క్రిందపడ్డా నేనే గెలిచాఅనేరకం బెంగాల్ టైగం బెనర్జీ తత్వం.సాధారణంగా ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీ ఏం చెబుతుంది..? మాదే నైతిక విజయం అని చెబుతుంది... ఏడ్వలేక..! ఇంకేమీ చేయాలో అర్థం గాక.. ఫాల్స్ ప్రిస్టేజీ... సేమ్, మమతా బెనర్జీ అనే నాయకురాలూ అంతే.. దీదీ వర్సెస్ మోదీ వివాదంలో సుప్రీం కోర్టు తాజా ఆదేశాలు విని, నాదే నైతిక విజయం అంటున్నది. నా పోరాటం సుప్రీంపై కాదు. సీబీఐపై కాదు. కేవలం మోడీపైనే అంటూ ఓ కొత్త పాట అందుకున్నది... ఏం స్పందించాలో తెలియక సోకాల్డ్ మమత ఫ్రెండ్స్ చంద్రబాబు, కేజ్రీవాల్, కనిమొళి. కుమారస్వామి, రాహుల్, ఫరూక్ అబ్దుల్లా ఎట్సెట్రాలంతా సైలెంటు.. తను అడ్డుకున్నదే సీబీఐని.. తను అడ్డుకున్నదే సుప్రీం పర్యవేక్షణలో సాగే రెండు భారీ స్కాముల దర్యాప్తును... ఇప్పుడేమో నేను మోడీకే వ్యతిరేకం, నాదే నైతిక విజయం అంటూ సగటు భారతీయ రాజకీయ నాయకురాలి తరహాలో 'దిక్కుమాలిన తనాన్ని' నిస్సిగ్గుగా ప్రదర్శించింది సోకాల్డ్ ఆడపులి మమతా బెనర్జీ. వేల కోట్ల స్కాముల్లో బాధితుల సంగతి అక్కర్లేదు. తన పోలీస్ కమిషనరట. అత్యుత్తమ అధికారట. సీబీఐ అరెస్టు చేయకూడదట. సీబీఐ తన రాష్ట్రంలోకి రావద్దట... అసలు సుప్రీం కోర్టు ఏమిటి, దాని కథేమిటీ అన్న తరహాలో అర్ధరాత్రి దీక్షకు దిగి, ఓ డ్రామాకు తెరతీసిన సంగతి తెలుసు కదా... ఇప్పుడు సుప్రీం ఏమన్నది..? ఒరేయ్, నాన్నా. తప్పదు, నువ్వు సీబీఐ విచారణకు హాజరు కావాలి అని చెప్పింది... అయితే కోల్కత్తాలో జరిగితే అదెలా ఉంటుందో సుప్రీం చూస్తున్నది కదా. అందుకని తటస్థ వేదిక షిల్లాంగులో దర్యాప్తు చేయండీ అని చెప్పింది... అంటే మమత తాలూకు దుందుడుకు ధోరణి మాకు తెలుసు. ఏ ప్రభావమూ లేనిచోట సదరు పోలీస్ కమిషనర్ని కాస్త ఆడుకోండి అని చెప్పినట్టే... అంతేకాదు, సుప్రీం పర్యవేక్షిస్తున్న దర్యాప్తును ఎందుకు అడ్డుకుంటున్నారో వెంటనే సమాధానం చెప్పాలంటూ బెంగాల్ చీఫ్ సెక్రెటరీని, డీజీపీని ఆదేశించింది. ఒకరకంగా తేడా వస్తే బహుపరాక్ అని హెచ్చరించినట్టు ఇది.! కాగా, ఇది నైతిక విజయమట ఆమెకు.. సగటు రాజకీయ నాయకురాలికీ ఆమెకూ తేడా ఏమున్నట్టు ఇక..? మావి రాష్ట్రాలు కావు, మావన్నీ ప్రత్యేక దేశాలు, మేమే ఆయా ప్రాంతాలకు నియంతలం అని విర్రవీగే ప్రతి పాలకుడికీ ఇది. ఓ పాఠం.. అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ, వారి రక్షణ కోసం కేంద్ర సంస్థలను రాష్ట్రాల్లోకి అనుమతించని ప్రతి ఒక్కరికీ ఇదే పాఠం.. అది చంద్రబాబు కావచ్చు. సీబీఐని అడ్డుకునే ప్రతి రాష్ట్రానికి ఇది ఓ పాఠమే... నిజానికి మోడీ అనే ఓ అసమర్థ నాయకుడికి నిజంగా చేతనైతే, ఇప్పటికే సీబీఐ అధికారాలకు సంబంధించి ఓ చట్టం తీసుకొచ్చేవాడు... ఇప్పుడు డీవోపీటీ సర్వీస్ రూల్స్ మారుస్తూ ఓ ఉత్తర్వు తీసుకొస్తాడట... (ఏమో, డౌటే, తనకు అదీ చేతనవుతుందో లేదో... ఆల్ ఇండియా సర్వీస్ అధికారులందరిపైనా క్రమశిక్షణ చర్యలు, పనితీరు అంచనాల్ని కేంద్రం తన పరిధిలోకి తీసుకొచ్చేలా ఆ ఉత్తర్వులు ఉంటాయట. మంచిదే... భయానికో భక్తికో ఐఏఎస్, ఐపీఎస్ ఎట్సెట్రా అధికారులంతా కేంద్రానికి సరెండర్ అవుతారు... రాష్ట్రాన్ని పాలించే పార్టీల రాజకీయ భావజాలానికి అనుగుణంగా గాకుండా కేంద్రానికి బద్ధులై ఉంటారు. ఇక.. (అఫ్ కోర్స్. అదీ ఒకింత అప్రజాస్వామికమే. కానీ ఇప్పుడు మమత, చంద్రబాబు వంటి నేతల ధోరణులను చూస్తుంటే అదీ అవసరమే అనిపిస్తున్నది... ప్రత్యేకించి రాహుల్ వంటి నేతలు...) నిజంగానే ఆ ఉత్తర్వులు గనుక మోడీకి చేతనైతే (ప్రశ్నార్థకమే... ఫస్ట్ ఇరుకునపడేది చంద్రబాబు వంటి నేతలే... తమ సామాజికవర్గం నేతల్ని కీలకపదవుల్లో ఉంచి. ఆటలు ఆడాలనుకునే నేతలకు ఇది విరుగుడే. సరే, ఇదంతా వదిలేస్తే, సీబీఐ రావద్దు. ఎన్ఐఏ రావద్దు. ఈడీ రావద్దు. అంతా మా ఇష్టం. మేం ఎలాగైనా దోచుకుంటాం, దోచుకోవడం కోసమే ప్రజలు మాకు వోట్లేశారు అనుకునే రాజకీయ నాయకులకు తాజా సుప్రీం ఆదేశాలు మింగుడుపడవు. చూద్దాం, రేపు రేపు ఇది ఏ టర్నులు తీసుకోబోతున్నదే...

సరైన సమయంలో ఎన్డీఏను వీడుతాం



ఎన్పీపీ అధినేత సంగ్మ

షిల్లాంగ్: లోక్సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈశాన్య భారతంలో ఎన్డీయే కూటమికి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వివాదాస్పద పౌరసత్వ బిల్లు-2016ను ఈశాన్య ప్రాంతంలోని పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో కొనసాగుతున్న పార్టీలు బిల్లుకు నిరసనగా బయటకు రావాలని యోచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మేఘాలయ ముఖ్యమంత్రి, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్పీపీ) అధినేత కాన్రాడ్ సంగ్మా వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.ఎన్డీయేతో సంబంధాలు తెంచుకునేందుకు తగిన సమయంకోసం ఎదురుచుస్తున్నామని సంగ్మా అన్నారు. పౌరసత్వ బిల్లుకు రాజ్యసభలో తమ పార్టీ సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేస్తారని ఆయన స్పష్టంచేశారు. మేఘాలయ అసెంబ్లీలో ఇద్దరు శాసన సభ్యులున్న బీజేపీ, ఇతర పార్టీల మద్దతుతో గత ఏడాది సంగ్మా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మేఘాలయతో పాటు మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్లో ఎన్పీపీ, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాలే నడుస్తున్నాయి. మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్లో బీజేపీకి సంగ్మా మద్దతు ప్రకటించడంతో అక్కడ బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. ఎన్డీయే కూటమి నుంచి ఎన్పీపీ బయటకు వచ్చినట్లయితే ఆ రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు పడిపోయే అవకాశం ఉంది.మేఘాలయలో కాంగ్రెస్ 21 సీట్లు గెలిచి అతిపెద్ద పార్టీగా నిలిచినా.. రెండే సీట్లు గెలిచిన బీజేపీ ఇతరుల మద్దతు కూడగట్టి ఎన్పీపీ అధికారంలోకి వచ్చేలా చక్రం తిప్పింది. బీజేపీ నుంచి విడిపోతే మేఘలయ తమకు ఇతర ప్రాంతీయ పార్టీల మద్దతు ఉందని సంగ్మా ఇదివరకు ప్రకటించారు. మరికొన్ని పార్టీలు కూడా బీజేపీని వీడేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈశాన్యంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారనున్నాయి. కాగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పౌరసత్వ బిల్లుపై ఈశాన్య రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం లోక్సభలో ఆమోదం పొందిన బిల్లును త్వరలోనే రాజ్యసభ ప్రవేశపెట్టనున్నారు.

కిడ్నీ వ్యాధితో ఎంపీ కన్నుమూత



భువనేశ్వర్: బిజూ జనతా దళ్ సీనియర్ నేత, ఎంపీ లడు కిశోర్ స్వైన్ (71) కన్నుమూశారు. గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన.. భువనేశ్వర్లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నిన్న రాత్రి మృతిచెందారు. 2004లో కబిసూర్యనగర్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన లడు కిశోర్.. 2014లో అస్కా ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. కిశోర్ మృతిపట్ల ఒడిశా సీఎం నవీన్పట్నాయక్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శాసనమండలి ఛైర్మన్ పదవికి నోటిఫికేషన్ జారీ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఛైర్మన్ పదవికి నోటిఫికేషన్ జారీ అయింది. శాసన మండలి ఇన్ఛార్జ్ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఈ మేరకు సభలో ప్రకటన జారీ చేశారు. ఇవాళ సాయంత్రం 5 గంటలలోపు మండలి కార్యదర్శికి నామినేషన్లు అందజేయాలని ఆయన సూచించారు. గురువారం ఉదయం శాసనమండలి ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు సుబ్రహ్మణ్యం ప్రకటించారు. శాసనమండలి ఛైర్మన్ అభ్యర్థిగా షరీఫ్ పేరును అధికార తెదేపా ఇప్పటికే ఖరారు చేసింది. ఆయన ఇవాళ నామినేషన్ దాఖలు చేయనున్నారు. తెదేపాకు సభలో పూర్తి మెజార్టీ ఉన్న నేపథ్యంలో షరీఫ్ ఎన్నిక లాంఛనం కానుంది.

8న ఎఫ్బిబి కలర్స్ ఫెమినా ఆడిషన్స్

విశాఖపట్నం, న్యూస్లీడర్ : ఫ్యాషన్, సౌందర్య ప్రపంచంలో ఐకాన్గా మారిత ప్రతిభావంతమైన యు వతుల జీవితాలను మార్చివేసే పరంపరతో ఎఫ్బిబి కలర్స్ ఫెమినా మిస్ ఇండియా పోటీలు ఈనెల 8వతేదీన విశాఖలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు బీచ్రోడ్డులోని నోవోటెల్ హెటల్ వేదిక కానుంది. ఎందరో అందగత్తెలు ఈ కిరీటం కోసం ప్రాకులా డారు. ఇప్పుడు జరిగే పోటీల్లో కిరీటాన్ని ఎవరు సొం తంచేసుకుంటారో వేచి చూడాల్సిందే. ఈ పోటీలు దేశవ్యాప్తంగా 30 రాష్ట్రాల్లో నిర్వహించడానికి సన్నా హాలు చేస్తున్నారు. సౌత్ ఇండియాలోని ఐదురాష్ట్రాల్లో అంటే మిస్ ఇండియా తమిళనాడు, మిస్ఇండియా తెలంగాణ, మిస్ఇండియా ఆంధ్రప్రదేశ్, మిస్ఇండి యా కేరళ, మిస్ఇండియా కర్నాటకలనుంచి అత్యంత అర్హతగల అభ్యర్ధులు ముంబైలో జూన్లో జరిగే గ్రాండ్ ఫినాలెలో తమ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిం చనున్నారు. ఈ సందర్భంగా దియా మీర్జా మాట్లా డుతూ మిస్ఇండియా అనేది నా జీవితంలో ఒక దృష్టికోణ మార్పును కలుగచేసిందని ఇప్పుడు పాల్గొ నే యువతులకు అదే అనుభవం కలుగుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. యువతుల స్వప్నాలను సాకా రం చేయడానికి తన శక్తివంచనలేకుండా కృషి జేస్తా నన్నారు. ఇందులోపాల్గొనే యువతులు ఏరాష్ట్రానికి చెందిన వారో తెలియజేసే సర్టిఫికెట్లు, తల్లిదండ్రుల వివరాలతోపాటు ఎత్తు ఐదుఅడుగుల ఐదు అంగుళాలు, వయస్సు 18-25, 26-27 సంవత్సరాలున్న యువతులు రన్నర్అప్కు అర్హులని, ఓసిఐ కార్డ్ హెూల్డర్స్ కూడా రన్నరప్ స్థానానికి అర్హులు. గ్రాండ్ ఫినాలేలో పాల్గొనడానికి ముందు ఉత్తమ నిపుణులు నుంచి కఠిన శిక్షణ, గ్రూమింగ్ సమావేశాలు పొందా లన్నారు. అన్ని వివరాలు తెలియజేస్తూ డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు.మిస్ఇండియా.ఇన్కు లాగిన్ అవ్వాలని ఫోటోలను ప్రొఫైల్స్నుమిస్ఇండియా ఆర్గనైజేషన్ ఎట్దిరేటాఫ్ జిమెయిల్డాట్కామ్కు పంపించా లన్నారు.

విశిష్ట సేవలందించిన డాగ్ 'బిందు' మృతి



విజయనగరం : పోలీస్శాఖలో విశిష్ఠసేవలందించిన పోలీస్ డాగ్ బిందు మృతి చెందిందని విజయనగరం జిల్లా అదనపు ఎస్పీ ఎం నర్సిం హారావు తెలిపారు. ఈ డాగ్ జర్మన్ షెపర్డ్ జాతికి చెందిందని, 2009 నుంచి 2010 వరకు హైదరాబాద్ ఇంటిలిజెన్స్ విభాగంలో శిక్షణ ఇచ్చి నట్టు చెప్పారు. గడచిన 10 సంవత్సరా లుగా ఎన్నో కీలక కేసుల్లో సమ స్యలు పరిష్కరించడానికి ఉపక రించిందన్నారు, అనారోగ్యకారణాల కార ణంగా మంగళవారం మృతిచెందిందని తెలిపారు. ప్రేలుడు పదార్థాలను కనుగొనటంలో ప్రత్యేక గుర్తింపు పొందిందని, 2014లో రేంజ్ డ్యూటీలో మీట్లో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. పోలీస్ సిబ్బంది నిర్వహించే పేరేడ్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచేదన్నారు. డాగ్ హ్యాండ్లరుగా ఎఆర్ కానిస్టేబుల్ ఎ ఉమా మహేశ్వరరావు వ్యవ హరించేవారన్నారు. బిందు అంత్యక్రియల్లో పోలీస్ పీఆర్వొ పి.వి.ఎన్,ఎస్. కోటేశ్వరరావుఆర్ఐ శంకరరావు, ఆర్ఎస్ఐ అప్పలస్వామి, డాగ్ హ్యాండలర్స్, జానీ శంకరరావు, ఇతర పోలీస్సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు బ్యాంక్ మేనేజర్లకు తీవ్ర గాయాలు

గుడిహత్నూర్ వద్ద రోడ్డు ప్రమాదం

గుడిహత్నూర్: ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారిపై ఈ ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. ఓ కారును వెనుక వైపు నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు బ్యాంకు ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్బీఐలో పని చేస్తున్న నలుగురు బ్యాంక్ మేనేజర్లు విధుల నిమిత్తం నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపు కారులో వెళ్తున్నారు. అదే మార్గంలో వెళున్న లారీ వెనుక నుంచి కారును ఢీకొట్టింది. నలుగురికి తీవ్ర గాయాలవడంతో ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని ఖానాపూర్ ఎస్బీఐ మేనేజర్ ప్రసాద్, తిమ్మాపూర్ ఎస్బీఐ మేనేజర్ బాలారెడ్డి, లింగాపూర్ ఎస్బీఐ మేనేజర్ నర్సయ్య, పెంబీ ఎస్బీఐ మేనేజర్ రణధీర్లుగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం




ఖమ్మం: రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం పాలైన సంఘటన ఖమ్మం జిల్లా నేల కొండపల్లి సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం ప్రకా రం.. నేలకొండపల్లి శివారులోని ప్రభుత్వ రెండుపడకల ఇళ్ల కాలనీకి చెందిన పాలపాటి వెంకటేశ్వర్లు (40), అతని ఇద్దరు కుమారులు కొదండరాం (8), ప్రణయ్ (6), తల్లి పిచ్చమ్మ (60) ముదిగొండలో శుభకార్యానికి ద్విచక్రవాహనంపై వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడి కక్కడే మృతిచెందారు.

స్పీకర్ పోచారంకు మాతృవియోగం

బాన్సువాడ: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి మాతృవియోగం కలిగింది. పోచారం తల్లి పరిగే పాపవ్వ(107) కన్నుమూశారు. బాన్సువాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గత రాత్రి పాపవ్వ తుదిశ్వాస విడిచారు. ఈరోజు పాపవ్వ అంత్యక్రియలు స్వగ్రామం పోచారంలో జరుగనున్నాయి. స్పీకర్ పోచారం తల్లి మృతి పట్ల టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు సంతాపం తెలిపారు.

టీడీపీలోకి ఆదిశేషగిరిరావు!



విజయవాడ: హీరో కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు గురువారం నాడు ఏపీ సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకోన్నునారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతుండగా, ఆదిశేషగిరిరావు చేరికను ఘనంగా జరిపిం చేందుకు టీడీపీ శ్రేణులు కృషి చేస్తున్నాయి. ఇప్పటికే నగర వ్యాప్తంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు అనేక ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కాగా, ఒకే సామాజిక వర్గమైనా, దాదాపు నాలుగు దశాబ్దాలుగా వేర్వేరు మార్గాల్లో ప్రయాణిస్తున్న నందమూరి, ఘట్టమనేని అభిమానులు ఒకే రాజకీయ వేదికపైకి వస్తుండటంతో ఇరు కుటుంబాల అభిమానుల్లో ఆనందో త్సాహాలు మిన్నంటుతున్నాయి. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తరువాత, కాంగ్రెస్లో చేరిన కృష్ణ, ఎంపీగా పోటీచేసి గెలిచి, కొంతకాలం రాజకీ యాల్లో రాణించారన్న సంగతి తెలిసిందే.

అమెరికాకు రండి.. కానీ

స్టేట్ ఆఫ్ యూనియన్ ప్రసంగంలో ట్రంప్



వాషింగ్టన్: ప్రతిభ ఉన్నవారు తమ దేశానికి రావాలనే ఉద్దేశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి బయటపెట్టారు. సోమవారం ఆయన యూఎస్ కాంగ్రెస్ను ఉద్దేశించి ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా వలసదారుల అంశాన్ని ప్రస్తావిస్తూ.. తమ దేశానికి వచ్చేవారు న్యాయపరంగా రావాలని కోరారు. అక్రమ వలసదారులు దేశానికి పెను ముప్పుగా ఆయన పేర్కొన్నారు. 'అమెరికన్ల ఉద్యో గాలు, వారి భవిష్యత్తుకు రక్షణ కల్పిస్తూ వలస వ్యవ స్థను రూపొందించడం మా నైతిక బాధ్యత. మా చట్టా లను గౌరవిస్తూ నేడు లక్షల మంది వలసదారులు అమెరికాలో నివసిస్తున్నారు. న్యాయపరంగా వచ్చే వలసదారులు మా దేశానికి ఎంతగానో ఉపయో గపడుతున్నారు.

విదేశీయులు ఇంకా ఎక్కువ మంది మా దేశానికి రావాలనే నేనూ కోరుకుంటున్నాను. కానీ వారు న్యాయపరంగా రావాలి' అని ట్రంప్ చెప్పుకొ చ్చారు.

ఈ సందర్భంగా మెక్సికోలో సరిహద్దు గోడ నిర్మాణాన్ని గురించి కూడా ట్రంప్ పస్తావించారు. మెక్సికో సరిహద్దులో గోడ లేకపోవడం ఆర్థిక పరంగా, భద్రత పరంగా దేశానికి పెను ముప్పుగా ఉందని ఆయన అన్నారు. అందుకే ఆ సరిహద్దు గోడను కట్టి తీరుతానని మరోసారి స్పష్టంగా చెప్పారు.

జయరామ్ హత్యకేసులో కీలక మలుపు..!

హైదరాబాద్: కోస్టల్ బ్యాంకు డైరెక్టర్ చిగురుపాటి జయరామ్ హత్య కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. కేసును తెలంగాణకు బదిలీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జయరామ్ హత్య కేసులో మేనకోడలు శిఖా చౌదరి పాత్రపై మృతుని భార్య పద్మశ్రీ అనుమానం వ్యక్త చేశారు. కేసును తెలంగాణ పోలీసులే దర్యాప్తు చేయాలని కోరుతూ జూబ్లీ హిల్స్ పోలీసులను ఆశ్రయించారు. గత నాలుగు రోజుల నుంచి ఆంధ్ర ప్రదేశ్ పోలీసులు తన భర్త హత్యపై రకరకాల ప్రచారాలు చేస్తూ, టీవీ సీరియల్స్లా సాగదీసి ఏమాత్రం తేల్చలేకపోయారని, ఈ నేపథ్యంలో ఆంధ్రా పోలీసులపై నమ్మకం కోల్పోయానని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆమె ఫిర్యాదు చేశారు.కేసు వ్యవహారాలన్నీ తెలంగాణతో ముడిపడి ఉండడంతోనే జయరామ్ కేసును బదిలీ చేసినట్టు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. పద్మశ్రీ ఆరోపణల నేపథ్యంలో కేసును బదిలీ చేయకుండా మరింత వివాదాలకు తావు ఇవ్వకూడదని ఏపీ ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. జయరామ్ హత్య కేసులో శిఖాకు ఎలాంటి సంబంధం లేదని ఏపీ పోలీసులు చెప్పడంతో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

సొమ్ములొస్తున్నాయి..!



దిల్లీ: ఆర్బీఐ ఆడిట్ శరవేగంగా జరుగుతోంది. అర్ధ సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక నివేదిక త్వరలో బ్యాంక్ బోర్డు ముందుకు రానుంది. ఇది అందగానే ఆర్బీఐ ప్రభుత్వానికి అందజేయాల్సిన మధ్యంతర డివిడెండ్ను నిర్ణయిస్తారు. 2018 జులై నుంచి డిసెంబర్ మధ్య కాలానికి బ్యాంక్ లెక్కలను గణిస్తున్నారు. ఆడిట్ కమిటీలోని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ త్వరలో భేటీ కానున్నారు. ఈ భేటీలో వారు ఆరునెలల కాలానికి జరిగిన ఆడిట్ నివేదకను ఆమోదించనున్నారు. తొలిసారి అర్ధ సంవత్సరానికి ఆడిట్..ఆర్బీఐలో తొలిసారి అర్ధ సంవత్సరానికి ఆడిట్ నిర్వహిస్తున్నారు. దీనిని ఆడిట్ బోర్డు కమిటీ చేపట్టింది. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా అర్ధసంవత్సర ఆడిట్లను కొనసాగించనున్నారు. ఈ నేపథ్యంలోనే ఫిబ్రవరి 9వ తేదీన జరగాల్సిన పోస్టు బడ్జెట్ సమావేశాన్ని 18వ తేదీకి వాయిదా వేశారు. ఈ సమావేంలో ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ కూడా పాల్గొననున్నారు. ఆర్బీఐ గత డిసెంబర్లో బిమల్ జలాన్ నేతృత్వంలో ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ ఆర్బీఐ వద్ద ఎంత వరకు మిగులు నిధులను ఉంచుకోవచ్చో లెక్కగట్టనుంది. ఈ నివేదిక ఏప్రిల్లో అందనుంది. ప్రస్తుతం ప్రభుత్వానికి ఆర్బీఐ ప్రకటించే మధ్యంతర డెవిడెండ్ గతంలోని మిగులు నిధుల నిబంధనల ప్రకారమే చెల్లించనుంది.

మహిళా టీ20లో భారత్ ఓటమి

స్మృతి మంధాన పోరాటం వృథా



వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్ తొలి మ్యాచ్‌లో భారత మహిళల జట్టు ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ జట్టు 160 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా.. ఛేదనకు దిగిన హర్మన్‌ప్రీత్ సేన 136 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ స్మృతి మంధాన అర్ధశతకంతో రాణించినప్పటికీ మిగతా బ్యాట్స్‌విమెన్ పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత జట్టు న్యూజిలాండ్‌ను బ్యాటింగ్‌ను ఆహ్వానించింది. నిర్దేశిత 20 ఓవర్లలో కివీస్ జట్టు 4 వికెట్లు కోల్పోయి 159 పరుగులు సాధించింది. సోఫీ డివైన్(62) అర్ధశతకంతో రాణించింది. అరుంధతి రెడ్డి, రాధా యాదవ్, దీప్తీ శర్మ, పూనమ్ యాదవ్ ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత ఛేదనకు దిగిన హర్మన్‌ప్రీత్ సేన ఆదిలోనే తడబడింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ప్రియా పునియా ఔటయ్యింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన జెమిమా రొడ్రిగస్‌తో కలిసి ఓపెనర్ స్మృతి మంధాన ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఈ క్రమంలో స్మృతి అర్ధ శతకం నమోదుచేసింది. అయితే 12వ ఓవర్‌లో స్మృతి, 13వ ఓవర్‌లో జెమిమా ఔట్ అవడంతో భారత జట్టు కష్టాల్లో పడింది. ఆ తర్వాత వచ్చిన బ్యాట్స్‌విమెన్ ఎవరూ క్రీజులో కుదురుకోలేకపోయారు. దీంతో ఇంకా ఐదు బంతులు మిగిలి ఉండగానే భారత జట్టు 136 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్ జట్టు 1-0తో ఆధిక్యంలోకి వచ్చింది.

ఘనంగా వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో బుధవారం ఆత్మార్పణ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఈసందర్భంగా నారాయణసేవ ఏర్పాటు చేసారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి కాముకుడైన విష్ణువర్ధనుని కామతృష్ణను జయించడం కోసం ధర్మాన్ని ఆయుధంగా చేసుకుని ధర్మరక్షణ కోసం వైశ్యజాతి జాగృతపరచి తనతోపాటు 102 మంది ఆర్యవైశ్య దంపతులను అగ్ని గుండంలోకి నడిపించిన రోజు మాఘ శుద్ధి విదియ, ఆ రోజును ఆత్మార్పణ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీ వస్తోందని దేవాలయ కమిటీ కార్యదర్శి పూసర్ల సురేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యప్రముఖులు కంకటాల మల్లిక్, ఎంకె సీతారామయ్య, యలమర్తి హరనాథ్, విన్నకోట రామమూర్తి, వి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు కొంగకు కజిన్



సామాజిక మాధ్యమాల వెల్లువలో అంతగా పరిచయం లేని భామలు కూడా ఊహించని రీతిలో పాపులరైపోతున్నారు. పరిశ్రమలో పాక్షికంగా కెరీర్ ని సాగించే భామలు తమని తాము ఇన్ స్టాగ్రమ్ ట్విట్టర్‌లో ప్రచారం చేసుకుంటూ కొత్తగా అవకాశాలు చేజిక్కించుకుంటున్నారు. కొద్దో గొప్పో పరిచయం ఉన్న భామలైతే ఇంకా అదనపు పాపులారిటీ కోసం సామాజిక మాధ్యమాల్ని ఆశ్రయిస్తున్నారు. వేడెక్కించే హాట్ ఫోటోషూట్లను సామాజిక మాధ్యమాల ద్వారా షేర్ చేస్తూ యువతరంలో హాట్ టాపిక్ అవుతున్నారు. ఆ క్రమంలోనే ఇప్పటికే ఎందరో టాప్ మోడల్స్ కథానాయికలుగానూ అవకాశాలు అందుకున్నారు. లేటెస్ట్‌గా టాప్ మోడల్ .. బాలీవుడ్ నటి రుహి సింగ్ హీటెక్కించే బికినీ ఫోటోని ఇన్ స్టాగ్రమ్‌లో షేర్ చేసింది. ఈ ఫోటో కుర్రకారు గుండెల్లో గుబులు రేపుతోంది. అసలే ఆరడుగుల ఎత్తు ఉన్న ఈ అమ్మడు ఆ పాదం అంచుల్ని గాల్లోకి లేపి కళ్లు తిప్పుకోనివ్వని భంగిమతో మైమరిపించింది. కొల్లేటి నుంచి దారి తప్పిన స్టార్క్ లా టూ హైట్ గా ఉందంటూ కామెంట్లు చేస్తున్నారు బోయ్స్. ఇలా ఫోజివ్వడమే కాదు.. దానికి తగ్గ కామెంట్ ని ఈ అమ్మడు పోస్ట్ చేసింది. టెంప్ట్ మి విత్ ఏ గుడ్ టైమ్ అంటూ అదిరిపోయే వ్యాఖ్యను ఈ ఫోటోకి జోడించింది. స్కిన్ షోకి ఈ అమ్మడు ఏమాత్రం అడ్డు చెప్పదని ఈ ఫోటో చెప్పకనే చెబుతోంది. రుహీ అందచందాలకు ముగ్ధులై అవకాశాలిచ్చే దర్శకనిర్మాతలు ఉండకపోతారా? ఈ స్పీడ్ చూస్తుంటే ఒక్క ఛాన్సయినా ఇస్తామంటూ.. అమ్మడి వెంటపడడం ఖాయంగానే కనిపిస్తోంది.

ఆంగ్రియా క్రూజ్ పై ఆరెక్స్ పాప



ఫస్ట్ సినిమాతోనే హిట్ కొట్టాలంటే ఖచ్చితంగా లక్ కొంత ఉండాల్సిందే. అలాంటి లక్కు పాయల్ రాజ్ పుత్ కు కొంచెం కాదు.. ఎక్కువే ఉంది. అందుకే ఎంట్రీ సినిమాతోనే బ్లాక్ బస్టర్ సినిమా సాధించడమే కాకుండా.. నటనతోనూ.. బోల్డ్ కిస్సులతోనూ ప్రేక్షకులను క్లీన్ బౌల్డ్ చేసింది పాయల్ రాజ్ పుత్. ఆరెక్స్100' సినిమా సక్సెస్ తో సినిమా ఆఫర్లే కాదు బ్రాండ్ ఎండార్స్ మెంట్స్ కూడా అమ్మడి ఖాతాలో పడుతున్నాయి. ఈ భామ మిస్సొ మోర్ క్లోతింగ్ కు బ్రాండ్ అంబాజిడర్. దీంతో ఫోటో షూట్ కోసం మాంచి క్రూజ్ ఎక్కి మిస్సొ బ్రాండ్ దుస్తులు ధరించి తన హాట్నెస్ ను కాస్త బయటకు తీసింది. తన ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా ఈ ఫోటో షూట్ వీడియోలను పోస్ట్ చేసింది. ఈ వీడియోలకు "నాకు ఇష్టమైన బ్రాండ్స్ లో ఒకటైన మిస్సొ మోర్ క్లోతింగ్ కోసం షూటింగ్ లో పాల్గొంటున్నా" అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ఈ ఫోటో షూట్ ఎక్కడ జరిగిందని అనుకుంటున్నారు? ముంబై నుంచి గోవాకు వెళ్ళే ఆంగ్రియా క్రూజ్ పై. అందమైన బోటు.. ఆ బోటులో బ్లాక్ డ్రెస్ లో పాయల్ హీటు. తెగ రెచ్చిపోయి కెమెరాకు పోజులిచ్చింది. పాయల్ ఇలా పోజులిస్తే నెటిజనులు ఏమైపోవాలి? అందుకే వాళ్ళకు చేతనైన పని కాబట్టి లైకులు మాత్రం కొట్టారు. ఇక ఈ భామ ఫ్యూచర్ ప్రాజెక్టుల విషయానికి వస్తే ఈ బ్యూటీ తెలుగులో రవి తేజ కొత్త సినిమా 'డిస్కో రాజా' లో హీరోయిన్ గా ఎంపికైంది. నాగార్జున 'మన్మథుడు-2' లో కూడా హీరోయిన్ గా పాయల్ పేరును పరిశీలిస్తున్నర. ఇవి కాకుండా తమిళంలో కూడా ఒక సినిమా సైన్ చేసింది.

ఉక్కిరిబిక్కిరవుతున్న చైతన్య



యుద్ధం శరణం సవ్యసాచి లాంటి ఫ్లాప్ లు నాగచైతన్యకు ఇబ్బందిగా మారాయా? అంటే ఆ ఛాన్సే లేదని తాజా సీన్ చెబుతోంది. వరుస ఫ్లాపులున్నా చై కెరీర్ కి మాత్రం ఏ డోఖా లేదు. ఇప్పటికిప్పుడు చైతూ లైనప్ చూస్తే షాక్ తినాల్సిందే. ఈ ఏప్రిల్ లో వైఫ్ సామ్ తో కలిసి నటిస్తున్న మజిలీ రిలీజ్ కి రెడీ అవుతోంది. ఈలోగానే వరుసగా ప్రారంభోత్సవాలకు సన్నాహాలు చేస్తున్నాడు. వీటిలో తొలిగా మామ వెంకటేష్ తో కలిసి నటించే వెంకీ మామ మొదలు కానుంది. ఆ తర్వాత బిగ్ క్యూ ఉందని అక్కినేని కాంపౌండ్ సన్నిహిత వర్గాల ద్వారా తెలుస్తోంది. నాగచైతన్య ప్రస్తుతం వరుసగా స్క్రిప్టులు వింటున్నారు. వీటిలో క్రియేటివ్ గా అనిపించిన ఏ స్క్రిప్టును వదలడం లేదు. 2019-2020 సీజన్ లో అసలు క్షణం తీరిక అన్నదే దొరకడం కష్టం అని తాజా సన్నివేశం చెబుతోంది. ఇప్పటికే ప్రతిష్ఠాత్మక యు.వి.క్రియేషన్స్ లో ఓ సినిమాకి సన్నాహాలు చేస్తున్నాడు. ప్రస్తుతం స్క్రిప్టు పనులు సాగుతున్నాయి. అలాగే నాగార్జున స్నేహితుడు శివప్రసాద్ రెడ్డికి చెందిన కామాక్షి మూవీస్ బ్యానర్ లో ఓ సినిమా ఉంటుంది. ఈ మూవీకి జాతీయ అవార్డ్ గ్రహీత ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహించే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే దర్శకుడిని ఖరారు చేసి అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇటీవలే అగ్రనిర్మాత దిల్ రాజు నాగచైతన్యతో ఓ సినిమా ఉంటుందని ప్రకటించారు. దీనికి సంబంధించి స్క్రిప్టు పనులు సాగుతున్నాయి. జోష్ పరాజయానికి కసి తీర్చుకునే రేంజు స్క్రిప్టుతో రాజుగారితో చైతూ సినిమా ఉంటుందిట. అలాగే నాగార్జున హీరోగా రాజన్న వంటి హిస్టారికల్ మూవీని తెరకెక్కించిన దర్శకరచయిత విజయేంద్ర ప్రసాద్ ఇప్పటికే చైతూకి కథ చెప్పారట. ఆ కథ ఫైనల్ అయ్యిందా.. లేదా? అన్నది తెలియాల్సి ఉంది. ఇక పలువురు అసిస్టెంట్ డైరెక్టర్లు నాగచైతన్యకు కథ చెప్పి ఒప్పించే పనిలో ఉన్నారు. అలాగే అక్కినేని అభిమాని ఒకరు ఇప్పటికే నాగార్జున చైతూకి కథలు చెప్పే ఆలోచనలో ఉన్నారని తెలిసింది. ఇదిలా ఉంటే 2019 దసరాకి ఒకటి 2020 సంక్రాంతికి ఒకటి అక్కినేని హీరోలు నటించే సినిమాల రిలీజ్ లు తప్పనిసరిగా ఉండాల్సిందేనన్న ప్లాన్ ఆ కాంపౌండ్ లో ఉందిట. చైతూ - వెంకటేష్ కాంబినేషన్ లో తెరకెక్కనున్న వెంకీ మామ ఈ ఏడాది దసరా బరిలో రిలీజ్ కానుందన్న సమాచారం ఉంది. అలాగే 2020 సంక్రాంతి బరిలో నాగార్జున బంగార్రాజు రిలీజ్ కానుంది. ఇందులో నాగచైతన్యకు ఓ రోల్ ఉంటుందని తెలుస్తోంది. ఓవరాల్ గా చూస్తుంటే చైతూ ఊపిరి సలపని ఆఫర్లతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడనే చెప్పాలి.

జులియాతో అనుష్క చాట్



బాలీవుడ్ నటి అనుష్క శర్మలాగే ఉందంటూ కొన్ని రోజులుగా అమెరికన్ గాయని జులియా మైకెల్స్ ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. వీరిద్దరి ఫొటోలను పక్కపక్కన పెట్టి 'అనుష్కా.. నీకు చెల్లి ఉందా?' అంటూ నెటిజన్లు సరదాగా కామెంట్లు పెడుతున్నారు. ఇప్పుడు ఈ ఫొటో కాస్తా అనుష్క, జులియా కంటపడింది. దాంతో జులియా వెంటనే అనుష్కకు ట్విటర్‌లో ఈ ఫొటోను పోస్ట్ చేస్తూ.. 'హై అనుష్క.. మనమిద్దరం కవలలమట..' అని సరదాగా మెసేజ్ పెట్టారు. ఇందుకు అనుష్క స్పందిస్తూ.. 'ఓ మై గాడ్.. అవును. మనిషిని పోలిన మనుషులు ఆరుగురు ఉంటారట. నువ్వు కనిపించావ్ కాబట్టి మరో ఐదుగురి కోసం వెతుకుతున్నాను' అంటూ చమత్కరించారు. దాంతో వీరిద్దరి ట్విటర్ చాట్ కాస్తా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇటీవల బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్‌ను పోలి ఉన్న వ్యక్తి పాకిస్థాన్‌లో ప్రత్యక్షమయ్యాడు. నిజంగానే సల్మాన్ వచ్చాడనుకుని అతనితో సెల్ఫీ దిగడానికి పలువురు అభిమానులు ప్రయత్నించారట. గతంలో బాలీవుడ్ నటులు అజయ్ దేవగణ్, సైఫ్ అలీ ఖాన్, ప్రియాంక చోప్రా, ఆలియా భట్‌లను పోలి ఉన్న వ్యక్తుల ఫొటోలు కూడా బయటికి వచ్చాయి.

రామా అంటే బూతా ?



అదేం కాలంలో కానీ మంచి చెప్పే వారిని కూడా హేళనగా చూసే రోజులు వచ్చేశాయి. పెద్దవారు, ఎంతో జీవితం చూసిన వారు సమాజం గురించి నాలుగు మంచి మాటలు చెబుతామంటే వినే వారు లేరు. పోనీ దాన్ని అలా పక్కన పెడితే చెప్పిన వారిపై దెప్పి పొడుపులు సెటైర్లు వేయడమేంటి. సుప్రసిద్ధ సినీ నేపధ్యగాయకుడు, నిర్మాత, నటుడు బహుముఖీయమైన ప్రతిభా పాటవాలు కలిగిన గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తాజాగా కొన్ని కీలకమైన వ్యాఖ్యలు చేశారు. మహిళలు వస్త్ర ధారణ విషయమై పెద్దవానిగా, సమాజంలో పేరు ప్రఖ్యాతులు ఉన్న వానిగా తన మాట వినే వారుంటారని బాలు కొన్ని మాటలు మాట్లాడారు నలుగురు పెద్దవాళ్ళు ఉన్న చోట, పబ్లిక్ ఫంక్షన్లలో ఆడవాళ్ళు మంచి దుస్తులతో వస్తే బాగుంటుందని, పొట్టి దుస్తులు, కురచ బట్టలతో రావడం తగదని బాలు అన్నారు. ఇందులో తప్పేముంది.. . తిరుమలలో కూడా సంప్రదాయ వస్త్రాల్లో రావాలని ఆంక్షలు ఉన్నాయి. ఎందుకంటే పది మంది ఉన్న చోట పవిత్రత ఉండాలని, ఓ మంచి కార్యక్రమం పై ఏకాగ్రత చెడకుండా ఉండాలని అలా నియమం పెట్టారు. బాలు కూడా అన్నది అలాంటిదే. దీని మీద కొంతమంది సెలెబ్రిటీస్ సెటైర్లు వేస్తున్నారు. తెలిసీ తెలియక విమర్శలు కూడా చేస్తున్నారు. మహానుభావులు అంటూ వ్యంగ్యంగా మాట్లాడుతున్నారు. నిజానికి వ్యక్తిగత స్వేచ్ఛ అన్నది అందరికీ ఉంది. బాలు చెప్పినది దాన్ని భంగపరచమని కాదు. పది మందిలో ఉన్నపుడు కట్టు బొట్టు ఎలా ఉండాలో చెప్పారాయన. దాన్ని చిలవలు పలవలు చేసి మాట్లాడే వారు దీన్ని అర్ధం చేసుకోవాలి. ఇక దీని మీద సీనియర్ నటీమణి జయసుధ కూడా మద్దతు ఇస్తూ బాలు తప్పేమి మాట్లాడారు అంటూ ప్రశ్నించారు. భారతీయత మన సంస్కృతి గురించి చెబితే కుర్ర కారు అర్థం చేసుకోకపోవడానికి జనరేషన్ గ్యాప్ అనుకోవాలి. వారికి కూడా తెలిసేట్టు చెప్పాలి. కానీ వయసులో అన్ని విధాలుగా పెద్దవారు కూడా ఇలా పెడ ధోరణిలో మాట్లాడుతూంటే ఏమనాలో మరి. ఏది ఏమైనా మన కట్టు, బొట్టు అన్నవి చెప్పడంలో తప్పు లేదు. లేవని ఆవేదన వ్యక్తం చేయడంలోనూ తప్పు లేదు. అలా చెప్పడమే తప్పు అనడం మాత్రం మహా తప్పు. దీని నయా అభ్యుదయమనాలో మరేమనాలో తెలియడంలేదుగా.

డిజైనర్‌వేర్‌లో సోనమ్



బాలీవుడ్ లో ఉన్న టాప్ లీగ్ స్టార్ హీరోయిన్లలో సోనమ్ కపూర్ పేరును మనం తప్పనిసరిగా చెప్పుకోవాలి. పోయినేడాది తన బాయ్ ఫ్రెండ్ ఆనంద్ ఆహూజాను వివాహమాడి 'సోనమ్ కే. అహూజా' గా మారిపోయింది ఈ బ్యూటీ. కుమారిగా ఉన్నప్పుడైనా.. శ్రీమతిగా మారిన తర్వాతైనా.. ఎప్పుడైనా ఈ అమ్మడి రూటే సెపరేటు. బాలీవుడ్ లో ఫ్యాషనబుల్ గా ఉండేవారిలో సోనమ్ కు ఎప్పుడూ ఫస్ట్ ర్యాంకే. తాజాగా ఈ భామ బ్రైడ్స్ టుడే మ్యాగజైన్ కవర్ పేజిపై తళుక్కున మెరిసింది. ఈ ఫిబ్రవరి ఎడిషన్ కు మరో ప్రత్యేకత కూడా ఉంది.. అదేంటంటే.. బ్రైడ్స్ టుడే మ్యాగజైన్ వారి వార్షికోత్సవ సంచిక కావడమే. దీంతో సోనమ్ కవర్ పేజి అప్పియరెన్స్ మరీ ప్రత్యేకమైపోయింది. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ తరుణ్ తహిలాని డిజైన్ చేసిన బ్రౌన్ కలర్ గౌన్ లో సోనమ్ అందంగా కూర్చుంది. డిజైనర్ డ్రెస్ కు తగ్గట్టుగా మ్యాచింగ్ కమ్మలు.. గాజులు.. నెక్లెస్.. ఉంగరం ధరించి ఒక లగ్జరీ సోఫాకు దగ్గరగా కూర్చుంది. తన ఎడమ చేతిని ఆ సోఫాకు ఆన్చింది. సోనమ్ పెద్దగా గ్లామర్ షో చెయ్యలేదుగానీ ఆమెలో ఆకర్షించే అంశం.. ఆమె రింగుల జుట్టు. ఈ ఫోటో షూట్ కోసం ప్రత్యేకంగా ఇలా రెడీ అయింది. ఈ ఫోటోకు సోనమ్ ఇచ్చిన క్యాప్షన్ "బోల్డ్ బ్యూటిఫుల్.. కొంత రింగుల జుట్టు." జుట్టున్నమ్మ ఏ కొప్పేసినా అందమే అన్నట్టుగా అందమైన భామ ఏ దుస్తులు ధరించినా అందమే. సోనమ్ షేర్ చేసిన ఈ ఫోటోకు ఐదు గంటల్లోనే దాదాపు లక్ష లైకులు వచ్చాయి.

శబ్దంతో వినాశనం



ఈ మధ్య కాలంలో ఫాంటసీ సినిమాలు తగ్గిన తరుణంలో వస్తున్న కొత్త మూవీ సువర్ణ సుందరి. గత ఏడాదే షూటింగ్ పూర్తి చేసుకున్నప్పటికీ ఏవో కారణాల వల్ల విడుదల వాయిదా పడిన ఈ మూవీ ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ట్రైలర్ ను విడుదల చేసింది టీం. కథను పూర్తిగా రివీల్ చేయకపోయినా ఇందులో చూపించిన విజువల్స్ ని బట్టి ఇదో థ్రిల్లర్ ఫాంటసీ అని అర్థమైపోతోంది. పురాతన గనుల్లో దొరికిన ఓ విగ్రహానికి అశేషమైన శక్తులు ఉంటాయి. అది ఎవరి దగ్గర ఉంటే వాళ్ళకు ప్రతిదీ స్పష్టంగా వినిపిస్తుంది. అయితే పక్కన ఉన్న వాళ్ళను హత్య చేసేందుకు ఉసిగొలుపుతుంది. కాని దాని వెనుక ఎప్పుడో శతాబ్దాల నాటి పాత చరిత్ర ఉంటుంది. అదే సువర్ణ సుందరి కథ. అసలు ఆమె ఎవరు ఆ విగ్రహ రూపంలోకి ఎందుకు వచ్చింది ఇప్పుడు హత్యలకు ఎందుకు తెగబడుతోంది లాంటి ప్రశ్నలకు ట్రైలర్ లో సమాధానం దొరకడం కష్టం. జయప్రద లాంటి సీనియర్ ఆర్టిస్ట్ ఇందులో ఉండటం వల్ల నిండుతనం వచ్చింది. పూర్ణ-సాక్షి చౌదరిలు టైటిల్ కు సంబంధమున్న కీలక పాత్రల్లో నటిస్తుండగా హత్యలను ఛేధించే పోలీస్ ఆఫీసర్ గా సాయి కుమార్ కనిపిస్తున్నాడు. కోట శ్రీనివాస రావు-ముక్తార్ ఖాన్-అవినాష్ ఇతర కీలక పాత్రలు చేసారు. ప్లాట్ కొంత ఆసక్తికరంగానే అనిపిస్తోంది. గ్రాఫిక్స్ గురించి ఎక్కువ కామెంట్ చేయడానికి ట్రైలర్ లో ఛాన్స్ ఇవ్వలేదు. ఏంఎస్ఎన్ సూర్య దర్శకత్వం వహించిన ఈ మూవీకి సాయి కార్తీక్ సంగీతం అందించాడు. ఫాంటసీ నేపథ్యాన్ని బాగా ఇష్టపడే వాళ్ళకు కనెక్ట్ అయ్యేలా ఉన్న సువర్ణ సుందరి ఒకప్పటి ఏఎన్ఆర్ ఎవర్ గ్రీన్ క్లాసిక్ టైటిల్. మరి ఇప్పుడీ ట్రైలర్ తో రేపిన అంచనాలు ఎంతమేరకు నిలబెట్టుకుంటారో విడుదల దాకా వేచి చూడాలి.

న్యూలుక్‌లో శ్రీవిష్ణు



విభిన్న కథలు ఎంచుకుంటూ సినిమాలు చేసే టాలీవుడ్ హీరోలలో శ్రీవిష్ణు పేరును తప్పనిసరిగా చెప్పుకోవాలి. జయాపజయాలతో సంబంధం లేకుండా డిఫరెంట్ కంటెంట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు ప్రయత్నం చేస్తుంటాడు శ్రీవిష్ణు. ఇదే కోవలో ఈ యువ హీరో 'తిప్పరా మీసం' అనే సినిమాలో నటిస్తున్నాడు. ఈ మూవీ ఫస్ట్ లుక్ ను నిర్మాతలు రీసెంట్ గా విడుదల చేశారు. శ్రీవిష్ణుకు ఉన్న పేరుకు తగ్గట్టే ఫస్ట్ లుక్ డిఫరెంట్ గా ఉంది. పొడవాటి గడ్డం.. మెలిదిప్పిన బుర్రమీసాలు.. ఎడమవైపు సగం పగిలి ఉన్న కూలింగ్ గ్లాసెస్ - అందులోంచి సగం కనిపిస్తున్న కన్ను.. నుదుటిపై చిందరవందరగా పడి ఉన్న జుట్టుతో ఫుల్ మాసుగా.. రగ్డ్ గా ఉన్నాడు. వీటన్నిటికి తోడుగా సల్మాన్ భాయ్ టైపులో షర్ట్ లేని అవతారం. ఫస్ట్ లుక్ పోస్టర్ డార్క్ కలర్స్ తో వేసిన పెయింటింగ్ లా ఉంది. ఇక టైటిల్ లోగో డిజైన్ కూడా క్రియేటివిటీ చూపించి మరీ తెలుగు ఇంగ్లీష్.. టైటిల్స్ మధ్యలో బుర్ర మీసాన్ని పెట్టారు. ఈ సినిమాలో నిక్కి తంబోలి.. రోహిణి హీరోయిన్లుగా నటిస్తున్నాడు. సురేష్ బొబ్బిలి సంగీత దర్శకుడు. నారా రోహిత్ తో 'అసుర' చిత్రాన్ని తెరకెక్కించిన కృష్ణ విజయ్ 'తిప్పరా మీసం' సినిమాకు దర్శకుడు.

Printed, Published and Owned by V.V.Ramana Murthy and Printed at LEADER PRESS, 58-14-109/5, Block No. 113 A, VUDA Layout, Marripalem, Visakhapatnam - 530009, A.P. and Published at 47-10-7/3, Diamond Park Junction, Visakhapatnam - 530016, A.P.
EDITOR - V.V. RAMANA MURTHY, RNI NO: 72163/99, Registered Postal Regd. No. - VSP/211/2015-17 E-MAIL andhraleader@gmail.com, Telephone Nos. 0891-6660909, 93485 50909